www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 19-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 214 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: చవితి సా. 5.28 తదుపరి పంచమి; నక్షత్రం: ఆర్ద్ర మ. 2.56 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 2.53 -4.28; దుర్ముహూర్తం: ఉ. 8.39-9.24, రా. 9.48-10.38; అమృతఘడియలు: తె. ఉ. 6.50; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.25; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


కుంగదీస్తున్న మధుమేహం

36 శాతం బాధితుల్లో మానసిక సమస్యలు 2

ఒత్తిడి, కుంగుబాటు, కోపం, ఆందోళన, భయం, సిగ్గు, విచారం వంటివాటితో తీవ్రంగా సతమతం

జర్మనీ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

పరీక్షలు చేయించుకుని జాగ్రత్తపడాలని సూచన



ముమ్మాటికీ కుట్రే

చంద్రబాబు అరెస్టుకు పైస్థాయిలోనే పథకం

ఏకకాలంలో 3 విభాగాల్లో ఫైళ్లు మాయం

అందరూ కలిసే ఆ పని చేశారు

సీఎంవో, సీఐడీ, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం కలిస్తే తప్ప ఇది సాధ్యం కాదు

ఫైళ్ల మాయంతోనే కేసుకు బీజం

నా స్టేట్‌మెంట్‌ను సీఐడీ మార్చేసింది

నాడు స్కిల్ ప్రాజెక్టు సవ్యంగా జరిగింది

నిబంధనల ప్రకారమే చెల్లింపులు చేశారు

నాడు కుట్రలు చేసిన అధికారుల్లో కొందరు ఇంకా ఆ స్థానాల్లోనే ఉన్నారు

బాబును అరెస్ట్ చేయాలని జగన్ అనేవారు

దాంతో నాటి సీఎం సలహాదారులు, అధికారుల్లో కొందరు ఉత్సాహంగా పనిచేశారు

సమగ్ర విచారణకు డీజీపీకి లేఖ రాశా

ఏబీఎన్ డిబేట్‌లో రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్ట్ చేయడం వెనుక పెద్దకుట్ర జరిగిందని సీనియర్ ఐఏఎస్, నాటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పీవీ రమేశ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబును అరెస్ట్ చేయాలని సీఎం జగన్ అంటుండేవారని, అది తాను విన్నానని, ఈ విషయంలో సీఎం సలహాదారులతో పాటు కొందరు అధికారులు ఉత్సాహంగా పనిచేశారని చెప్పారు. చంద్రబాబును అరెస్ట్ చేయడం కోసం ఫైళ్లను మాయం చేశారని తెలిపారు. ఏకకాలంలో 3 విభాగాల్లో ఫైళ్లు కనిపించకుండా పోయాయని, అత్యున్నత స్థాయిలో నాటి సీఎంవో, సీఐడీ, స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు కలిస్తే తప్ప ఇది సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. సీఐడీ అధికారులకు తాను పంపిన స్టేట్‌మెంట్‌ను మార్చేశారని పీవీ రమేశ్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి ఏబీఎన్ డిబేట్‌లో

మిగతా 14వ పేజీలో...

> చంద్రబాబు లాంటి హైప్రొఫైల్ ఉన్న వ్యక్తినే ఇంత అన్యాయంగా కుట్రలు చేసి అరెస్టు చేస్తే, సామాన్యుల పరిస్థితి ఏంటి? ఇది ఒక్క వ్యక్తికి జరిగిన అన్యాయం కాదు, మొత్తం వ్యవస్థకే జరిగిన అన్యాయం. బాధ్యులంతా పెద్ద మనుషులు. ఈ కుట్రలను ప్రజల ముందు పెడితే పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. - పీవీ రమేశ్

ఆడిటర్‌ను అడ్డంగా వాడేశారు

బాబు అరెస్టుకు నాడు మహాకుట్ర.. జగన్ ఆదేశించారు.. ఆడిట్ సంస్థ పాటించింది

విచారణ తీరుపై ఆనాడే అనుమానాలు.. ఐసీఏఐకి తాజాగా ఆ సంస్థపై ఫిర్యాదు

స్కిల్ మొత్తం, కనిపిస్తున్న సెంటర్లు, టెక్నాలజీ.. ఏదీ పరిశీలన చేయొద్దంటూ హుకుం

ఆడిట్ సంస్థకు షరతులు పెట్టిన జగన్.. ఆయన కోరుకున్నట్లే నివేదిక చేతికి

ఇది జరిగిన ఏడాది తర్వాత నిజం వెలుగులోకి

పిల్లలు ఎందరున్నా పోటీకి ఓకే

స్థానిక ఎన్నికలపై పీఆర్ చట్టానికి సవరణ

దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గింది

మన రాష్ట్రంలో 1.6కి పడిపోయింది

15 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య తగ్గుతోంది

సంతానోత్పత్తిని, యువ జనాభాను పెంచేందుకే ఈ బిల్లు: మంత్రి మనోహర్

బిల్లుకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

పురపాలక చట్టానికీ ఇదే సవరణ

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంత మంది సంతానం కలిగి ఉన్నవారైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. ఆ మేరకు పంచాయతీరాజ్, పురపాలక శాఖల చట్టాలకు చేసిన సవరణలను శాసనసభ సోమవారం ఆమోదించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరపున పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. అసెంబ్లీలో పంచాయతీరాజ్ చట్టం-1994లో సవరణలు ప్రతిపాదిస్తూ బిల్లును ప్రవేశపెట్టారు. ఎందుకు సవరణ చేయాల్సి వస్తోందో

మిగతా 13వ పేజీలో...



జగన్ దెబ్బ.. రాష్ట్రం అబ్బా!

ఐదేళ్లలో వృద్ధిరేటు ధమాల్

స్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భారీ క్షీణత

కీలక జీఎస్‌డీపీ సగటు వృద్ధిరేట

13.5% నుంచి 10.44కి తగ్గుదల

జగన్ పాలనలో ధరల దరువు

బియ్యం నుంచి కందిపప్పు వరకు గరిష్ఠంగా 40 శాతం భారం

సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

సభలో ప్రవేశ పెట్టిన ప్రభుత్వం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ తిరోగమనంలో పయనించింది. ఫలితంగా వృద్ధి రేటు దిగజారింది. స్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఎప్పుడూ లేనంత స్థాయిలో రాష్ట్రం వెనుకబడింది. సోమవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన ఆర్థిక, సామాజిక సర్వేలో అనేక విషయాలు వెలుగు చూశాయి. 2014-19నాటి ఐదేళ్లతో పోల్చితే 2019-24 మధ్య

మిగతా 12వ పేజీలో...



2

ఇంటర్మీడియట్ వరకూ తెలుగును

తప్పనిసరి చేయాలి

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సూచన

దక్షిణాదిన మరే రాష్ట్రంలో మాతృభాషకు ముప్పు లేదు

2 రాష్ట్రాలనూ ఆంగ్ల వ్యామోహం కమ్మేసిందని ఆవేదన

పోలవరపు సాహిత్య సర్వస్వం ఆవిష్కరణ

మణిపూర్ మరింతగా..

కర్ఫ్యూ ఉల్లంఘించిన నిరసనకారులు

ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు 2

ఏఐ సహకారంతో 2-3 గంటల్లోనే దర్శనం!

తిరుమలలో శారదాపీఠం లీజు రద్దు



కొండపై అక్రమంగా కట్టిన భవనాన్ని కూల్చివేస్తాం

శ్రీవాణి ట్రస్టు పేరు మార్పు.. నిధులన్నీ ఇక టీటీడీ ఖాతాకే

టూరిజం కోటా టికెట్లు రద్దు.. డిపాజిట్లన్నీ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే

దేవస్థానంలోని అన్యమతస్థులకు వీఆర్‌ఎస్.. లేదంటే ఇతర శాఖలకు

కొండపై రాజకీయాలు మాట్లాడడం నిషేధం.. ఉల్లంఘిస్తే కేసులు నమోదు

టీటీడీ కొత్త పాలకమండలి కీలక నిర్ణయాలు 12

అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేం

వర్మకు హైకోర్టులో చుక్కెదురు.. భయం ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోండి

పోలీసుల ముందు హాజరుకు టైం కావాలంటే ఎస్‌హెచ్‌వోను కోరండి


మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం: కోర్టు

కౌంటర్ దాఖలుకు పోలీసులకు ఆదేశం



2

మహారాష్ట్రలో ముగిసిన ప్రచారం.. రేపే పోలింగ్ 2



దివంగత పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడో సంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమెస్కో విజయకుమార్, 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ, నటుడు నాగార్జున, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఇంటర్ వరకూ తెలుగును తప్పనిసరి చేయాలి

- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సూచన
- 2 రాష్ట్రాలనూ ఆంగ్ల వ్యామోహం కమ్మేసిందని ఆవేదన
- దక్షిణాదిన మరే రాష్ట్రంలో మాతృభాషకు ముప్పు లేదని వ్యాఖ్య
- పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడో సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): "తెలుగు రాష్ట్రాలను ఇంగ్లిష్ అనే వ్యామోహం కమ్మేసింది" అని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనూ మాతృభాషకు ప్రమాదం లేదని, ఈ విషయంలో ఒడిశా కూడా మనకన్నా మెరుగ్గానే ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్న తేడా లేకుండా, సిలబస్ ఏదైనా.. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ తెలుగును తప్పనిసరి చేయడం ద్వారా మాత్రమే ఉభయ రాష్ట్రాల్లో మాతృభాష బతుకుతుందని పేర్కొన్నారు. అప్పుడే సాహిత్యానికి మంచి రోజులొస్తాయని, తెలుగు జాతి మనుగడ అద్భుతంగా ఉంటుందని బలంగా నొక్కిచెప్పారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ నిర్వహణలో.. దివంగత పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడో సంపుటిని సోమవారం మాదాపూర్‌లోని దస్‌పల్లా హోటల్‌లో వేమూరి రాధాకృష్ణ ఆవిష్కరించారు. పుస్తక ప్రతులను పోలవరపు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు హీరో అక్కినేని నాగార్జున అందించారు. పుస్తకాన్ని ముద్రించిన రైతునేస్తం వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన వేమూరి రాధాకృష్ణ.. ఆనాటి గ్రామీణ సంస్కృతి ఇతివృత్తంగా పోలవరపు కోటేశ్వరరావు రాసిన కథలు ఎంతో పఠనాసక్తి కలిగిస్తాయని కొనియాడారు. అయితే ఇప్పుడు మన గ్రామాలను ఇంగ్లిష్ కమ్మేసిందని.. గ్రామీణ జీవితమే దాదాపుగా కనుమరుగవుతున్న పరిస్థితిని చూస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. "తెలుగు సాహిత్యం వర్ధిల్లాలంటే, ముందు తెలుగు భాష మనుగడ సాగించాలి. తెలుగు భాషకే మరణం దాపురించినప్పుడు, ఇక సాహిత్యం పరిస్థితి ఏమిటనేది పెద్ద ప్రశ్న. తెలుగు అంటే దాదాపుగా ఏమిటి అనే దుస్థితి దాపురించింది" అని ఆవేదన వెలిబుచ్చారు. తెలుగునాట తెలుగులో తప్ప అన్ని భాషల్లో బోర్డులుంటున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాల్లో మాతృభాషతో పాటు ఇతర భాషలూ నేర్చుకోడానికి ఆసక్తి చూపుతుంటే, మనం మాత్రం 'తెలుగు వద్దు - ఇంగ్లిష్ మాత్రమే కావాలి' అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీన్ని ఆక్షేపించే వాళ్లను పేదల వ్యతిరేకి, పెత్తందారీల ప్రతినిధి అంటున్నారని ఆక్షేపించారు. తెలుగు భాష కోసం పత్రిక, చానల్ ద్వారా తనవంతు కృషిచేస్తానన్నారు. శేష జీవితాన్ని భాష కోసం అంకితంచేయాల్సిందిగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సూచించారు. పోలవరపు కోటేశ్వరరావు చేసిన సాహిత్య సేవ గురించి సభాధ్యక్షత వహించిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వివరించారు. వేమూరి రాధాకృష్ణ సూచన మేరకు తెలుగు భాషాభివృద్ధి కోసం పనిచేస్తానని ప్రకటించారు. సాహితీ, సినీ, మీడియా రంగాలు కలిస్తే తెలుగు భాషకు, సాహిత్యానికి మంచి రోజులొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కోటేశ్వరరావు సమగ్ర సాహిత్యాన్ని ప్రచురించిన ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ శతాబ్దపు ఉత్తమ కథకుల్లో పోలవరపు కోటేశ్వరరావు ఒకరని ఎమెస్కో సంస్థల నిర్వాహకుడు దూపాటి విజయకుమార్ కొనియాడారు. ఆయన అన్ని ప్రక్రియల్లో సాహిత్య సృజన చేశారని ప్రశంసించారు. ప్రజల్ని మంచి వైపు మళ్లించే శక్తి సినీ రంగానికి ఉందిగనుక నాగార్జున లాంటి సినీ ప్రముఖులు సాహిత్యాభిరుచిని వ్యక్తం చేయడం వల్ల తెలుగు భాషా, సాహిత్యాలకు మేలు జరుగుతుందన్నారు. కాగా, తెలుగులో సాహిత్యానికి ప్రాధాన్యమిస్తున్న పత్రిక 'ఆంధ్రజ్యోతి' మాత్రమే అని వక్తలు కొనియాడారు.

నువ్వా.. నేనా?

- మహారాష్ట్రలో 2 కూటములకూ సవాలే
- ముగిసిన ప్రచారం.. రేపు పోలింగ్
- ఝార్ఖండ్‌లో చివరిదశ ఓటింగ్

నిజామాబాద్, న్యూఢిల్లీ, నవంబరు18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఆదిలాబాద్: మహారాష్ట్ర, జార్ఖండ్‌లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. బుధవారం జరిగే పోలింగ్‌పైనే దేశం దృష్టి కేంద్రీకృతమైంది. శివసేన(ఉద్ధవ్ థాకరే వర్గం), ఎన్సీపీ(శరద్ పవార్), కాంగ్రెస్‌తో కలిసి మహావికాస్ అఘాడీ పేరుతో పోటీ చేస్తుండగా, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్‌పవార్), బీజేపీ కలిసి మహాయుతి పేరుతో పోటీ చేస్తున్నాయి. మహారాష్ట్రలోని 288 సీట్లలో బీజేపీ అత్యధికంగా 152 స్థానాలకు పోటీ చేస్తోంది. బీజేపీకి చెందిన మరో 19 మంది నేతలు ఎన్సీపీ, శివసేన టికెట్లపై పోటీ చేస్తున్నారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ- 59, ఏక్ నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన- 81 సీట్లకు పోటీ చేస్తున్నాయి. మహా వికాస్ అఘాడీ కూటమిలో కాంగ్రెస్ అత్యధికంగా 102, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన- 96, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ- 86 చోట్ల పోటీ చేస్తున్నాయి. బీజేపీతో కాంగ్రెస్- 76 చోట్ల నేరుగా తలపడుతోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో కుల, మత రాజకీయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. హిందువులంతా కలిసికట్టుగా ఓటు వేయాలని, ఓట్లు చీలకూడదని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేసింది. ఏక్ హైతో సేఫ్ హై, బటేంగేతో కటేంగే పేరిట మోదీ, అమిత్ షా, యోగి ఇచ్చిన నినాదాలు ఈ ఎన్నికల్లో ప్రచారాంశాలయ్యాయి. అదానీ ఒక్కడికే అన్నీ దక్కాలని మోదీ భావిస్తున్నారని, అందుకే ఏక్ హైతో సేఫ్‌హై అని నినాదం చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికల ముందు మహిళల కోసం మహాయుతి కూటమి ప్రభుత్వం ప్రకటించిన లాడ్లీ బెహనా యోజన గేమ్ ఛేంజర్‌గా మారనున్నదని బీజేపీ అంచనా వేస్తోంది.

జార్ఖండ్‌లో చివరిదశ పోలింగ్

జార్ఖండ్‌లో చివరిదశలో భాగంగా 38 స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. హేమంత్ సోరేన్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే నేతలు ధీమాగా ఉన్నారు.



తెలంగాణ సరిహద్దులో ఇదీ పరిస్థితి

తెలంగాణ సరిహద్దులో మహారాష్ట్రలోని నాందేడ్, యావత్‌మాల్, చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలో మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల్లో తెలుగు వచ్చిన వారు ఎక్కువగా ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఎంవీఏ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. మహాయుతి తరఫున ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రచారం నిర్వహించారు. యవత్‌మాల్, చంద్రాపూర్, నాందెడ్ జిల్లాల పరిధిలోని కేళాపూర్, రాజురా, డిగ్రస్, కిన్వట్, వణి, చంద్రాపూర్, బల్లార్ష 7 నియోజక వర్గాలలో బీజేపీ, కాంగ్రెస్ కూటముల మధ్య పోటీ నువ్వానేనా అన్నట్లుంది. తెలంగాణ మాజీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మాణిక్‌రావ్‌ఠాక్రె పోటీ చేస్తున్న డిగ్రస్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బీజేపీ నుంచి తీవ్రమైన పోటీ కనిపిస్తుంది.

ఒక్కటిగా ఉంటే.. బాగుండేది అదానీయే!

ముంబై, నవంబరు 18: 'అందరూ ఒక్కటిగా ఉంటేనే భద్రత (ఏక్ హై తో సేఫ్ హై)' అని మోదీ ఇచ్చిన నినాదాన్ని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. అందరూ ఒక్కటిగా ఉంటే బాగుండేది అదానీయేనన్నారు. వారిద్దరూ కలిసి ఉంటేనే.. ఇద్దరూ క్షేమంగా ఉంటారని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం ముగింపు చివరి రోజైన సోమవారం రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ ఖజానా పెట్టెను తీసుకొచ్చారు. దానిని తెరిచి అందులో మోదీ, అదానీ కలిసి ఉన్న పోస్టర్‌ను తీసి చూపించారు. ముంబైలోని ధారవి పునర్నిర్మాణ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనిపై బీజేపీ మండిపడింది. అదానీతో రాజస్థాన్, తెలంగాణల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాల మాటేమిటని నిలదీసింది. 'తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు రూ.12,400 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. రాజస్థాన్‌లో గత అశోక్ గహ్లోత్ ప్రభుత్వం రూ.46 వేల కోట్ల సోలార్ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టింది. మరి అదానీకి ఎవరితో లింకులున్నట్లు' అని ప్రశ్నించింది.

పోలింగ్ బూత్‌ల్లో సెల్‌ఫోన్ల నిషేధం సరైనదే

ముంబయి, నవంబరు 18: పోలింగ్ బూత్‌ల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకొని రాకూడదంటూ ఎన్నికల కమిషన్(ఈసీ) ఇచ్చిన ఆదేశాల్లో చట్టవ్యతిరేకత ఏమీ లేదని సోమవారం బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికలు సజావుగా సాగేందుకు నిబంధనలు రూపొందించే అధికారం ఈసీకి ఉందని తెలిపింది. డిజీలాకర్ యాప్ ద్వారా తన గుర్తింపు కార్డును చూపిస్తానని, అందువల్ల మొబైల్ ఫోన్లను బూత్‌ల్లోకి వాటిని అనుమతించకపోవడం చట్టవ్యతిరేకమని పేర్కొంటూ ఉజలా యాదవ్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిల్‌ను కోర్టు కొట్టేసింది.

మహారాష్ట్ర మాజీ హోంమంత్రి కారుపై రాళ్ల దాడి

- తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

నాగ్‌పూర్, నవంబరు 18 : మహారాష్ట్ర మాజీ హోం మంత్రి, ఎన్సీపీ(ఎస్పీ) నేత అనిల్ దేశ్‌ముఖ్ కారుపై నాగ్‌పూర్ జిల్లాలో సోమవారం రాత్రి రాళ్ల దాడి జరిగింది. ఆయన తీవ్రంగా గాయపడ్డారు. నార్ఖేడ్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని తిరిగి వస్తుండగా దుండగులు అనిల్ కారుపై రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆయన తలకు గాయమవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనిల్ కుమారుడు సలీల్.. కటోల్ నుంచి పోటీలో ఉన్నారు. ఆ ప్రచారం కోసమే అనిల్ నాగ్‌పూర్ జిల్లాకు వెళ్లారు.

నాపై ఎవరి ఒత్తిడీ లేదు

- స్వచ్ఛందంగానే బీజేపీలో చేరా: కైలాస్

న్యూఢిల్లీ, నవంబరు 18: ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసిన కైలాష్ గెహ్లోత్ సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రులు ఖట్టర్, హర్ష్ మల్హోత్రా ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. తనపై ఎవరి ఒత్తిడి లేదని, స్వచ్ఛందంగానే ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరానని ఆయన చెప్పారు. "అన్నా హజారే సమయం నుంచి ఆప్‌లో ఉన్నాను. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఢిల్లీకి నావంతు సేవలు అందించాను. ఇది రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయమని కొందరు భావిస్తున్నారు.ఒత్తిడి వల్ల నేనెప్పుడూ ఏ నిర్ణయం తీసుకోలేదని వారికి స్పష్టం చేస్తున్నాను" అని వెల్లడించారు. కైలాష్ రాజీనామా బీజేపీ కుట్ర ఫలితమేనని ఆప్ పేర్కొంది.

లోకం తీరు

బీజేపీ ఎంపీ విందులో మటన్ ముక్కల కోసం కొట్లాట!



హీరోగా నిలిచినా.. తన పిల్లలను కోల్పోయాడు

- ఝాన్సీ అగ్ని ప్రమాద ఘటనలో విషాదం
- ప్రమాదం నుంచి చాలా మంది శిశువులను కాపాడిన యాకూబ్
- పొగలో తన ఇద్దరు పిల్లల మృతి



ఝాన్సీ, నవంబరు 18: అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న చాలా మంది శిశువులను కాపాడి హీరోగా మన్ననలు అందుకున్న యాకూబ్ మన్సూరీ.. తన కవల పిల్లలను మాత్రం రక్షించుకోలేకపోయాడు. తాను రక్షించిన పిల్లల తల్లిదండ్రులు అతనికి కృతజ్ఞతలు చెపుతుంటే.. అతను మాత్రం కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయిన తన పిల్లలను తలచుకుని కుమిలిపోతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో లక్ష్మీబాయి ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాద విషాద ఘటన వివరాలను యాకూబ్ మీడియాకు వివరించాడు. "ఈనెల 9న పుట్టిన నా కవల పిల్లలకు శ్వాసలో ఇబ్బంది వచ్చింది. వారిని ఝాన్సీ ఆస్పత్రిలో చేర్చాం. రాత్రి అగ్ని ప్రమాదం గుర్తించి ఎస్ఎన్‌సీయూ లోపలి యూనిట్ నుంచి ఓ మహిళ అరవడంతో సడెన్‌గా నిద్ర నుంచి లేచాం. ఆ యూనిట్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించాం. అయితే వెళ్లడానికి దారిలేక కిటికీ పగలగొట్టాల్సి వచ్చింది. లోపల చాలా వేడిగా ఉండటమే కాకుండా పూర్తి పొగ కమ్మేసింది. నా బావమరిదితో కలసి లోపల ఉన్న ఒక్కో శిశువును జాగ్రత్తగా కిటికీలోంచి బయటకు తీసుకువచ్చాం. ఆ చిన్న గదిని విపరీతంగా పొగ కమ్మేయడంతో నా పిల్లలను గుర్తించే అవకాశం లేదు. పొగ ఘాటుకు మేం వాంతులు చేసుకున్నాం. ఇక ఆ చిన్నపిల్లలు ఎలా తట్టుకుంటారు? అందుకే చనిపోయారు. నా పిల్లలను పోస్టుమార్టంలో చూడటం భరించలేని విషయం" అని తెలిపాడు. ఈ ప్రమాదంలో 11 మంది శిశువులు చనిపోయారు.

ప్రపంచ సంఘర్షణలతో పేద దేశాలు సతమతం

- వెంటనే పరిష్కారం కనుగొనాలి.. జీ20 సదస్సులో మోదీ



జీ20 సదస్సులో బైడెన్, రమాఫోసా, మోదీ

రియో డి జనెరియో, నవంబరు 18: ప్రపంచంలో నెలకొన్న సంఘర్షణల ప్రభావం పేద దేశాలపై పడుతోందని, అందువల్ల వీటికి వెంటనే పరిష్కారం కనుగొనాల్సి ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యుద్ధాల ప్రభావం ఆహారం, ఇంధనం, ఎరువుల రంగంపై పడిందని చెప్పారు. 'గ్లోబల్ సౌత్'గా వ్యవహరించే ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాల్లోని పేద దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బ్రెజిల్ రాజధాని రియో డి జనెరియోలో జరిగిన జీ-20 కూటమి శిఖరాగ్ర సదస్సులో మోదీ ప్రసంగించారు.

తెలుగు రాష్ట్రాల్లోని కొత్త రైల్వే లైన్లపై కేంద్రం సమీక్ష

న్యూఢిల్లీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీఎం గతిశక్తి పథకం అమలులో భాగంగా ఏర్పాటు చేసిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్(ఎన్‌పీజీ) 83వ సమావేశంలో సికింద్రాబాద్-వాడి, బళ్లారి-చిక్కజాజూరు మధ్య కొత్త రైల్వే లైన్ల నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు సమీక్ష చేశారు. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) అదనపు కార్యదర్శి రాజీవ్‌సింగ్ ఠాకూర్ అధ్యక్షతన సోమవారం ఈ సమావేశం జరిగింది.

మస్క్ రాకెట్లో రోదసిలోకి మన శాటిలైట్

న్యూఢిల్లీ, నవంబరు 18: ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, జపాన్.. ఇలా వేరే దేశాలకు చెందిన 400కు పైగా ఉపగ్రహాలను మన ఇస్రో రాకెట్లు రోదసిలోకి మోసుకెళ్లాయి! ఇప్పుడు దానికి భిన్నంగా.. 4,700 కిలోల బరువున్న మన 'జీశాట్-20 (జీశాట్ ఎన్2)' కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని ఈలన్ మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్' సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్ భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటిన ఒక్క నిమిషానికి (12:01 గంటలకు-తెల్లవారితే మంగళవారం) విజయవంతంగా రోదసిలోకి మోసుకెళ్లింది! అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కేప్ కెనరెవాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టారు.

కర్ఫ్యూ ఉల్లంఘించి అల్లర్లు

- మణిపూర్‌లో మరింత క్షీణించిన పరిస్థితి
- ప్రభుత్వ ఆఫీసులకు నిరసనకారుల తాళాలు
- మణిపూర్‌కు అదనంగా 5 వేల బలగాలు



నిరసనల్లో కాలిపోయిన మణిపూర్ మంత్రి గోవిందాస్ ఇల్లు

ఇంఫాల్, న్యూఢిల్లీ, నవంబరు 18: మణిపూర్‌లో శాంతి భద్రతల పరిస్థితి మరింత క్షీణించింది. నిరసనకారులు సోమవారం కర్ఫ్యూను ఉల్లంఘించి యథేచ్ఛగా అల్లర్లకు పాల్పడ్డారు. జిరిబమ్ జిల్లాలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లల హత్యకు నిరసనగా కొకొమి(కోఆర్డినేషన్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ) గ్రూపునకు చెందిన కొందరి నేతృత్వంలో జనం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేశారు. జిరిబమ్ జిల్లాలో హత్యకు గురైన బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ నిరసనకారులు ఇంఫాల్‌లోని చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ కార్యాలయంలోకి చొచ్చుకుపోయి ప్రధాన గేటుకు తాళం వేశారు. అలాగే కుకి మిలిటెంట్లపై సైనిక చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంఫాల్‌లో కొకొమి చేపట్టిన ధర్నా మూడోరోజుకు చేరుకుంది. మరోవైపు మణిపూర్ ప్రభుత్వం సోమవారం నుంచి బుధవారం వరకు ఏడు జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వరుసగా రెండోరోజు మణిపూర్‌పై కేంద్ర, ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. మరో 5 వేలమంది పారామిలిటరీ సిబ్బందిని ఆ రాష్ట్రానికి పంపాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులు ఆ రాష్ట్రంపై దృష్టి పెట్టి వెంటనే అక్కడ శాంతి భద్రతలను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇప్పటికే సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఏడీ సింగ్, ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఉన్నతాధికారులు ఆ రాష్ట్రంలో మకాం వేసి ఉన్నారు. గత వారం పంపిన కేంద్ర సిబ్బందితో కలిపి మొత్తం 218 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఆ రాష్ట్రంలో ఉన్నాయి. కాగా ఎన్ఐఏ మణిపూర్‌లో తాజాగా చోటు చేసుకున్న హింసకు సంబంధించి మూడు కేసులను నమోదు చేసింది.

నిర్వహణ కారణాలతో పలు రైళ్లకు నంబర్ల మార్పు

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాధారణ నిర్వహణ కారణాలతో దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే పరిధిలో నడుస్తున్న 10 రైళ్ల నంబర్లను మారుస్తున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్‌ఓ) శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం-కడప మార్గంలో 17488/17487 నంబర్లతో నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు 18521/18522 నంబర్లను, విశాఖపట్నం- గుంటూరు మధ్య 22701/22702 నంబర్లతో నడిచే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కు 22875/22876 నంబర్లను, భువనేశ్వర్-రామేశ్వరం మార్గంలో 20896/20895 నంబర్లతో నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా 20895/20896, భువనేశ్వర్-పుదుచ్చేరి మార్గంలో 12898/12897 నంబర్లతో నడిచే ఎక్స్‌ప్రెస్‌కు 12897/12898, భువనేశ్వర్- చెన్నై సెంట్రల్ మార్గంలో 12830/12829 నడిచే ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా 12829/12830 నంబర్లను కేటాయించారు. మార్పు చేసిన రైళ్ల నంబర్లు మార్చి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ వెల్లడించారు.

కుంగదీస్తున్న మధుమేహం



ఒత్తిడి, కుంగుబాటు, కోపం, ఆందోళన, భయం

న్యూఢిల్లీ, నవంబరు 18: మధుమేహం.. శారీరకంగానే కాదు, మానసికంగానూ దెబ్బతీస్తోందని.. 36 శాతం మంది బాధితులు కోపం, అపరాధ భావన, సిగ్గు, భయం, ఆందోళన, విచారం, ఒత్తిడి, కుంగుబాటు వంటి సమస్యలకు గురవుతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. జర్మనీలోని హెన్రిచ్ హీన్ యూనివర్సిటీ, డసెల్‌ఫోర్ఫ్ పరిశోధకుల అధ్యయన నివేదిక లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైంది. "మధుమేహాన్ని ఎలా నియంత్రించాలి? దీనివల్ల ఇంకా ఏమేం సమస్యలు వస్తాయో? అనే సందేహాలు.. జీవన నాణ్యత తగ్గిపోవడం, వైద్య ఖర్చులు పెరగడం, మందులు వాడుతున్నా చక్కెరస్థాయులు నియంత్రణలోకి రాకపోవడం, ఆహారపుటలవాట్లను మార్చుకోవాల్సి రావడం, ఔషధ మోతాదు ఎక్కువై రక్తంలో చక్కెర స్థాయిలు ఆందోళనకరస్థాయిలో పడిపోతాయన్న భయం వంటివి.. షుగర్ పేషెంట్లు మానసిక సమస్యలకు గురయ్యేలా చేస్తున్నాయి" అని నివేదికలో పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటినీ కలిపి 'డయాబెటిస్ డిస్ట్రెస్'గా వ్యవహరిస్తారు. టైప్-1 లేదా టైప్-2.. ఏ రకం డయాబెటిస్ అయినా, జీవనశైలిలో మార్పుల ద్వారా నియంత్రణలో ఉంచుకోవాల్సిందే. క్రమం తప్పకుండా మందులు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం, శారీరకంగా చురుగ్గా ఉండడం, ఆహారపుటలవాట్లను నియంత్రించుకోవడం వంటివి తప్పనిసరి. మానసిక ఆరోగ్యం అంతగా బాగుండని వారికి ఇవన్నీ సవాళ్లుగా కనిపిస్తున్నాయని పరిశోధకులు వివరించారు. కాబట్టి, మధుమేహంతో బాధపడేవారు 'డయాబెటిస్ డిస్ట్రెస్' లక్షణాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుని, ముందే వైద్యుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ మానసిక సమస్యల ముప్పును గుర్తించిన అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య (ఐడీఎఫ్).. ఇన్సులిన్‌ను కనిపెట్టి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా 2021లో మూడేళ్ల ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. అది ఈ ఏడాదితో పూర్తయింది. ఐడీఎఫ్ తాజా సర్వేలో మధుమేహ బాధితుల్లో 77% మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. దీంతో 2024-26 దాకా కూడా 'డయాబెటిస్ అండ్ వెల్‌బీయింగ్' థీమ్‌తో ప్రపంచ మధుమేహ దినాన్ని నిర్వహించాలని ఐడీఎఫ్ నిర్ణయించింది.

నివేదికలో ముఖ్యాంశాలు

20 శాతం: సాధారణ ఆరోగ్యవంతులతో పోలిస్తే.. టైప్-1, టైప్-2 మధుమేహ బాధితుల్లో డిప్రెషన్ బారిన పడే ముప్పు 2-3 రెట్లు అధికం. వ్యాకులత, ఆదుర్దా, చింత వంటివాటితో బాధపడే ప్రమాదం 20 శాతం అధికం.

63 శాతం: డయాబెటిస్ బాధితుల్లో 63% మంది.. దానివల్ల కాలక్రమంలో వచ్చే దుష్ప్రభావాలు, సమస్యల గురించిన ఆందోళన తమ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని పేర్కొన్నారు.

28 శాతం: మధుమేహ సమస్య ఉన్నవారిలో 28 శాతం మంది.. తమ పరిస్థితిపై సానుకూల భావనలు కలిగి ఉండడం కష్టంగా అనిపిస్తోందన్నారు.

అసాధారణ ఆహారపుటలవాట్లు

టైప్-1 మధుమేహంతో బాధపడేవారిలో ఈటింగ్ డిజార్డర్స్.. అంటే అసాధారణ ఆహారపుటలవాట్ల వచ్చే ముప్పు సాధారణ ఆరోగ్యవంతులతో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ. టైప్-1 బాధిత మహిళల్లో 'డయాబులీమియా' సమస్య ఎక్కువగా ఉంటోంది. డయాబులీమియా అంటే.. బరువు తగ్గడం కోసం తీసుకునే ఇన్సులిన్ పాళ్లను తగ్గించేసుకోవడం. ఇక టైప్-2 మధుమేహుల్లో.. అతిగా తినేసే సమస్య అధికంగా కనిపిస్తున్నట్టు అధ్యయనంలో తేలింది.

అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేం

వర్మకు హైకోర్టులో ఎదురుదెబ్బ.. అరెస్టు భయం ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచన

- అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు కేసు



అమరావతి(ఆంధ్రజ్యోతి)/ఒంగోలు క్రైం, నవంబరు 18: సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టు ఝలక్ ఇచ్చింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. పోలీసులు అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉంటే బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. క్వాష్ పిటిషన్‌లో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. పోలీసుల ముందు హాజరయ్యేందుకు మరికొంత సమయం ఇవ్వాలన్న రామ్‌గోపాల్ వర్మ తరఫు న్యాయవాది అభ్యర్థననూ తోసిపుచ్చింది. ఈ తరహా అభ్యర్థనను సంబంధిత స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) వద్ద చేసుకోవాలని, కోర్టు ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని పేర్కొంది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న ముత్తనపల్లి రామలింగయ్యకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఏపీలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిష్ఠను దిగజార్చేలా సామాజిక మాధ్యమాలలో వర్మ అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టారని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. రామ్‌గోపాల్ వర్మ తరఫున టి.రాజగోపాలన్ వాదనలు వినిపించారు. గత ఏడాది డిసెంబరులో పిటిషనర్ పోస్టు పెట్టారన్నారు. ఆ పోస్టుకు ఫిర్యాదుదారుడు బాధితుడు కాదన్నారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. మంగళవారం సంబంధిత ఎస్‌హెచ్‌వో ముందు హాజరు కావాల్సి ఉందని, హాజరయ్యేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ... క్వాష్ పిటిషన్‌లో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొన్నారు. పోలీసుల ముందు హాజరు కావడానికి మరికొంత సమయం కావాలంటే సంబంధిత ఎస్‌హెచ్‌వోను అభ్యర్థించాలని సూచించారు. కాగా, రామ్‌గోపాల్‌వర్మ మంగళవారం ఒంగోలు రూరల్ సర్కిల్ స్టేషన్‌కు కేసు విచారణ నిమిత్తం హాజరుకానున్నారు. వర్మ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆయన విచారణకు హాజరు కావడం అనివార్యమైంది.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు: పోసానిపై సీఐడీ కేసు

- తెలుగు యువత నేత వంశీ ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా 8 చోట్ల కేసులు



అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సినీనటుడు, రచయిత పోసాని కృష్ణమురళిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. "వర్గ విభేదాలు సృష్టించేలా చంద్రబాబు మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షాల కాళ్లు పట్టుకున్నారు" అంటూ పోసాని విలేకరుల సమావేశంలో ఆరోపించారని, ఆయన్ను హిందుత్వ వ్యతిరేకిలా చిత్రీకరించారని తెలుగు యువత అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఫిర్యాదు చేయడంతో.. సీఐడీ పోసానిపై బీఎన్ఎస్ 111, 196, 353, 299, 336(3)(4), 341, 61(2) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని సెప్టెంబరులో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో పోసాని సెప్టెంబరు 28న విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి చంద్రబాబుపై పలు విమర్శలు చేశారు. తిరుమల కొండపైకి వెళ్లే జగన్‌ను డిక్లరేషన్ అడిగే అర్హత చంద్రబాబుకు లేదని, క్రైస్తవులు ఇళ్లకు హిందువులు వెళ్తే డిక్లరేషన్ అడగరని.. చంద్రబాబు గతంలో మసీదులోకి వెళ్లి... బీజేపీని మతతత్వ పార్టీ అని అన్నారని.. ఆ తర్వాత రాజకీయ అవసరాల కోసం ఢిల్లీ వెళ్లి నరేంద్ర మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకున్నారని.. ఆ ఫొటోలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించారు. అలాగే.. అయ్యప్ప మాల వేసుకున్న భక్తులు నిష్ఠతో మద్యానికి దూరంగా ఉంటారు గనుక ఆదాయం తగ్గుతుందని ఒక సందర్భంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యల వీడియో చూపించి.. ఇవి హిందువులను కించపరిచేలా ఉన్నాయని చెప్పారు. వీటిపై బండారు వంశీకృష్ణ అదే రోజు సాయంత్రం మంగళగిరిలో సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అధినేత చంద్రబాబుపై పోసాని వ్యాఖ్యలు తమ మనోభావాలను గాయపరచడంతో పాటు రాష్ట్రంలో వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని తెలిపారు. ఆయా సందర్భాలకు సంబంధించిన వాస్తవ వీడియోలను పెన్‌డ్రైవ్‌లో అందించారు. వాటిని పరిశీలించిన సీఐడీ పోలీసులు పలు సెక్షన్ల కింద పోసానిపై కేసు నమోదు చేశారు. ఇంకోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా పోసాని కృష్ణమురళిపై పలువురు ఫిర్యాదులు చేస్తున్నారు. కడప, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, బాపట్ల, పల్నాడు, కృష్ణ, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో ఎనిమిది చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

తమ్ముడికి తలుగు... చితి స్థలం వద్ద నివాళి..

» నారావారిపల్లి నుంచి సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణం


నారావారిపల్లి నుంచి తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబు

తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన నారా రామ్మూర్తినాయుడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆదివారం నారావారిపల్లి వచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ... సోమవారం రామ్మూర్తినాయుడికి తలుగు (బట్టలు, సాంబ్రాణి పెట్టి పూజించడం) పెట్టారు. అనంతరం గ్రామంలోని బంధువులతో మాట్లాడారు. చితి స్థలం వద్ద తమ్ముడికి చంద్రబాబు నివాళి అర్పించారు. అనంతరం ప్రత్యేక విమానంలో విజయవాడ బయల్దేరి వెళ్లారు. రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు ఈ నెల 28న నిర్వహించనున్నారు.

సీఎం ఇంటి ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

నారావారిపల్లిలో సీఎం చంద్రబాబు ఇంటి ఎదుట తిరుపతికి చెందిన మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించారు. తిరుపతి గాంధీనగర్‌కు చెందిన యశోద సోమవారం సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చారు. చాలాసేపు నిరీక్షించినప్పటికీ పోలీసులు ఆమెను అనుమతించలేదు. బలవంతంగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె చేతికున్న గాజులు పగలగొట్టుకుని ఆ ముక్కలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కార్యకర్త కుమారుడి వైద్యానికి లోకేశ్ సాయం

నేరేడుగొమ్ము, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త కుమారుడి వైద్య ఖర్చులకు మంత్రి నారా లోకేశ్ రూ.2.60 లక్షలు సాయం చేశారు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌కు చెందిన పసుపులేటి ఆంజనేయులు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసేవారు. ఆయనకు నెల రోజుల కిందట రెండో సంతానంగా కొడుకు పుట్టాడు. ఆ చిన్నారికి గుండె సంబంధిత సమస్య ఉండటంతో వైద్యానికి రూ.3.50 లక్షలు అవుతుందని హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ విషయం నారా లోకేశ్‌కు తెలియడంతో వైద్యం కోసం రూ.2.60 లక్షలు అందించారు.

మీగడ రామలింగస్వామికి గురజాడ సాహితీ పురస్కారం



విజయనగరం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గురజాడ సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు, 28 నంది బహుమతులు పొందిన మీగడ రామలింగస్వామికి అందజేయనున్నట్టు గురజాడ సాహితీ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపు గంటి ప్రకాష్ తెలిపారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 30న విజయనగరంలో కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

రాజమహేంద్రవరం నుంచి ఎయిర్‌బస్

రాజమహేంద్రవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయానికి మరిన్ని సర్వీసులు రానున్నాయి. ఇప్పటివరకూ 72 సీట్ల ఏటీఆర్ విమానాలు మాత్రమే ముంబయి, ఢిల్లీకి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు ఆ సర్వీసులు అప్‌గ్రేడ్ అయ్యాయి. డిసెంబరు 1 నుంచి 180 సీట్లు ఉండే ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు సోమవారం మీడియాకు తెలిపారు.

ట్రూఅప్ చార్జీల భారం దారుణం: వైసీపీ

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చాక ప్రజల్ని మోసం చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. సోమవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ వరదు కల్యాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల భద్రత ప్రమాదకర స్థాయిలో ఉందని చెప్పారు. వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల హామీల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ప్రజల్ని మోసం చేస్తూ, ట్రూఅప్ చార్జీలు వినియోగదారులపై భారం వేయడం దుర్మార్గమన్నారు. బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ పవన్ కల్యాణ్ గత ప్రభుత్వంపై అభాండాలు వేశారు. కానీ గత ఐదేళ్లలో మిస్సింగ్ కేసులు 34 మాత్రమేనని హోంమంత్రే చెప్పారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించినందుకు కూటమి నేతలు క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. తూమాటి మాధవరావు, నర్తు రామారావు, ఎంవీ రామచంద్రారెడ్డి, టీకల్పలతారెడ్డి, సిపాయి సుబ్రహ్మణ్యం, ఇస్హాక్ బాషా మాట్లాడారు.

పేదలపై పన్నుల భారం మోపే బడ్జెట్: పీడీఎఫ్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో ఏ రంగానికీ తగిన నిధుల కేటాయింపు జరగలేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ 'గత ప్రభుత్వం మాదిరిగానే ఉద్యోగులను ఈ ప్రభుత్వమూ మోసం చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.22వేల కోట్ల బకాయిల ఊసే లేదు. 12వ పీఆర్సీ ప్రస్తావనా లేదు. ఎన్నికల హామీల అమలుకు తగిన నిధులు కేటాయించలేదు. సూపర్‌సిక్స్ పథకాలకు నిధులున్నాయో లేదో కూడా బడ్జెట్‌లో స్పష్టత లేదు' అని చెప్పారు.

వ్యవసాయాభివృద్ధికి సహకరించండి

» రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశోధన సంస్థలకు కేంద్ర కార్యదర్శి దేవేశ్ చతుర్వేది సూచన

విశాఖపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలతో ముందుకువచ్చే వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది చెప్పారు. నగరంలో సోమవారం ప్రారంభమైన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో దేవేశ్ చతుర్వేది మాట్లాడుతూ రాష్ట్రాలు చేపట్టే రైతు సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వ మద్దతు, సహకారం ఉంటుందన్నారు. వ్యవసాయ రంగానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ చెప్పారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, పుదుచ్చేరి నుంచి వ్యవసాయరంగ నిపుణులు, అధికారులు సదస్సుకు హాజరయ్యారు.

పాము కాటేస్తే.. పసరుకు పరుగు!

» బాలుడి ప్రాణం తీసిన తల్లిదండ్రుల ఆలస్యం

నల్లజర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాము కరిచిన కుమారుడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా పసరు మందు కోసం తిప్పుతూ తల్లిదండ్రులు చేసిన ఆలస్యం.. ఆ బాలుడి ప్రాణాలు తీసింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని శింగరాజుపాలెంకు చెందిన బోయపాటి సాగర్, కవిత లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వీరికి ఏకైక కుమారుడు ధనుష్(7). దీపావళికి మిగిలిన టపాసులను కాల్చుకునే క్రమంలో అగ్గిపెట్టె గోతిలో పడిపోయింది. దాన్ని తీసేందుకు ధనుష్ గోతిలో దిగగా పాము కాటు వేసింది. తల్లిదండ్రులు బాలుడిని నీలాద్రిపురంలోని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లి పసరు మందు వేయించారు. అయినప్పటికీ ధనుష్ నీరసించిపోవడంతో నల్లజర్ల పీహెచ్‌సీకి, అక్కడి నుంచి తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళుతుండగా.. బాలుడు చనిపోయాడు.

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్‌ఏల ధర్నా

మంగళగిరి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో భారీ ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేశారు. సీసీఎల్‌ఏ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు, ఇసుక, రైస్ మిల్లుల డ్యూటీలను నిలిపివేయాలని, ప్రభుత్వ శాఖల్లో వాచ్‌మెన్, అటెండర్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని, పేస్కేలు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. వీఆర్‌ఏల ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు.


మంగళగిరిలో గౌతమబుద్ధ రోడ్డుపై ప్రదర్శన నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

పోలవరం.. 45.72 మీటర్ల ఎత్తునే!

» వచ్చే మార్చినాటికి హెడ్‌వర్క్స్ పనులు పూర్తి
» విద్యుత్ నష్టాల నివారణకు రూ.6,273.68 కోట్లతో స్మార్ట్ మీటర్లు
» సీ పోర్టుల అభివృద్ధికి నిర్ణయం
» ప్రకాశం బ్యారేజీ వద్ద వాటర్ రన్‌వే ఏర్పాటుకు పౌరవిమానయాన శాఖ అనుమతి
» రాష్ట్ర ఆర్థిక సర్వే వెల్లడి

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరులో నిర్మించి.. గరిష్ఠంగా 194.6 టీఎంసీల నీటిని నిల్వ చేయనున్నట్లు రాష్ట్ర ఆర్థిక సర్వే వెల్లడించింది. ప్రాజెక్టు పనులు 72.45 శాతం పూర్తయ్యాయని.. భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలు 23 శాతం పూర్తయ్యాయని తెలిపింది. హెడ్‌వర్క్స్ వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తవుతాయని పేర్కొంది. అయితే.. వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే వచ్చే ఏడాది జనవరిలో హెడ్‌వర్క్స్‌లో కీలకమైన డయాఫ్రం వాల్ పనులు మొదలవుతాయి. ఈ పనులు 700 మీటర్లకు చేరుకోగానే.. సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పనులు ప్రారంభిస్తారు. ఈ రెండు పనులూ ఏకకాలంలో చేపడితే.. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని ఇటీవల జల వనరుల శాఖ స్పష్టం చేసింది. అలాగే 73 టీఎంసీల వరద జలాలను వైకుంఠపురం నుంచి ఐదు ఎత్తిపోతల పథకాల ద్వారా తరలించే పథకం 20.44 శాతం పూర్తయిందని.. వరికెలపూడిశెల పనులు ఇంకా ఇన్వెస్టిగేషన్ దశలోనే ఉన్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇంధన శాఖకు సంబంధించి రైతులకు తొమ్మిది గంటలపాటు 21.67 లక్షల పంపు సెట్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే ఇచ్చామని వెల్లడించింది. దారిద్ర్య రేఖకు దిగువను ఉన్న 77,847 కుటుంబాలకు నెలకు 200 యూనిట్లదాకా ఉచితంగా కరెంటు అందించినట్లు తెలిపింది. విద్యుత్ ఆదా చేసేందుకు 65,000 వ్యవసాయ పంపు సెట్లను మార్చినట్లు పేర్కొంది. రైతులకు పగటి పూట 9 గంటలు కరెంటు అందించేందుకు సోలార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో 7,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపింది. కానీ ఈ పీపీఏ ఇంకా వాస్తవ రూపం దాల్చని విషయాన్ని దాచిపెట్టింది. సెకీ నుంచి యూనిట్ రూ.2.49 కే దక్కుతుందని.. రాష్ట్రంపై భారం లేకుండా అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సర్వీసు (ఐఎస్‌టీఎస్) చార్జీలు రద్దు చేసినట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. అయితే యూనిట్‌కు రూ.2.49తో పాటు.. మరో 75 పైసలు ఐఎస్‌టీఎస్ చార్జీల భారం పడుతుందని ఇటీవల అధికారికంగా వెల్లడైంది. ఈ భారం రూ.62,000 కోట్లుగా ఇంధన శాఖ లెక్కలు వేసింది. యాగంటి, గడికోట, అరవేటిపల్లిలో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయని ఆర్థిక సర్వే వెల్లడించింది. రాష్ట్రంలో విద్యుత్ నష్టాల నివారణ కోసం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ కింద స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమాన్ని రూ.6,273.68 కోట్లతో డిస్కంలు చేపట్టాయని తెలిపింది. రాష్ట్రంలో సీ పోర్టులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొంది. ప్రకాశం బ్యారేజీ వద్ద వాటర్ రన్‌వే ఏర్పాటుకు పౌరవిమానయాన శాఖ అనుమతులు ఇచ్చిందని.. కాకినాడ సెజ్ పోర్టు, రామాయపట్నం పోర్టు, నిజాంపట్నం ఓడరేవును అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా ఆర్థిక సర్వే తెలిపింది.


పోలవరం విద్యుత్కేంద్రం వద్ద ఏపీఈఆర్సీ చైర్మన్, సభ్యులు, జెన్కో, మేఘా అధికారులు

గడువులోగా పోలవరం విద్యుత్కేంద్రం పనులు

» మేఘాకు ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ సూచన
» పనులను పరిశీలించిన ఠాకూర్ రామసింగ్

పోలవరం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామసింగ్, కమిషన్ సభ్యుడు పి.వెంకటరామరెడ్డి సోమవారం సందర్శించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి జల విద్యుత్ కేంద్రానికి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న కాలువ, విద్యుత్ కేంద్రం సర్వీస్ బే ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని ఏపీ జెన్‌కో హైడల్ విభాగం డైరెక్టర్ సుజయ కుమార్, నిర్మాణ సంస్థ మేఘా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీశ్‌బాబు వారికి వివరించారు. ఈ సందర్భంగా ఠాకూర్ రామసింగ్ మాట్లాడుతూ.. నిర్దేశిత సమయానికే ప్లాంటును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సివిల్, ఎలక్ట్రో మెకానికల్ పనులు చేస్తున్నామని సతీశ్‌బాబు వెల్లడించారు. వారి వెంట జెన్‌కో సివిల్ చీఫ్ ఇంజనీర్ వై.కోటేశ్వరరావు, ఎస్‌ఈలు రామభద్రరాజు, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, ఈఈలు హనుమ, ప్రభాకరరావు, భీమాధానరావు, సీతారాం, వ్యాప్కోస్ సీనియర్ ప్రాజెక్టు మేనేజరు కొలగాని మూర్తి, మేఘా హైడల్ ప్రాజెక్టు జీఎం శంకర్ ఉన్నారు.

పోలవరం ఎస్‌ఎన్‌ఏ ఖాతాకు 392 కోట్ల కేంద్ర నిధుల బదిలీ

» వినియోగంపై ప్రాజెక్టు అధికారులకు పీఎఫ్ఎంఎస్ శిక్షణ

అమరావతి/పోలవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్‌ఎన్‌ఏ) ఖాతాకు రూ.392 కోట్ల కేంద్ర నిధులను రాష్ట్ర ఆర్థిక శాఖ బదలాయించింది. ఆ నిధుల వినియోగంపై సోమవారం ప్రాజెక్టు ప్రాంతంలో పోలవరం ఇంజనీరింగ్ అధికారులకు పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) అధికారులు శిక్షణ ఇచ్చారు. ఏపీ విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ప్రియాంక నిషినే, సీనియర్ ఏవో శ్రవణ్‌కుమార్, ప్రాజెక్టు సీఈ నరసింహమూర్తి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఇందులో పాల్గొన్నారు. సీఎఫ్ఎంఎస్-ఎస్‌ఎన్‌ఏ మాడ్యూల్‌లో పోలవరం ప్రాజెక్టు వ్యయాల వివరాలను అప్‌లోడ్ చేయాలని రాష్ట్రప్రభుత్వానికి కేంద్రం స్పష్టం చేసిన విషయం విదితమే.


శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో వేణుగోపాలస్వామి రథోత్సవం

సత్యసాయి జయంత్యుత్సవాలు ప్రారంభం

» పుట్టపర్తిలో వేణుగోపాల స్వామి రథోత్సవం

పుట్టపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో సత్యసాయి 99వ జయంత్యుత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పట్టణంలో వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మంగళ హారతి పట్టిన అనంతరం వేడుక మొదలైంది. రథం ముందు సీతారాముల పల్లకి వెళుతుండగా.. వేద విద్యార్థుల వేద పారాయణం, మంగళవాయిద్యాలతో వేడుక సాగింది. పెదవెంకమరాజు కళ్యాణమంటపం వరకు రథోత్సవం సాగింది. పుట్టపర్తి వీధులలో దేశవిదేశీ భక్తులతో సందడి నెలకొంది. ఈ నెల 23 నుంచి 2026 నవంబరు 23 వరకు రెండు సంవత్సరాల పాటు సత్యసాయి శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు రత్నాకర్ తెలిపారు. ఈసందర్భంగా ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు.

కురుబలను చంద్రబాబు ముందువరుసలో నిలిపారు

» సంఘటితంగా ఏదైనా సాధించగలమని భక్త కనకదాస చాటారు
» బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
» అనంతలో ఘనంగా భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కురుబలను అభివృద్ధిపరంగా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. అనంతపురంలో సోమవారం నిర్వహించిన భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి గుత్తి రోడ్డులోని భక్త కనకదాస విగ్రహం వరకూ వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జయంత్యుత్సవాల్లో ఆమె ప్రసంగించారు. సంఘటితంగా పోరాడితే ఏదైనా సాధించగలమని తన కీర్తనలతో ఉరూరా తిరిగి ప్రజలను చైతన్యపరచిన మహనీయుడు కనకదాస అని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి కురుబ కులంలో జన్మించడం ఓ వరంగా భావిస్తున్నామని అన్నారు. అలాంటి మహనీయుని జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఓ పండుగలా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. బీసీ లు అన్ని రంగాల్లో ముందుండాలని కోరుకునే పార్టీ తెలుగుదేశం అని అన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం నగరంలోని భక్త కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ తదితరులు

సంఘ సంస్కర్త గురు కనకదాస: సీఎం

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన సామాజిక తత్వవేత్త గురు కనకదాస గొప్ప సంఘ సంస్కర్త అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. గురు కనకదాస జయంతి సందర్భంగా సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన భక్తులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. 'బీసీలను, వారి సంస్కృతీ, సాంప్రదాయాలను గౌరవిస్తూ, వారి ఉన్నతి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన మహనీయుడు గురు కనకదాస. సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించేందుకు గురు కనకదాస బోధనలు ఉపకరిస్తాయని నేను నమ్ముతున్నాను. భక్తి మార్గంలో ఆయన చేసిన బోధనలు నేటికీ అనుసరణీయం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ధ్యేయం: ఎంపీ పురంధేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం చేయాలనే భావనతో బీజేపీ పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో వైసీపీకి చెందిన పలువురు బీజేపీలో చేరారు. వారికి పురంధేశ్వరి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఏపీఎస్ఎస్‌డీసీలో ఏపీఐటీఏ విలీనం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీఐటీఏ(ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ)ను ఏపీఎస్ఎస్‌డీసీ(ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో విలీనం చేస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజనకు ముందు ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎలక్ట్రానిక్ గవర్నెన్స్(ఐఈజీ)ను హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థాపించింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోనూ అలాంటి సంస్థను ఏర్పాటు చేయాలని 2016లో విజయవాడ కేంద్రంగా ఏపీఐటీఏను ప్రారంభించింది. అయితే, ఏపీఐటీఏ నిర్వహిస్తోన్న పనులను ఏపీఎస్ఎస్‌డీసీ చేస్తుండటంతో ఏపీఐటీఏను రద్దు చేసి .. ఈ సంస్థ ఆస్తులూ, అప్పులను ఏపీఎస్ఎస్‌డీసీకు బదలాయించాలని ప్రభుత్వం భావించింది.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మణిపూర్ రోదన

ఇటీవల కుకీ మిలిటెంట్లు అపహరించుకుపోయిన ఆరుగురు వ్యక్తుల మృతదేహాలు నదిలో దొరకడంతో ఇంఫాల్ లోయలో అగ్గిరాజుకుంది. ఒక శరణార్థ శిబిరంనుంచి ఆ మీతీ కుటుంబాన్ని అపహరించుకుపోయిన కుకీ మిలిటెంట్లు ఎనిమిదినెలల పసికందునుంచి అమ్మమ్మ వరకూ అందరినీ అమానుషంగా హత్యచేశారు. రెండేళ్ళబాలుడి తల, చేతులు నరికివేసి అత్యంత ఉన్మాదంగా వ్యవహరించారు. ఈ దారుణఘటన మీతీలను ఆగ్రహోదగ్రులను చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులు చేశారు, వాటిని తగులబెట్టారు. ఏకంగా ముఖ్యమంత్రి నివాసంమీదే విరుచుకుపడ్డారు. ఇటీవల పదిమంది కుకీలను సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఎన్‌కౌంటర్ చేయడంతో కుకీ–జో మిలిటెంట్లు ప్రతీకారంగా ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఓ వాదన. మీతీ మిలిటెంట్లనుంచి తమవారిని రక్షించుకోవడానికి వలంటీర్లుగా పనిచేస్తున్న కుకీలను సీఆర్పీఎఫ్ బలగాలు పనిగట్టుకొని చంపివేశాయన్నది వారి ఆరోపణ. కుకీ–జోమీ ఆదివాసుల్లో ఒకటైన హమర్ తెగకు చెందిన ఒక యువతిమీద మీతీ మిలిటెంట్లు అత్యాచారం జరిపి, చిత్రవధచేసి, సజీవంగా తగులబెట్టినందుకు ప్రతీకారంగా మీతి కుటుంబాన్ని హమర్ మిలిటెంట్లు చిత్రవధ చేసిచంపినట్టు కనిపిస్తోంది. మీతీలు, ఆదివాసీ తెగల మధ్య పాలకులు అడ్డుగోడలు కట్టేసిన తరువాత, మణిపూర్ నిత్యం రగులుతూనే ఉంది.

ఏడాదిన్నరగా మణిపూర్ తీవ్రమైన హింసనీ, బాధనీ చవిచూస్తోంది. విద్వేషపూరిత రాజకీయాలమీద ఆధారపడి పాలన చేయాలనుకుంటున్నవారు జాతుల మధ్య వైరాన్ని పెంచిపోషిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు కాస్తంత పెద్దవి కావచ్చునేమో కానీ, మణిపూర్‌లో మళ్ళీ హింస అంటూ వార్తలు నిత్యం వింటూనే ఉన్నాం. మీతీల మీద ఓ దారుణం జరిగి, వారు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నందువల్లనే కేంద్ర హోంమంత్రి మళ్ళీ మణిపూర్ గురించి ఆలోచిస్తున్నారని, ఇంతకాలమూ గిరిజనులమీద ఎన్ని అఘాయిత్యాలు జరిగినా ఢిల్లీకి పట్టలేదని కుకీ సంఘాలు విమర్శిస్తున్నాయి. తమపై దాడులకు పాల్పడుతున్న మిలిటెంట్ గ్రూపులను నిర్దాక్షిణ్యంగా అణచివేసి తమను కాపాడాలని మీతీల అభ్యర్థనమేరకు ఇప్పటికే వందలాదిమంది సైనికులు అక్కడ ఉన్నప్పటికీ, మరిన్ని అదనపు బలగాలను తరలించాలని కేంద్రం నిర్ణయించింది.

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో, బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి ఇంతకాలమూ అండగా నిలబడిన రెండు పార్టీలు—ఇద్దరు ఎమ్మెల్యేలున్న కుకీ పీపుల్స్‌పార్టీ, ఏడుగురు ఎమ్మెల్యేలున్న నేషనల్ పీపుల్స్ పార్టీ—మద్దతు ఉపసంహరించుకున్నాయి. శాంతిస్థాపనలో బీరేన్ సింగ్ విఫలం చెందారని, ఆయన ఏలుబడిలో శాంతి దక్కదని తేలిపోయిందని ఎన్పీపీ అధినేత జూనియర్ సంగ్మా అంటున్నారు. కూటమినుంచి ఎప్పుడు తప్పుకోవాలన్నది ఆయన ఇష్టం కానీ, ఇంతకాలమూ బీరేన్‌మీద ఆయనకు అంత నమ్మకం ఉండటమే ఆశ్చర్యం. అరవైమంది సభ్యులున్న మణిపూర్‌లో సొంతబలం ముప్పైకిపైగా ఉన్న బీజేపీకి ఇలా ఏవో కొన్నిపార్టీలు కూటమిని వీడిపోయినా పెద్ద తేడా ఏమీ రాదు. కానీ, బీరేన్‌ను తప్పించాలన్న డిమాండ్ గతంతో పోల్చితే ఇటీవల సొంతపార్టీలోనే బాగా హెచ్చిన మాట వాస్తవం. కనీసం ఇరవైమంది బీజేపీ ఎమ్మెల్యేలు బీరేన్‌కు వ్యతిరేకంగా ఉన్నారని, జాతీయ అధ్యక్షుడికి కూడా వారు లేఖరాశారని, సంతకం చేసినవారిలో స్పీకర్ కూడా ఉన్నారని వార్తలు వచ్చాయి. ఇప్పటి హింస నేపథ్యంలో, మరిన్ని బలగాలను పంపుతూ కుకీ–జోమీ తెగలవారిని అదుపులో ఉంచడం, వారిలో ఆత్మరక్షణకోసం ఆయుధాలు పట్టినవారినీ, అసలైన మిలిటెంట్లనూ ఊచకోతకోయడం వినా, బీరేన్‌ను తప్పించాలన్న డిమాండ్‌కు బీజేపీ అధిష్ఠానం లొంగిరాకపోవచ్చు. బీరేన్‌ను తప్పించి, ఎవరిని కూచోబెట్టినా పరిస్థితుల్లో మార్పు వస్తుందని, ఈ ఉద్రిక్తతలు కొంతమేరకు తగ్గుతాయని బీజేపీ అధిష్ఠానానికి తెలియకపోదు. కానీ, జాతుల మధ్య చిచ్చుపెట్టి మానవహననానికి దారులు పరిచిన బీరేన్ లేకపోతే ఈ ఈశాన్యరాష్ట్రంలో వారు అనుకున్న ఎజెండాలు నెరవేరవు. ఎప్పుడు హింస జరిగినా, విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, మణిపూర్ చల్లారుతోందనీ, అగ్నికి ఆజ్యం పోయవద్దనీ హోంమంత్రి హితవు చెబుతూంటారు. ఆరునెలల క్రితం కాబోలు, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యల నేపథ్యంలో, మీతీ–కుకీ వర్గాల మధ్య వైమనస్యాలు తొలగించేందుకు ప్రత్యేక కృషి ఆరంభమవుతుందని ప్రకటించారు. కానీ, పరిస్థితుల్లో ఏ మార్పూ కనిపించడం లేదు. కశ్మీర్‌కు కూడా పోయి ఓట్లు అడిగినవారు మణిపూర్‌లో ఎందుకు కాలూనడంలేదో మనకు తెలియనిదేమీ కాదు.

ట్రంప్ 2.0: వాణిజ్య యుద్ధాలే!

వ్యాకరణం బోధిస్తూ మా తెలుగు టీచర్ 'రావణుణ్ణి శ్రీరాముడు చంపాడు' అని ఉదహరించిన వాక్యం ట్రంప్ ఎన్నిక సందర్భంగా గుర్తు వస్తోంది. రాముడు 'కర్త', రావణుడు 'కర్మ', 'చంపాడు' క్రియ. ఈ వ్యాకరణ విశేషాన్ని అమెరికా అధ్యక్ష ఎన్నిక ఫలితాల ప్రచార సరళికి వర్తింపజేస్తే ట్రంప్ కర్త అవుతాడు. అయితే అది సత్యం మాత్రం కాదు. 'ట్రంప్ అనూహ్యమైన విజయం సాధించాడు', 'ప్రత్యర్థి డెమొక్రటిక్ పార్టీ ఓట్ బ్యాంకుని సైతం కొల్లగొట్టాడు', 'ఏ స్త్రీలు, మైనార్టీలకూ, వలస కార్మికులకూ, నాన్ వైట్ జాతులకు వ్యతిరేకమో వాటి ఓట్లు సైతం కొల్లగొట్టి విజేతగా నిలిచాడు' అని పబ్లిసిటీ జరుగుతోంది. పై లెక్కన డొనాల్డ్ ట్రంప్ 'కర్త', కమలా హారిస్ 'కర్మ', ఓటమి 'క్రియ'!

మరో ప్రచార సరళి చూద్దాం. 'అనూహ్య ఆధిక్యతతో ట్రంప్ గెలిపించబడ్డాడు', 'ప్రత్యర్థి పార్టీ ఓట్లు సైతం బదిలీ చేయబడ్డాయి', 'ఆటుపోట్లకి గురైన ట్రంప్‌ని నిలబెట్టి విజేతగా మార్చింది', 'ఏ వర్గాలకు వ్యతిరేకంగా దూషణలకు ట్రంప్‌ని ప్రేరేపించిందో అదే వర్గాల ఓట్లు వేయించింది'. ఈ ప్రకారం ట్రంప్ 'కర్మ'గా మారతాడు. ఓటమి క్రియే! ఇది కర్త లేని 'రావణుడు చచ్చెన్' వంటి వాక్యం. నిజానికి ట్రంప్ సాధించిన విజయం కాదిది. ట్రంప్‌కి చేకూర్చబడ్డ విజయం. ఈ రెండో ప్రచార సరళిలో కర్త అదృశ్యశక్తిగా ఉంటుంది. అదే అమెరికా పెట్టుబడి! పైగా టీ పార్టీ ఉద్యమంగా మొదలై 'మన అమెరికాని మళ్ళీ గొప్పరాజ్యం చేద్దాం' అనే ఉద్యమాన్ని తెర వెనక నుండి నడిపిస్తున్న పెట్టుబడిలోని ఓ కొత్త శిబిరం.

అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ రెండవసారి ఎన్నిక వర్తమాన ప్రపంచాన్ని తీవ్ర కుదుపునకు గురిచేసింది. ట్రంప్ మొదటి ప్రభుత్వ పాలన బాధిత సమూహాలుగా మారిన శ్రేణులు కూడా రెండోసారి ట్రంప్ గెలుపునకు సాయం చేయడం విస్మయం కలిగించేదే. ఇది అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ వ్యతిరేక రాజకీయ శక్తుల దృష్టిలో సైతం అనూహ్య ఫలితమే. అయితే ఆ గెలుపు 78 ఏండ్ల ట్రంప్ వ్యక్తిగత ఘన విజయంగా సాగే ప్రచార సరళి వాస్తవ విరుద్ధమైనది. ట్రంప్ వ్యక్తి కాదు. ట్రంప్ పార్టీ స్వతంత్ర రాజకీయ సంస్థ కాదు. ఆయన పార్టీ అమెరికా పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తోంది. అది చేపట్టిన వ్యూహం, ఎత్తుగడలకి దక్కిన విజయం. అది ఒక వ్యక్తికి అంటగట్టడం సరికాదు. వ్యక్తిగతంగా సమర్థుడైనా వ్యక్తిగత విజయం కాదు. ట్రంప్‌ని పోటీలో నిలబెట్టి గెలిపించిన పెట్టుబడిదారీ వర్గం సాధించిన విజయమది.

అమెరికా రాజ్య వ్యవస్థ ద్విముఖ స్వభావం గలది. బయటకి కనబడే రాజ్యం (ఓపెన్ స్టేట్) వెనక చీకటి రాజ్యం (డీప్ స్టేట్) ఉంది. సాధారణంగా అమెరికా ప్రభుత్వ విధానం రెండు పార్టీల మధ్య వైరుధ్యాలతో కూడింది. ఆ వివాదం ఓపెన్ స్టేట్‌కే పరిమితం. కానీ బాహ్య వివాదాలకి అతీతంగా డీప్ స్టేట్ గాఢ ఐక్యతని ప్రదర్శిస్తుంది. ఆఫ్ఘానిస్తాన్, ఇరాక్ దురాక్రమణల నుండి ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తర కొరియాతో కయ్యం దాకా ఐక్యత ప్రదర్శించింది. ఆ డీప్ స్టేట్‌లోనూ విభజన వస్తుండడం నేటి కొత్త మాట! దాని రాజకీయ ప్రతిబింబమే ట్రంప్. దేశాల మధ్య సరిహద్దుల్ని చెరిపి,



నేటి నిర్దిష్ట పరిస్థితుల్లో అమెరికా అధిక సుంకాలు విధించి చైనా, భారత్ వంటి దేశాలతో తీవ్ర వాణిజ్య యుద్ధానికి దిగి ప్రపంచ వాణిజ్య సంస్థకి స్వస్తి చెబితే యుద్ధాలు లేని పరిస్థితి నెలకొంటుందా? నేటి ప్రాంతీయ యుద్ధాల స్థానంలో మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా?

సుంకాల్ని రద్దుచేసి ప్రపంచాన్ని ఓ కుగ్రామంగా మార్చిన ప్రపంచీకరణతో మరింత బలపడగలనని అమెరికా పెట్టుబడిదారీ వర్గం 1990 దశకంలో అంచనా వేసింది. తనకు కలిసొచ్చిన అంతర్జాతీయ పరిస్థితిని సద్వినియోగం చేసుకుంది. సోవియట్ యూనియన్ పతనాన్ని అవకాశంగా ఎంచుకొని సరిహద్దులు లేని కొత్త ప్రపంచ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్) స్థాపనకు పూనుకున్నది. అదే ప్రపంచీకరణ ప్రక్రియ! అందులో భాగమే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో).

తమ ఆర్థిక సామ్రాజ్య విస్తరణ కోసం, రాజకీయ సామ్రాజ్య పటిష్ఠత కోసం, తుదకు సైనిక సామ్రాజ్య ఆధిపత్యం కోసం, అంటే ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థ స్థాపనకై నాటి అమెరికా పెట్టుబడిదారీవర్గం నడుం కట్టింది. అది జార్జి బుష్‌ని శక్తిమంతమైన రాజకీయ ప్రతినిధిగా మార్చుకుంది. నాడు బుష్ సర్కార్‌తో యుద్ధాలను చేయించింది. అమెరికా పెట్టుబడి కర్త, బుష్ కర్మ కాగా, యుద్ధాలు క్రియగా మారింది. కానీ బయటకు బుష్ కర్తగా పేరొందాడు. వాస్తవ కర్త కనుమరుగైనది. చరిత్ర పునరావృతం అవుతోంది. నేడు ట్రంప్ కూడా కర్తగానే పేరొందాడు. వాస్తవ కర్త తెరమరుగైనది. ఆ కర్త గూర్చి తెల్సుకుందాం.

అమెరికా పెట్టుబడిదారీ వర్గం డబ్ల్యుటీవోతో తలచింది ఒకటి. జరిగింది మరొకటి. ఆ సంస్థ అమెరికా కొంప ముంచింది. ఆఫ్ఘాన్, ఇరాక్ యుద్ధాల్లో అమెరికా దిగబడ్డ కాలంలో ప్రపంచ వాణిజ్య సంస్థను చైనా ఒక వరంగా మార్చుకొని బలపడ్డది. అది 150 దేశాల భాగస్వామ్యంతో బెల్టు అండ్ రోడ్ ఇనిషియేటివ్ పేరిట తలపెట్టిన అంతర్జాతీయ వాణిజ్య కారిడార్ అమెరికా ఆర్థిక సామ్రాజ్యానికి ఓ సవాల్‌గా మారింది. నాటి నుండే డబ్ల్యుటీవో పట్ల అమెరికా పెట్టుబడిదారీ వర్గంలో విబేధాలు మొదలై చీలికకి బీజం పడింది. క్రమంగా అది డీప్ స్టేట్‌లో చీలికకి కూడా దారి తీసింది. ప్రపంచ వాణిజ్య సంస్థతో తాము పొందే లాభం కంటే చైనా అధిక లాభపడుతుందనే భావన అమెరికా పెట్టుబడిదారీ వర్గంలోని ఒక శిబిరంలో బలపడుతూ వచ్చింది. అదే సమయంలో నేటికీ అమెరికా పెట్టుబడిదారీ వర్గంలో ఓ శిబిరం ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా లాభపడుతోంది. అది డబ్ల్యుటీవో నిబంధనల ప్రకారం చైనాని ఎదుర్కొని జయిద్దామని వాదిస్తోంది. ఆ నిబంధనలకి విరుద్ధంగా చైనాపై వాణిజ్య సుంకాల్ని విధించి వాణిజ్య యుద్ధం చేపడదామని కొత్త శిబిరం వాదిస్తోంది. ఆచరణలో ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి వైదొలిగే ప్రక్రియకి దారి తీస్తుంది. రెండో శిబిరపు రాజకీయ ప్రతినిధి ట్రంప్! పై కర్త రెండో శిబిరమే.

ట్రంప్ ఆకస్మికంగా ఆకాశం నుండి రాలిపడ్డ తార కాదు, ఊడిపడ్డ ఉల్క అసలే కాదు. వర్తమాన అంతర్జాతీయ రంగంలో పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణలో పుట్టి పెరుగుతున్న తీవ్ర మితవాద రాజకీయ వ్యవస్థకు శక్తిమంతమైన ప్రతినిధి మాత్రమే. ఈ ఎన్నికల్లో 'యుద్ధాలు వద్దు, వాణిజ్యం ముద్దు' అన్న ట్రంప్ నినాదంలో వాస్తవ శాంతి లేదు. అది నాటి బుష్ యుద్ధోన్మాద విధానానికి వ్యతిరేకమూ కాదు. అమెరికాకి ప్రపంచ వాణిజ్య సంస్థతో లాభం జరక్కముందే తొందరపడి యుద్ధాలకు దిగిందనీ, తద్వారా యుద్ధ ఊబిలో పూర్వ వైభవాన్ని కోల్పోయిందనీ, పూర్వ వైభవం రావాలంటే సైనిక యుద్ధాల కంటే వాణిజ్య యుద్ధాల తొలి అవసరం ఉందని ఈ రెండో శిబిరం వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థతో అమెరికా కంటే చైనా వంటి ఆర్థిక వ్యవస్థలు బలపడ్డ స్థితి నుండి గుణపాఠం. అమెరికా అప్పుల కొంపగా మారడానికి కారణమైన సైనిక యుద్ధాల్ని వెంటనే నిలిపి వాణిజ్య యుద్ధాలపై కేంద్రీకరణ చేద్దామనే ఎత్తుగడలో బాగమిది. అధిక సుంకాలతో చైనా వంటి ఆర్థిక వ్యవస్థలపై నిరాయుధ యుద్ధాలతో డబ్ల్యుటీవో విచ్ఛిన్నమైనా వెనకాడకూడదని కూడా ఈ శిబిరం వాదిస్తోంది.

ఆఫ్ఘాన్, ఇరాక్‌లపై యుద్ధాల వల్ల అమెరికా పౌర సమాజంలో పెరిగిన వ్యతిరేకత ఆధారంగా ఈ శిబిరం ట్రంప్ యుద్ధ వ్యతిరేకిగా ఫోకస్ చేసే వ్యూహం పన్నింది. బుష్‌తో అమెరికా పెట్టుబడి ఏకగ్రీవశక్తిగా నిలిచి నాడు ప్రాంతీయ యుద్ధాలను చేయిస్తే, నేడు అందులో ఓ శిబిరం వేరుపడి మూడో ప్రపంచ యుద్ధానికి పూర్వ రంగ స్థితిని ట్రంప్‌తో సృష్టించజూస్తోంది.

సామ్రాజ్యవాదానికి లెనిన్ పేర్కొన్న ఐదు లక్షణాల్లో అవి వెనకబడ్డ దేశాలకు సరుకులకు బదులు పెట్టుబడిని ఎగుమతి చేయడం! ఆ ఎగుమతైన పెట్టుబడి ఆ దేశాల్లో చౌక శ్రమశక్తితో సరుకుల్ని ఉత్పత్తి చేయడం కూడా అందులో భాగమే. తమ స్వంత దేశాల్లో సరుకులు, సేవల ఉత్పత్తుల కోసం వెనకబడ్డ దేశాల నుంచి చౌక శ్రమశక్తిని దిగుమతి చేసుకోవడానికి కూడా అది దారి తీస్తుంది. ఇవి వాటి సహజ లక్షణాలే. వాటికి వ్యతిరేకంగా తమ దేశానికి పరిశ్రమల్ని తెచ్చి సరుకుల ఉత్పత్తుల దేశంగా మార్చి, విదేశీ చౌక శ్రామికుల దిగుమతి నియంత్రణని, తద్వారా 'గ్రేట్ అమెరికా' నిర్మాణం చేస్తాననీ ట్రంప్ హామీ ఇచ్చాడు. రోజుకు ఐదారు డాలర్ల జీతం గల దేశాల నుంచి గంటకి పది, ఇరవై డాలర్ల జీతాలు గల అమెరికాకి తెస్తాననడం ఆచరణలో కాలచక్రాన్ని అడ్డుకోవడమే. అదో భ్రమ. తాత్కాలికంగా విదేశీ సరుకుల్ని దిగుమతి కాకుండా అధిక సుంకాల ద్వారా అడ్డుకోవచ్చు. అదే సమయంలో అధిక జీతాల స్వదేశీ కార్మికులతో పని చేయించే ప్రయత్నానికి అమెరికా పెట్టుబడిదారీ వర్గం నుండే తిరుగుబాటు రావచ్చు. పైగా ఎక్కువ ఉత్పాదక ఖర్చులతో ఉత్పత్తి చేసిన సరుకుల్ని కొనే స్తోమతు లేని స్వదేశీ ప్రజా వ్యతిరేకత వెల్లువగా మారవచ్చు. ఇలా ట్రంప్ సర్కార్ సామ్రాజ్యవాద ఆర్థిక నియమాలకు వ్యతిరేకంగా కాలప్రవాహ దిశను మార్చజూస్తే వాటి చక్రాల క్రింద నలిగిపోక తప్పదు. యుద్ధాలకు వ్యతిరేకంగా ట్రంప్‌తో వల్లింపజేసే నేటి 'శాంతి' ప్రవచనాలు రేపు గాలిలో దీపాలుగా మారి ప్రపంచ యుద్ధానికి కూడా దారి తీసే ప్రమాదం లేకపోలేదు.

చరిత్ర గమనంలో అనేక మహా సామ్రాజ్యాలు కాలగర్భంలో కలిసాయి. ప్రాచీన రోమన్, ఆధునిక పోర్చుగీస్, స్పెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్ వరకూ అగ్రరాజ్యాలు అంతరించి పోయాయి. నేడు అమెరికా వంతు వచ్చింది. దాన్ని పూర్తి చేసే రాజకీయ బాధ్యత ట్రంప్ భుజస్కందాలపై చరిత్ర మోపిందేమో!

నేటి నిర్దిష్ట పరిస్థితుల్లో అమెరికా అధిక సుంకాలు విధించి చైనా, భారత్ వంటి దేశాలతో తీవ్ర వాణిజ్య యుద్ధానికి దిగి ప్రపంచ వాణిజ్య సంస్థకి స్వస్తి చెబితే యుద్ధాలు లేని పరిస్థితికి దారి తీస్తుందా? లేదంటే నేటి ప్రాంతీయ యుద్ధాల స్థానంలో ప్రపంచ యుద్ధ పూర్వరంగ పరిస్థితికి దారి తీస్తుందా? ఇది నేటి చర్చనీయాంశం. చరిత్ర గమనం ఏఏ మలుపులు తీసుకుంటుందో వేచి చూద్దాం.

◆ పి. ప్రసాద్
భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు)

చట్టంతోనే సోషల్ మీడియా అదుపు సాధ్యం!

అమెరికా, యూరోప్ దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో సోషల్ మీడియా చట్టాలు చాలా బలహీనంగా ఉన్నాయి. దీనికితోడు— ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం వంటి కారణాలతో సాంఘిక మాధ్యమాలు అసాంఘిక మాధ్యమాలుగా మారుతున్నాయి. ప్రత్యర్థులను దొంగ దెబ్బతీయడానికి స్వార్థపర రాజకీయ నాయకులకు సోషల్ మీడియా ఒక ఆయుధంగా మారింది.

ఎందరో సంస్కర్తలకు, ఆదర్శవాదులకు నిలయమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఈ సోషల్ మీడియా కారణంగానే కులాంధ్రప్రదేశ్‌గా అపఖ్యాతి పాలవుతున్నది. ఎంతోమంది కన్నీళ్ళకు సోషల్ మీడియా వేదికగా మారింది. అమాయకులైన అనేక మంది జీవితాలు మధ్యంతరంగా ముగుస్తున్నాయి. ఇటువంటి స్థితిలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోషల్ మీడియాను వేదిక చేసుకొని అరాచకంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయం. ఇదంతా చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొన్నట్టు అనిపించినా, కనీసం ఇప్పటికైనా పోలీసు వ్యవస్థ చర్యలు తీసుకొనే విషయంలో బాధ్యతగా వ్యవహరించడం అవసరం.



విజ్ఞానాన్ని పంచుకోవడానికి, సమాచార చేరవేతకు, ప్రభుత్వమూ ప్రజల మధ్య సంధానానికీ ఎంతో ఉపయోగపడగలిగే సోషల్ మీడియాను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఫోటోలను, మాటలను మార్ఫ్ చేస్తూ లేనివి ఉన్నట్లుగా, ఉన్నవి లేనట్లుగా కల్పించడం చేస్తున్నారు. ఫోటోల మార్ఫింగ్, ఫోన్ ట్రాపింగ్‌ల కారణంగా వందల సంఖ్యలో కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే గాక అనేకమంది మధ్యంతరంగా జీవితాలను ముగిస్తున్నారు. ఎల్రక్టానిక్/ కంప్యూటర్ రంగంలో రోజురోజుకీ చోటు చేసుకొంటున్న మార్పులను ప్రజల కంటే ముందు మోసగాళ్ళు, సంఘ విద్రోహులూ అందిపుచ్చుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల అమాయకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాను అసాంఘిక కార్యకలాపాల కోసం వాడుతున్న సంస్థలను, వ్యక్తులను నియంత్రించేందుకు ప్రభుత్వ కఠిన వ్యవహార శైలి మాత్రమే సరిపోదు. పటిష్ఠమైన చట్టాలను కూడా రూపొందించాలి.

సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చట్టాలు చేసుకోవడమే కాకుండా దేశం మొత్తంగా అమలయ్యే విధంగా ఒక నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి. ఈ మేరకు మేధావులు, సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలి. ఇదే సమయంలో సోషల్ మీడియా నియంత్రణకు చాలీచాలని స్థానిక పోలీసులతో కాకుండా నైపుణ్యం కలిగినవారితో ప్రత్యేక పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

అమెరికాలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టిసి) పేరిట సోషల్ మీడియాలో వచ్చే మోసపూరిత వ్యాపార ప్రకటనలు, పిల్లలను ఏమార్చే ప్రకటలను నివారించడానికి నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ ఉన్నాయి. సెక్షన్ 230 ప్రకారం సోషల్ మీడియాలో తప్పుడు, మోసపూరిత సమాచారాన్ని చేరవేసేవారిపై కఠిన చర్యలు తీసుకొనే అవకాశం అక్కడ ఉంది. ఇదే చట్టాన్ని సవరించడం ద్వారా ద్వేషపూరిత ప్రసంగాలను, మాటలను ప్రచారం చేయకుండా నిషేధించారు. యూరోప్ దేశాలలో అయితే సమాచారాన్ని దొంగిలించినా, దుర్వినియోగం చేసినా భారీ మొత్తంలో జరిమానాలు విధించే విధంగా చట్టం రూపొందించారు. అసాంఘిక అంశాలు, ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రసంగాలు, చట్టసమ్మతంకాని సమాచారాలను ప్రచారం చేయకుండా ఉండటం కోసం ప్రత్యేకంగా 'డిజిటల్ సర్వీస్ ఆక్ట్'ను రూపొందించారు. అదే విధంగా అభ్యంతరకరమైన మాటలు, అబద్ధపు మాటలు, ప్రసంగాలు 24 గంటల్లోనే సోషల్ మీడియా నుంచి తొలగించడానికి వీలుగా 'ఈయు హేట్ స్పీచ్ కోడ్'ను రూపొందించారు. జర్మనీలో అభ్యంతరకరమైన, అబద్ధపు మాటలు, ప్రసంగాలు 24 గంటల్లోనే సోషల్ మీడియా నుంచి తొలగించని పక్షంలో పెద్ద మొత్తంలో జరిమానా విధించే విధంగా 'నెట్‌వర్క్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆక్ట్'ను రూపొందించారు. ఆస్ట్రేలియాలో సోషల్ మీడియాను నియంత్రించడానికి 'ఆన్‌లైన్ సేఫ్టీ ఆక్ట్' అమల్లోకి తెచ్చారు. అదేవిధంగా చైనా, సింగపూర్‌లలో కూడా సోషల్ మీడియా నియంత్రణకు పటిష్ఠమైన చట్టాలు అమలవుతున్నాయి. ఆయా దేశాలలో ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సంస్థలన్నీ పైన తెలిపిన చట్టాలకు లోబడే సేవలందిస్తున్నాయి.

మన దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు చాలా బలహీనంగా ఉన్నాయి. భారతదేశంలో సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి 2021లో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియటరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ ఒక చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం ఆన్‌లైన్‌లో అసాంఘిక అంశాలు, ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రసంగాలు, చట్టసమ్మతం కాని సమాచారాలను నియంత్రించాల్సి ఉంది. అయితే ఇందుకు అవసరమైన నిపుణులను, ఇతర సిబ్బందిని ప్రభుత్వాలు తగినంతగా నియమించలేదు. ఈ కారణంగా సోషల్ మీడియా దారుణంగా దుర్వినియోగం అవుతోంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఓట్ల సంపాదన, అధికారమే పరమావధిగా చేయకూడని ప్రచారమంతా చేస్తున్నారు. సోషల్ మీడియా ఉచితంగా లభించే వేదిక కావడం వల్ల మరింతగా రెచ్చిపోతున్నారు. ఎవరికి వారు ప్రచారం చేసుకొనే సమయంలో తమ గురించి తాము ఎంత గొప్పగా ప్రచారం చేసుకున్నప్పటికీ ఇబ్బంది లేదు, కానీ ఎదుటి వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా కామెంట్ చేయడం జీవితాలను అతలాకుతలం చేస్తోంది. ఎన్నికలలో విజయం సాధించడానికి కొన్ని సంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చే సూచనలు నీచంగా ఉంటున్నాయి. ఇటువంటి నీచపు సలహాలలో భాగంగానే ఒక కులాన్ని దెబ్బతీయడం కోసం "కొండమీద అమ్మవారు... కొండ కింద కమ్మవారు" వంటి దుర్మార్గపు నినాదాలను ప్రచారంలోకి తెచ్చారు. ఇటువంటి అసాంఘిక ప్రచారాన్ని సమర్థంగా నివారించాల్సిన అవసరం ఉంది.

సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చట్టాలు చేసుకోవడమే కాకుండా దేశం మొత్తంగా అమలయ్యే విధంగా ఒక నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి. ఈ మేరకు మేధావులు, సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలి. ఇదే సమయంలో సోషల్ మీడియా నియంత్రణకు చాలీచాలని స్థానిక పోలీసులతో కాకుండా నైపుణ్యం కలిగినవారితో ప్రత్యేకంగా పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

• అన్నవరపు బ్రహ్మయ్య

అవసాన దశలో గ్రంథాలయాలు!

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రంథాలయాల పరిస్థితి చూస్తుంటే అవి అవసాన దశలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. గ్రంథలయాలు శాశ్వతంగా మూతపడే అవకాశం కూడా ఉంది. వేలాది కోట్ల రూపాయల విలువైన గ్రంథాలయ భవనాలు, గ్రంథాలు, ఫర్నిచర్ ఇతర వస్తువులు నిస్తేజంగా పడియున్నాయి. కొంతమంది పెద్దలు తమ ఆస్తిని తమ సంతానంతో సమానంగా గ్రంథాలయాలకూ పంచారు అనే విషయం జగద్విదితం.

1984లో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత రూ.2 కిలో బియ్యం ప్రచారం నిమిత్తం మండలానికి ఒక గ్రంథాలయం స్థాపించారు. భవనాలు కూడా నిర్మించారు. ఆ విధంగా గ్రంథాలయాల సంఖ్య పెరిగి కొంతవరకు సీఎల్ఎస్‌ఎస్‌సీ, బీఎల్ఎస్‌సీ పాసైన నిరుద్యోగులకు భుక్తి కల్పించారు. ఆ కాలంలో గ్రంథాలయాలకు మంచి ఊపు వచ్చింది.

గ్రంథాలయ ఉద్యోగుల జీతభత్యాలు ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉండే విధంగా 1970వ దశకంలో ముఖ్యమంత్రి వెంగళరావు ఏర్పాటు చేసియున్నారు. అప్పటి వరకు గ్రంథాలయ సెస్సు, ప్రభుత్వ గ్రాంటు మీదే ఆధారపడి గ్రంథాలయాలు, వాటి సిబ్బంది ఆధారపడి ఉండేవారు.

సుమారు 15 నుండి 20 సంవత్సరాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు గ్రంథాలయ సెస్సును జిల్లా గ్రంథాలయాలకు జమచేయడం లేదు. కేవలం ప్రభుత్వం ఇచ్చే గ్రాంటుమీదే ఉద్యోగస్థులు, పెన్షనర్స్ బ్రతుకుతున్నారు. మరో ఆదాయం లేదు.

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో నేడు రూ. 1000 కోట్ల గ్రంథాలయ సెస్ బకాయిలు పేరుకొనిపోయినవి. ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ వంటి నగరాలు గ్రంథాలయాల సెస్‌ను ఆయా జిల్లాల సంస్థలకు జమచేయడం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, ఏలూరు, కాకినాడ, మచిలీపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వంటి నగరాలు కూడా సుమారు రూ. 1000 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. 80 మునిసిపాలిటీలు మరో రూ. వెయ్యికోట్ల వరకు బకాయిలు ఉన్నాయి.

ఇవన్నీ ఆంధ్ర, తెలంగాణలో ఉన్న జిల్లా గ్రంథాలయాల సంస్థలకు 010 జీఓ ద్వారా జమైతే వెనుతిరిగి చూడవలసిన పనిలేదు. సుమారు నాలుగువేల కోట్ల రూపాయలు, వాయిదాల మీద కట్టినా, దఫదఫాలుగా కట్టినా గ్రంథాలయోద్యమం బ్రతికి బట్టకడుతుంది. గ్రంథాలయ సెస్సు కట్టాలనే జీఓ ఉన్నా కట్టకపోతే తగిన ప్రతిచర్యలు లేక గ్రంథాలయాల ఆర్థిక పరిస్థితి దిగజారుచున్నది.

జిల్లా గ్రంథాలయ సంస్థలలో సిబ్బంది కరువై రెండు గ్రంథాలయాలకు ఒక ఉద్యోగి (వారానికి మూడురోజులు) పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని 100 గ్రంథాలయాల్లో గతంలో 230 మంది పనిచేయగా ప్రస్తుతం 50 మంది పనిచేస్తున్నారు. మరికొంత మంది రిటైర్డ్ అయితే కొత్త రిక్రూట్‌మెంట్ లేదు. కొత్త గ్రంథాలయాలు లేవు. ఇలానే కొనసాగితే భావిభారత పౌరులకు చేతిలో పుస్తకం అనేది ఉండదు.

–గంధం అప్పారావు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి

అవినీతిమయం ఆన్‌లైన్ పట్టాదార్ల చిట్టా!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 27,800 రెవిన్యూ గ్రామాలు ఉన్నాయి. 679 మండలాల్లో, కొత్త జిల్లాల ఏర్పాటుతో, 26 జిల్లాలలో ఇవి ఉన్నాయి. ఏదైనా ఒక గ్రామంలో సాగులో ఉన్న వ్యవసాయ భూమి ఎవరిదని అడిగితే ఒక ఆసామి పేరు వినిపిస్తుంది. మరి ఆ వ్యక్తినే మీరు "ఈ భూమి నీది అని ఎలా చెపుతున్నావు" అని అడిగితే నేను పట్టాదారునని ఆయన చెప్పగలడు. గ్రామీణ సమాజంలో 'భూమి పట్టా' అనే మాట సుపరిచితం. పట్టా అంటే ఒక అధికారి సంతకం పెట్టి, ముద్ర వేసి ఇచ్చిన ఒక కాగితం లేదా పుస్తకం.

ఒక గ్రామంలో ఉన్న పట్టాదార్ల వివరాలు ఎక్కడ వుంటాయి? ఏ రూపంలో, ఏ పేరుతో వుంటాయి? రైతు లేదా యజమాని వద్ద వున్న పత్రాలు ఏమిటి? ఆంధ్ర ప్రాంతంలో ఒక రెవిన్యూ గ్రామంలోని పట్టాదార్ల సమాచారం నమోదు చేసిన రికార్డు 10(1) ఎకౌంట్/ పద్దు. ఇది పట్టాదారులను ఖాతా నెంబర్ల వారీగా చూపిస్తుంది. ఈ ఖాతా నెంబరునే పట్టా నెంబర్ అంటారు. ఇక అండగల్ (ఆంధ్ర)/ పహాని (తెలంగాణ)— ఒక వ్యవసాయిక సంవత్సరంలో భూమిపై జరుగుతున్న వ్యవసాయాన్ని రికార్డు చేసి చూపిస్తుంది.

స్థూలంగా భూమికి సంబంధించిన అన్ని లౌకిక వ్యవహారాలకు ఈ రెండు రికార్డులు అవసరం. వాటికోసం ప్రతిసారీ రైతులు కరణం ఇచ్చే నకలు కోసం ఆయన చుట్టూ తిరగవలసి వచ్చేది. ఇలా తిప్పలు పడకుండా రైతు చేతిలో శాశ్వత పట్టా రికార్డు ఉంచాలనుకున్నారు. ఇందుకోసం పట్టాదారు పాసు పుస్తకాల చట్టం తెచ్చారు. దీనిని రికార్డు ఆఫ్ రైట్స్ ఏక్ట్ అని, పొట్టి రూపంలో ఆర్ఓఆర్ (ROR) అనీ రెవిన్యూ వారు పిలుస్తారు. 1971లో ఈ చట్టం వచ్చినా 1989కి గాని అమలు చేసే నియమాలు రాలేదు. వ్యవసాయక రుణాలు వగైరా అవసరాలకు ఒక పుస్తకం, భూమి హక్కుల లావాదేవీలకు మరో పుస్తకం. మొదటిదాన్ని పాసు పుస్తకం (పీబీ), అని రెండదాన్ని టైటిల్ డీడ్ (టీడీ) అని అన్నారు. మొదటిదాని మీద తాశీల్దార్ సంతకం వుంటే, రెండవ దాని మీద రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ లేదా సబ్- కలెక్టర్ సంతకం, రాజముద్ర (సీల్) ఉంటాయి. పట్టాదారు పాస్ పుస్తకం రైతులందరికీ సుపరిచితమయ్యింది. అది వరకు పట్టాదారుల చిట్టాగా ఉన్న 10(1) ఎకౌంట్ స్థానంలో ఆర్ఓఆర్ చట్టం 1బి అనే రికార్డును ప్రవేశపెట్టింది. ఆర్ఓఆర్ ప్రక్రియలో ముందు 1బి తయారవుతుంది. అందులో ఉన్న సమాచారమే రైతు చేతిలోని పీబీ/ టీడీ పుస్తకాలలో ఉంటుంది లేదా ఉండాలి. ఇప్పుడు పట్టాదారుల చిట్టా అంటే 1బీనే.

దాచేపల్లి సుబ్బారావుకు ఐదు ఎకరాల భూమి ఉంది. సుబ్బారావు వద్ద పీబీ/ టీడీలు ఉన్నాయి. అందులో రెండు ఎకరాలు అమ్మేశాడు. కొన్నవాడికి ఆ ప్రాప్తికి పాసు పుస్తకాలు రావాలి. అమ్మిన వాడి ఖాతాలో అది తగ్గాలి. అంటే ముందు 1బీ రికార్డులో, తదుపరి రైతు పాస్ పుస్తకంలో మార్పు చేసి కొన్నవాడికి పాస్ పుస్తకం ఇవ్వాలి. ఇందుకు అనుసరించవలసిన పద్ధతిని ఆర్ఓఆర్ నియమాల్లో చెప్పారు. అంటే 1బీ రికార్డు నిరంతరంగా మారుతూ ఉంటుంది. ఈ ప్రక్రియ రెవిన్యూ శాఖలో వారికి ఒక ప్రధాన సంపాదన వనరు. భూమి మార్కెట్ విలువను బట్టి, 1బీ మార్పులకు రేటు వుంటుంది. 10(1) నుంచి 1బీకి రికార్డు రూపం మారింది గాని 'ముడుపుల చెల్లింపు' మారలేదు సరికదా వ్యవస్థీకృతమై బలపడింది. నెమ్మదిగా 1బీతో సంబంధం లేకుండా పాస్ పుస్తకాలలో మార్పిడి మొదలయ్యింది. ఆనక కొత్త పాస్ పుస్తకాలతో పాటు భూమి సాగడం కూడా మొదలయ్యింది.

పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగి కూడా కాని కంప్యూటర్ ఆపరేటర్ ఏసీ గదిలో కూర్చుని భూమి రికార్డును మార్చేస్తే బాధితుడు ఏం చెయ్యాలి? ఆర్ఓఆర్ చట్టం ప్రకారం ఆర్‌డీఓ వద్ద అప్పీల్ చేసుకోవాలి. ఆ తర్వాత జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద రివిజన్, ఆ పిదప హైకోర్ట్ ముందు రెండవ రివిజన్. ఇలా ఒక్క మౌస్ క్లిక్‌తో బతుకును అతలాకుతలం చేసేయవచ్చు.



దొంగ పాస్ పుస్తకాలు అరికట్టాలని, కోనేరు రంగారావు కమిటీ చెప్పిందని, ప్రతి పాస్ పుస్తకంపైన యూనిక్ కోడ్ నెంబర్ వేయాలని అన్నారు. కోనేరు రంగారావు సిఫార్సులన్నీ కోనేటిలో కలసిపోయాయి.

ఇది ఇలా సాగుతుండగా, భూమి రికార్డును డిజిటలైజ్ చేస్తే అది సర్వరోగనివారిణిగా పని చేస్తుందన్న కొత్త ఆలోచనలు మొదలైనాయి. కేంద్ర ప్రభుత్వం 1987 అప్‌డేషన్ ఆఫ్ లెండ్ రికార్డ్స్ (SRA&ULR) పేరుతో ఒకటి, 1988 కంప్యూటరైజేషన్ ఆఫ్ లెండ్ రికార్డ్స్ (CLR) పేరుతో మరొకటి రెండు ప్రోగ్రామ్స్ మొదలు పెట్టి, 2008కి వచ్చేసరికి రెండింటిని కలిపి నేషనల్ లెండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రామ్‌గా (NLRMP) పేరు మార్చింది. కాగితం మీద ఉన్న భూమి రికార్డును డిజిటల్ రికార్డుగా మార్చటం దీని లక్ష్యం. రైతుల చేతిలో వున్న భూమి రికార్డు, అప్పటికే 1బీ రికార్డును సరిచూసే పని ముందుగా చేయకుండానే ఆంధ్ర ప్రదేశ్‌లో 1బీ రికార్డును కంప్యూటర్‌లోకి ఎక్కించారు. అలా నమోదు చేసే సమయంలో లక్షన్నర తప్పులు. 2015 జూన్ నుండి ఈ డిజిటల్ లాండ్‌కు రికార్డుకు సాధికారిత కల్పించారు. వాటిని బ్యాంకులకు, రిజిస్ట్రేషన్ వంటి శాఖలకు అనుసంధానం చేశారు. 1బీ రికార్డు నిర్వహణ డిజిటల్ రూపంలోకి మారడంతో ఇప్పుడు రెప్పపాటులో 'రికార్డ్ టేంపరింగ్' సులువు అయ్యింది.

రొచ్చుపనుకు గ్రామానికి చెందిన 17 కొండ దొర ఆదివాసీ రైతు కుటుంబాల వద్ద పీబీ, టీడీ ఉన్నాయి. ఈ గ్రామం అనకాపల్లి జిల్లా, రావికమతం మండలం, కళ్యాణ లోవకు శివారు గ్రామం. వారికి ఈ నెల మొదటి వారంలో— తమకు చెందిన భూమి మరెవరి పేరునో మారిపోయిందని తెలిసింది. వారు లబోదిబోమంటూ నర్సీపట్టణం రెవెన్యూ డివిజన్‌కు పరిగెత్తారు. అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కొనాం రెవిన్యూ గ్రామం సర్వే నెంబర్ 275, 287లలో ఉన్న మొత్తం విస్తీర్ణమే 17.78 ఎకరాలు కాగా, ఆన్‌లైన్ 1బీ 32.51 ఎకరాలకు పట్టాలు చూపిస్తుంది.

చేతి రాత రికార్డు ఐతే అక్కడ కొట్టివేత/ మార్పు జరిగిందని గుర్తించవచ్చు కాని కంప్యూటర్ స్క్రీన్ మీద పాత ఎంట్రీని డిలీట్ చేస్తే అంతకుముందు ఏమి ఉన్నదీ ఆనవాలు ఉండదు. ముందుగా ప్రింట్ తీసి పెట్టుకుంటే తప్ప. సిస్టమ్ మెమొరీలో ఈ మార్పు ఉంటుంది. కానీ సాధారణ ప్రజలకు ఆ 'హిస్టరీ' అందుబాటులో వుండదు.

సీతానగరంకు చెందిన ఆటో డ్రైవర్ కొండబాబుకు 70 సెంట్లు భూమి వుంది. ప్రతి ఏడాది దానిపై వడ్డీ లేని వ్యవసాయక బ్యాంక్ రుణం వస్తున్నది. "ఇప్పుడు గత ఏడాది అంత రుణం రాదు నీకు" అన్నాడు బ్యాంక్ మేనేజర్. ఎందుకంటే బ్యాంక్ కంప్యూటర్ సిస్టమ్‌తో లింకు అయిన 1బీలో ఇప్పుడు కొండబాబు భూమి కేవలం 30 సెంట్లు మాత్రమే. కొండ భూమి ఎవరికీ అమ్మలేదు. ఆయన చేతిలో వున్న పాసు పుస్తకాలను మేనేజరుకు చూపించాడు. "ఆన్‌లైన్‌లో మార్చుకొని రా" అన్నాడు మేనేజర్. ఒక చట్టం ద్వారా రైతు చేతిలో పెట్టిన పీబీ, టీడీలకు ఇప్పుడు దమ్మిడీ విలువ లేదు. ఒక దశలో నోషనల్ ఖాతా నెంబర్లు, సర్వే సబ్ డివిజన్ నెంబర్లతో కొత్త ఖాతాలు ఇవ్వవచ్చని బుర్ర తక్కువ ఆదేశాలు ఇచ్చారు. దాంతో మన రాష్ట్రంలో ఆన్‌లైన్ 1బీ ఎంట్రీలు లక్షలలో పెరిగిపోయి, వ్యవసాయ భూమి ఆంజనేయుని వాలంలా పెరిగిపోవడం, మొత్తం రెవిన్యూ పాలనా వ్యవస్థ కుప్పకూలడం మొదలయ్యింది.

పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగి కూడా కాని కంప్యూటర్ ఆపరేటర్ ఏసీ గదిలో కూర్చుని భూమి రికార్డును మార్చేస్తే బాధితుడు ఏం చెయ్యాలి? ఆర్ఓఆర్ చట్టం ప్రకారం ఆర్‌డీఓ వద్ద అప్పీల్ చేసుకోవాలి. ఆ తర్వాత జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద రివిజన్, ఆ పిదప హైకోర్ట్ ముందు రెండవ రివిజన్. ఇలా ఒక్క మౌస్ క్లిక్‌తో మీ బతుకును అతలాకుతలం చేసేయవచ్చు.

జూలై 2, 2016న విశాఖపట్టణంలో 'ఆన్‌లైన్ భూమి రికార్డులు- ప్రజల హక్కులు' పేరుతో పబ్లిక్ హియరింగ్ జరిగింది. అందులో ముగ్గురు విశ్రాంత సీనియర్ ఐయ్యేఎస్ అధికారులు— శ్రీ ఇఎఎస్ శర్మ, చాయ రతన్, టి. గోపాల రావు పాల్గొని రోజంతా కేసులు విన్నారు. ప్రభుత్వానికి తమ సూచనలతో నివేదిక ఇచ్చారు. అందులో ఒకటి ఆన్‌లైన్ రికార్డుతో బాటు, ఆఫ్‌లైన్ చేతిరాత రికార్డ్ కూడా తప్పనిసరిగా ఉండాలి. సమస్యకు పరిష్కారం ఏమిటి? 2015 నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్ భూమి రికార్డు వచ్చి పదేళ్లు కావస్తున్నది. అది ఎలా పని చేస్తున్నదీ, రైతులు దాని గురించి ఏమనుకుంటున్నదీ తెలుసుకోవడానికి ప్రభుత్వం ఏ మాత్రం ఆసక్తి చూపిన దాఖలాల్లేవు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులలో 80శాతం భూమికి సంబంధించినవే ఉంటున్నాయని ఈ మధ్య రెవిన్యూ మంత్రి చెప్పారు. మరి అందులో ఈ ఆన్‌లైన్ భూమి రికార్డు వ్యవస్థ శకుని పాత్ర ఎంత ఉన్నదో ప్రభుత్వం తెలుసుకుంటున్నదా?

▪ పి.ఎస్. అజయ్‌కుమార్

ఆంధ్రజ్యోతి



దివిసీమ ఉప్పెన నాటి హృదయ విదారక దృశ్యం

తీరాన తీరని అలజడి

దివిసీమ ఉప్పెనకు నేటికి 48 ఏళ్లు



పాత ఎడ్లంకలో కృష్ణానది తీరం కోతకు గురికావడంతో గత ఏడాది కూలిన ఇల్లు

- ఇప్పటికీ తీరంలో భద్రత ప్రశ్నార్థకమే..
- వైపరీత్యాల నుంచి పాఠాలు నేర్వని పాలకులు
- విపత్తుల నిర్వహణపై కొరవడిన శ్రద్ధ
- యథేచ్ఛగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం
- వైసీపీ హయాంలో బ్లాక్ శాండ్ పేరిట దోపిడీ
- కరకట్ట సమీపంలో భారీ తవ్వకాలు
- పొలాల్లోకి చొచ్చుకొస్తున్న సముద్రపు నీరు
- కోతకు గురవుతున్న కృష్ణానది తీరప్రాంతాలు
- తీరంలో క్షణక్షణం.. భయంభయం

48 ఏళ్ల కిందటి ఓ రాత్రి.. దివిసీమ చరిత్రలో అదో కాళరాత్రి.. తాడెత్తున ఎగసిన రాకాసి అలలు ఊర్లకు ఊర్లను మింగేశాయి.. 10 వేల మందిని పొట్టన పెట్టుకున్నాయి.. అప్పట్లోనే రూ.175 కోట్ల ఆస్తినష్టాన్ని మిగిల్చాయి.. ఆనాటి ఆ రాత్రి సముద్రం సృష్టించిన విలయం ఇప్పటికీ దివి గుండెల్లో ఓ పెను ప్రళయమే. అంతటి విపత్తు జరిగి 48 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఇక్కడి తీరప్రాంతాలు ఎంతవరకు భద్రంగా ఉన్నాయని ప్రశ్నిస్తే సమాధానం రావడం కష్టమే అవుతుంది. కంటినిండా నిద్రపోతున్నారా.. అంటే.. కాదనే జవాబు దివివాసుల కన్నీళ్లలో కనిపిస్తుంది. అక్రమార్జనకు అలవాటుపడిన అవినీతిపరులు తీరాన్ని తవ్వేస్తుంటే, 'కట్టలు' తెంచుకుంటున్న సముద్రుడు నానాటికీ ముందుకు చొచ్చుకొస్తుంటే, బంగారు భూముల్లో ఒక్క పంట పండటం గగనమైపోతుండగా.. గతాన్ని తలచుకుంటూ, భవిష్యత్తుపై భయాందోళనతో బతుకుతున్న దివివాసులు ఆకాశంలో ఏ చిన్న మెరుపు మెరిసినా, దూరంగా ఏ పిడుగుపడినా, అల్పపీడనాలపై ఏ చిన్న హెచ్చరిక వచ్చినా కంగారు పడిపోతున్నారు.



ఎదురుమొండి దీవుల్లో కోతకు గురవుతున్న కరకట్ట

6లో

పులిపిరి (సురిడి కాయ) ఆకు పసరుతో మటుమాయం

కృష్ణా జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపోసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

19, 20, 21,22 తేదీల్లో కృష్ణా జిల్లా, బందర్ రోడ్, మనోరమ ప్రక్కన, రెండవ వీధి, హోటల్ తానియా నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేళ ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్టేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 29 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.



ధర్నా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాలో పెద్దసంఖ్యలో ఆశాలు పాల్గొని నినాదాలు చేశారు. - ధర్నాచౌక్, ఆంధ్రజ్యోతి

పాల సేకరణ ధర పెంపు

10 శాతం వెన్న కలిగిన లీటరు గేదె పాలపై రూ.2, ఆవు పాలపై రూ.1.50

- పాడి రైతులకు రెండోవిడత బోనస్‌గా రూ.12 కోట్లు విడుదల
- కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సమావేశంలో నిర్ణయం



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) పాడి రైతులపై వరాల జల్లు కురిపించింది. 10 శాతం వెన్న కలిగిన గేదె పాల సేకరణ ధర లీటరుకు రూ.2, ఆవుపాలకు రూ.1.50 పెంచింది. రెండో విడత రూ.12 కోట్ల బోనస్‌ను ప్రకటించింది. ప్రస్తుతం 10 శాతం వెన్న కలిగిన పాలకు రూ.80 చెల్లిస్తుండగా, దానికి రెండు రూపాయలు పెంచారు. ఈ మేరకు సోమవారం పాలఫ్యాక్టరీలో జరిగిన పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు వెల్లడించారు. కృష్ణామిల్క్ యూనియన్‌లో ఉన్న పాడి రైతులకు నాలుగు నెలలకు సంబంధించిన రెండో విడత బోనస్ రూ.12 కోట్లను మంగళవారం విడుదల చేస్తున్నామని తెలిపారు. ఏడాదికి మూడు విడతలుగా బోనస్ ఇస్తున్నామన్నారు. యూనియన్ మ్యాక్స్ చట్టంలో ఉన్న నేపథ్యంలో ఆర్థిక లాభం లెక్కలు వేసుకుని బోనస్‌లు ప్రకటిస్తున్నామన్నారు. పాలకు లీటరుకు రూ.82 ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఆవు పాలకు రూ.1.55 పెంచామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ధరలు పెంచుతున్నామన్నారు. ఎలాంటి సంక్షోభాలు వచ్చినా రైతులకు సాయం చేయడానికి కృష్ణామిల్క్ యూనియన్ ముందుంటుందన్నారు. గ్రామీణ యువతకు డెయిరీ ఫాంపై ఆసక్తిని పెంచేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుడి నుంచి తీసుకున్న డబ్బుల్లో 82 శాతం పాడి రైతులకు ఇస్తున్నామన్నారు. వరదల సమయంలో

మిగతా 8లో..

ఆపరేషన్ బుడమేరు ఏమైంది?

నగరంలో పెరుగుతున్న ఆక్రమణలు

ఆక్రమణల తొలగింపు సరే.. అడ్డుకునే వారేరీ..?

- వరదలు ముంచెత్తినా మారని అక్రమార్కులు
- అయోధ్యనగర్ కట్ట వెంబడి భారీగా..
- పాతరాజరాజేశ్వరిపేటలోనూ అదే పరిస్థితి
- నెలలో 'ఆపరేషన్ బుడమేరు' చేపడతామన్న మంత్రి

అయోధ్యనగర్‌లోని రాఘవేంద్ర థియేటర్ సమీపంలో బుడమేరు కట్ట ఆక్రమించుకుని ఏర్పాటుచేసిన దుకాణాలు



బుడమేరు ఉగ్రరూపం దాలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో సెప్టెంబరులో వరదలు ప్రత్యక్షంగా చూపించాయి. కేవలం 100 కిలోమీటర్ల మేర ప్రవహించే బుడమేరు వల్ల విజయవాడ నగరం అతలాకుతలమైంది. దీనికి ప్రధాన కారణం ఆక్రమణలే. అంతటి విపత్తు నుంచి బయటపడినా అక్రమార్కుల్లో కనీస స్పందన లేదు. పైగా నగరవ్యాప్తంగా బుడమేరు వెంబడి ఆక్రమణలు పెరుగుతుండటం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : బుడమేరు పరివాహక ప్రాంతం 2,930 ఎకరాలు కాగా, ఒక్క నగర పరిధిలోనే బుడమేరు భూములు సుమారు 80 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు నివేదిక తయారు చేశారు. ఎకరం భూమి విలువ రూ.10 కోట్ల పైచిలుకు ఉంటుందని తేల్చారు. అంటే.. మొత్తం ఆక్రమణల విలువ రూ.800 కోట్లపైనే అని నివేదికలో పేర్కొన్నారు. ఇక నగరం కాకుండా ఇతర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాలు బుడమేరు పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైనట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. వీటిని తొలగించి, భవిష్యత్తులో నగరానికి వరద ముప్పు తొలగించేందుకు ఆపరేషన్ బుడమేరు చేపట్టనున్నట్లు సెప్టెంబరు నెలాఖరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ప్రకటించారు. సుమారు 2 నెలలు గడిచినా ఇంతవరకు ఒక్క ఆక్రమణను తొలగించింది లేదు. పైగా రోజురోజుకూ ఆక్రమణలు పెరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా బుడమేరు వాగు వెడల్పు 50 నుంచి 120 మీటర్లు ఉండాల్సి ఉండగా, చాలాచోట్ల 10 నుంచి 30 మీటర్లకు కుంచించుకుపోయింది. రియల్ వ్యాపారులు బుడమేరును పూడ్చేసి ఏకంగా కాంక్రీట్ స్లాబులతో బిల్డింగ్‌లు కట్టేశారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఈ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు సెంట్రల్, గన్నవరం నియోజకవర్గాల్లోనూ బుడమేరు ఆక్రమణలు పెద్దస్థాయిలో ఉన్నాయి.

అయోధ్యనగర్‌లో ఆక్రమణలు

అయోధ్యనగర్‌లోని రాఘవేంద్ర థియేటర్ సమీపంలో బుడమేరు కట్ట తాజాగా ఆక్రమణలకు గురవుతోంది. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ కట్ట స్థలాన్ని కొందరు ఏళ్ల తరబడి ఆక్రమించుకుని వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. 1990, నవంబరు 14న నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ, తుపాను అత్యవసర పునర్నిర్మాణ పథకం ద్వారా ప్రపంచ బ్యాంకు రుణ సహాయంతో బుడమేరు వరద నివారణ నిర్మాణ పథకాన్ని చేపట్టారు. కట్ట ఆక్రమణలకు గురికాకుండా ఆనాడు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అయితే, కొన్నేళ్ల నుంచి బుడమేరు వంతెన వరకు కొందరు కట్టను ఆక్రమించుకుని వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు

మిగతా 8లో..

ఆపరేషన్ బుడమేరు ఎప్పుడు?

ఆపరేషన్ బుడమేరులో భాగంగా బుడమేరు మొదలైన దగ్గర నుంచి కొల్లేరులో కలిసే వరకు ఆక్రమణలు తొలగించి అవసరమైన మేరకు అంటే.. కనీసం 50 మీటర్ల వెడల్పు చేయాలన్నది అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రస్తుతం ఉన్న డిశ్చార్జి సామర్థ్యాన్ని 7 వేల క్యూసెక్కుల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచాలని భావిస్తున్నారు. ఇది పెరగాలంటే ఆక్రమణలు తొలగించి, బుడమేరు కాల్వను వెడల్పు చేయక తప్పదు. ఆక్రమణల తొలగింపుతో పాటు విజయవాడ నగర పరిధిలో బుడమేరు ప్రవాహ మార్గంలో రెండువైపులా పటిష్ఠమైన కరకట్టలు నిర్మించి నగరానికి ముంపు నుంచి రక్షణ కల్పించడంతో పాటు మున్ముందు ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చేయాలన్నది 'ఆపరేషన్ బుడమేరు' లక్ష్యం. ఇవన్నీ ఎప్పుడు కార్యరూపం దాలుస్తాయని నగరవాసులు ఎదురుచూస్తున్నారు. అలాగే, తాజాగా జరుగుతున్న ఆక్రమణలను నిలువరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైసీపీ నేత గౌతంరెడ్డికి హైకోర్టు ఆదేశం

6లో

18 మంది మహిళల ఆచూకీ గుర్తింపు

8లో



• అభినందన

6లో

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌గా పట్టాభిరామ్ ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఎంపీ కేశినేని చిన్ని హాజరై పట్టాభిని అభినందించారు.

బెల్టు తీస్తున్నారు



- గ్రామాల్లో విస్తరిస్తున్న బెల్టు షాపులు
- సిండికేట్ల కనుసన్నల్లో భారీ విక్రయాలు
- బడ్డీల్లో బాటిళ్లు ఉంచి అధిక ధరలకు..
- సీసాలపై హీల్స్ తొలగించి అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మద్యం నూతన పాలసీ అమల్లోకి వచ్చి కొత్త షాపులు తెరుచుకున్న కొద్దిరోజులకే 'బెల్టు' బాగోతాలు బయటపడుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కొంతమంది ఈ బెల్టు వ్యవహారాలను సాగిస్తున్నారు. మద్యం షాపులను దక్కించుకోవడానికి వ్యాపారులంతా సిండికేట్లుగా మారినట్టుగానే బెల్టు షాపుల నిర్వహణకు కొత్తగా సిండికేట్లు తయారయ్యారు. వీరి కనుసన్నల్లో జిల్లాలో కొత్తకొత్త చిత్రాలు కనిపిస్తున్నాయి.

హీల్స్ మాయం

గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహించేవారు వివిధ షాపుల నుంచి వివిధ రకాల బ్రాండ్లకు చెందిన మద్యాన్ని కొంటున్నారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం ఒక కొనుగోలుదారుడికి మూడు మద్యం సీసాలకు మించి విక్రయించకూడదు. అంతకుమించి ఉంటే ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేస్తారు. కొన్ని మద్యం షాపుల యజమానులు ఈ నిబంధనను గాలికి వదిలేశారు. ఒక కొనుగోలుదారుడు ఎన్ని మద్యం సీసాలు అడిగితే అన్నీ ఇచ్చేస్తున్నారు. పైగా ధరలను పెంచి విక్రయిస్తున్నారు. బడ్డీకొట్ల ముసుగులో ఈ బెల్టు వ్యవహారాలు సాగిస్తున్నట్టు సమాచారం. కొంతమందైతే ఇళ్లలోనే రహస్యంగా తంతు నడిపిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి సరుకును కొంటున్న వెంటనే ఆ సీసాలపై మూత చుట్టూ ఉండే

మిగతా 8లో..


కోడూరు మండలంలో అవుట్ ఫాల్ స్లూయిస్ దుస్థితి

రెండు దిక్కుల్లో సముద్రం. మిగిలిన రెండు దిక్కుల్లో కృష్ణానది, నడుమ ఉండే దీవే దివిసీమ. ప్రకృతి వైపరీత్యాలు, ఉప్పెన ముప్పులు, వరదలతో తరచూ ఈ ప్రాంతం తల్లడిల్లిపోతోంది. దివిసీమ ఉప్పెన అనంతరం సముద్రపు అలలు చెలియల కట్టు దాటి గ్రామాలపై పడకుండా రక్షణగా కరకట్టను పటిష్టపర్చి నది ద్వారా లోపలికి వచ్చే నీరు బయటకు పోయేలా, పోటు సమయాల్లో సముద్రపు నీరు లోపలికి రాకుండా అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను ప్రభుత్వం నిర్మించింది. వరద నీరు గ్రామాల్లోకి రాకుండా కృష్ణా కరకట్టను పటిష్ట పరిచింది. 1999లో చంద్రబాబు ప్రభుత్వం కృష్ణా కరకట్టలు పునర్నిర్మించింది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం సముద్రపు కరకట్టను పునర్నిర్మించింది. కృష్ణా కరకట్టలు కొంతమేర పటిష్టంగా ఉన్నప్పటికీ సముద్రపు కరకట్టలు తీర ప్రాంత ప్రజలను తీవ్ర ఆందోళనను గురి చేస్తున్నాయి. సముద్రపు కరకట్టల నిర్వహణను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం రూ.25 కోట్లతో కరకట్టలను పటిష్టపరుస్తామని ఉత్తుత్తి ప్రకటన చేసింది. రెండేళ్లకు కూడా డీపీఆర్‌లు తయారు చేయలేదు. కరకట్టలు పటిష్టపర్చాలంటూ అప్పుడు మండలి బుద్ధ ప్రసాద్ నేతృత్వంలో నాటి ప్రతిపక్ష టీడీపీ కరకట్ట పొడవునా పాదయాత్ర చేసింది. ప్రతిపక్షంలో ఉన్న వారు అధికారంలోకి వచ్చారు. కానీ ఇంతవరకు కరకట్టల ఊసే తీయలేదు. అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ద్వారా సముద్రపు నీరు పొలాలను ముంచెత్తుతోంది.

శిథిలావస్థకు చేరిన సముద్రపు కరకట్ట



తీరాన తీరని అలజడి

- ఇప్పటికీ తీరంలో భద్రత ప్రశ్నార్థకమే..
- వైపరీత్యాల నుంచి పాఠాలు నేర్వని పాలకులు
- విపత్తుల నిర్వహణపై కొరవడిన శ్రద్ధ
- యథేచ్ఛగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం
- వైసీపీ హయాంలో బ్లాక్ శాండ్ పేరిట దోపిడీ
- కరకట్ట సమీపంలో భారీ తవ్వకాలు
- పొలాల్లోకి చొచ్చుకొస్తున్న సముద్రపు నీరు
- కోతకు గురవుతున్న కృష్ణానది తీరప్రాంతాలు
- తీరంలో క్షణక్షణం.. భయంభయం

దివిసీమ ఉప్పెనకు నేటికి 48 ఏళ్లు

(ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ): దివి ప్రాంతంలో విచ్చలవిడిగా పర్యావరణ విధ్వంసం సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్లాక్‌శాండ్ పేరుతో సముద్ర చెలియలి కట్ట సమీ పంలో తవ్వకాలు చేపట్టి తీర భద్రతకు సవాల్ విసిరారు. సముద్రపు బ్యాక్ వాటర్ పాయల్లో తవ్వకాలు జరపకూడదని పెట్టిన సీఆర్‌జడ్ నిబంధనలను వైసీపీ హయాంలో తుంగలో తొక్కారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ సీఆర్‌జడ్ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘనకు గురవుతున్నాయి.

చొచ్చుకొస్తున్న సముద్రం

వీటి కారణంగా తీరగ్రామాల్లో కృష్ణానదీ పరివాహక గ్రామాల్లో కోత తీవ్రత ఆందోళనకర స్థాయికి పెరిగిపోయింది. రెండు, మూడు దశాబ్దాలుగా విచ్చలవిడిగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం కారణంగా వాతావరణంలో పెనుమార్పులు సంభవించి, భూతాపం నానాటికీ పెరిగిపోతోంది. అది సముద్రపు తీర గ్రామాల్లో భౌగోళిక పరిస్థితుల్లో మార్పునకు కారణమవుతోంది. కృష్ణానది సముద్రంలో కలిసే ప్రాంతాల్లో సముద్రపు మట్టం గణనీయంగా పెరిగి సముద్రం క్రమేణా ముందుకు వస్తోంది. కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లోని ఐదు వేల ఎకరాల్లో నాలుగున్నరేళ్లుగా ఒక్క పంట కూడా తీసుకోలేకపోయారు. ఈ ఏడాదీ సముద్రపు నీరు డ్రెయిన్ల ద్వారా పంట పొలాలను ముంచెత్తుతోంది.

అది కాళరాత్రి..

1977 నవంబరు 19వ తేదీన రాత్రి సంభవించిన దివిసీమ పెను ఉప్పెనకు నేటితో 47 ఏళ్లు పూర్తయ్యాయి. తాడెత్తున ఎగసిన రాకాసి అలలు గ్రామాలపై విరుచుకుపడి కృష్ణాజిల్లా నాగాయలంక, కోడూరు మండలాతోపాటు ప్రస్తుతం బాపట్ల జిల్లా రేపల్లె ప్రాంతంలోని తీరప్రాంత గ్రామాల్లో దాదాపు 10 వేల మందికిపైగా మృతిచెందారు. లక్షలాది పశువులు మృత్యువాత పడ్డాయి. ఆనాటి ప్రభుత్వ అంచనాల మేరకు దాదాపు రూ.175 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. ఆ ఒక్కరాత్రి జరిగిన నష్టాన్ని పూడ్చి మళ్లీ ఈ ప్రాంతాన్ని పునర్నిర్మించటానికి పదేళ్ల కంటే ఎక్కువ సమయమే పట్టింది. దివిసీమ ప్రజలు ఆ రాత్రిని కాళరాత్రిగా చెబుతారు. తాడెత్తున ఎగసిన సముద్రపు అలలు నాగాయలంక మండలంలోని సొర్లగొంది, నాలి, దీనదయాళపురం, సంగమేశ్వరం, గుల్లలమోద, కోడూరు మండలం పాత ఉపకాలి, హంసలదీవి, ఇరాలి, రామకృష్ణాపురం గ్రామాలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. నిద్రలో ఉన్నవారు నిద్రలోనే జల సమాధి అయ్యారు. కొందరు చెట్లు పట్టుకుని వేలాడుతూ ప్రాణాలు దక్కించుకున్నారు. తీరం నుంచి దాదాపు 8 కిలోమీటర్ల దూరం అలలు పోటెత్తి గ్రామాలను ముంచేశాయి. సొర్లగొంది, నాలి, సంగమేశ్వరం, పాలకాయితిప్ప, హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలిలో ప్రతి గ్రామంలోనూ వందల్లో ప్రాణాలు కోల్పోయారు. ఎటుచూసినా శవాల గుట్టలు.. అయిన వారిని కోల్పోయిన వారి ఆర్తనా దాలు..తినేందుకు తిండి, తాగేందుకు గుక్కెడు నీరు దొరకలేదని విపత్తు నుంచి బయటపడిన వారు చెబుతుంటారు. నాడు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవటంతో మూడో రోజుకు గానీ ప్రపంచానికి తెలియలేదు. ఆపన్నులకు అండగా ఉన్నామంటూ దేశ, విదేశాల నుంచి స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల విద్యార్థులు, కళారంగం నుంచి కళాకారులు తరలివచ్చారు. కుళ్లి కంపుకొడుతున్న శవాలకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు శవసేన ఏర్పాటైంది. నాటి మంత్రి మండలి వెంకట కృష్ణారావు నేతృత్వంలో సహాయక పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రాధినేతలు, దేశాధినేతలు తరలివచ్చి పునర్నిర్మాణానికి చేయూతనందించారు. పుష్కరకాలానికి గానీ మరుభూమిగా మారిన దివిగడ్డ పునర్నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటికీ ఆకాశంలో చిన్న మెరుపు మెరిసినా, దూరంగా పిడుగు పడినా, సముద్రపు అల్పపీడనాలపై ఏ చిన్న హెచ్చరిక వచ్చినా దివి ప్రజల్లో తెలియని భయం, ఆందోళన.

ప్రజలు కోరుకుంటున్నది ఇదీ..

- శిథిల తుఫాను షెల్టర్ల స్థానంలో తుఫాన్లు, సునామీలు తట్టుకునేలా ప్రజలతోపాటు పశువులు రక్షణ పొందేలా బహుళ ప్రయోజన షెల్టర్లు నిర్మించాలి. ఇప్పటికే ఈలచెట్లదిబ్బలో ఇలాంటి షెల్టర్ నిర్మించారు.
- విపత్తులు సంభవించినప్పుడు తీర గ్రామాలకు అధికారులు, సహాయ బృందాలు వచ్చేందుకు రహదారులు నిర్మించాలి.
- తీర గ్రామాల్లో సముద్రపు కోత నివారణకు నిపుణులతో అధ్యయనం చేయించి శాశ్వత పరిష్కారం చూపాలి.
- బలహీన సముద్రపు కరకట్టలు పటిష్టపరిచి సముద్రపు నీరు డ్రెయిన్ల ద్వారా గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.
- తీర గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీలను అనుసంధానించి వనరుల కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు విపత్తులను ఎదుర్కొనేలా శిక్షణ ఇవ్వాలి. వనరుల కేంద్రాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచాలి. 2004 సునామీ అనంతరం కొన్ని గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో వనరుల కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంచాయతీల అజమాయిషీ లేక అవి మూలనపడ్డాయి. రెవెన్యూ కార్యాలయాల వద్ద నిలిపి ఉంచిన పడవలు శిథిలమై ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వాటిల్లింది.
- విశాఖపట్నంలో మాదిరిగా గాలులలను తట్టుకునేలా గుండ్రని విద్యుత్ స్తంభాలు, భూగర్భ విద్యుత్ లైన్స్ వేయాలి.

పునర్నిర్మాణానికి పన్నెండేళ్లు పట్టింది



ఉప్పెన అనంతరం దివి ప్రాంత పునర్నిర్మాణానికి దాదాపు పన్నెండేళ్లు పట్టింది. నాడు మంత్రిగా ఉన్న మండలి వెంకట కృష్ణారావు పదవిని త్యాగం చేసి పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు. అవనిగడ్డ గాంధీక్షేత్రంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ఎందరినో ఆదుకున్నారు. ఆనాడు ఆయన వేసిన కరకట్టే ఇప్పుడున్న సముద్రపు కట్ట. తర్వాత మండలి బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా ఆ కరకట్టను పునర్నిర్మించారు. ఆనాడు విద్యార్థిగా ఉండి నాలాంటి ఎందరో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. - భోగాది రమణ

మెరుగైన సాంకేతికతను వినియోగించుకోవాలి



విపత్తులు ఎదుర్కొనే సన్నద్ధంగా ఉండాలి. మెరుగైన సాంకేతికతను వినియోగించుకోవాలి. జపాన్, ఇండోనేషియా వంటి చోట్ల విపత్తులను ఎదుర్కొనే వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉంది. అలాంటి సన్నద్ధత మనకూ అవసరం. సముద్రపు కోత, నదీ తీర గ్రామాల్లో పెరుగు తున్న నదీపాతం గురించి నిపుణుల ద్వారా అధ్యయనం జరగాల్సి ఉంది. - బొబ్బా గోవర్ధన్, ఎన్ఆర్ఐ, పాత ఎడ్లంక

విపత్తులు ఎదుర్కొనే సన్నద్ధత ఏదీ..

1977 ఉప్పెన అనంతరం పలు తుఫాన్లు, వరదలు దివి ప్రాంతాన్ని అతలాకుతలం చేసినప్పటికీ సహాయ పునరావాసాలపైనే ప్రభుత్వం దృష్టి పెడుతోంది. నష్ట తీవ్రత తగ్గించేలా చర్యలు చేపట్టడంలో విఫలమవుతూనే ఉంది. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో విపత్తుల నష్ట తగ్గింపు కార్యక్రమం కింద తీర గ్రామాల్లో తుఫాన్ షెల్టర్లకు వెళ్లేలా తారు రోడ్లు వేశారు. కానీ షెల్టర్ల గురించి గానీ, మండల కేంద్రాల్లో నుంచి తీర గ్రామాలకు వెళ్లే రహదారుల గురించి గానీ, అత్యవసర సమయాల్లో వారికి వారే సహాయం చేసుకునేలా తీర గ్రామాల ప్రజలకు శిక్షణ ఇవ్వటంలో గానీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి.

అసెంబ్లీ వాయిస్

జగన్..పేదలను నానా అవస్థలు పెట్టాడు



- **మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**

జి.కొండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి అని ప్రచారం చేసుకున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో పేదలను నానా అవస్థలు పెట్టాడని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ విమర్శించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో పక్కా గృహాల అంశంపై ఆయన మాట్లాడారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన పక్కా గృహాల బిల్లులను జగన్ 2019-24 వరకు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెట్టిందన్నారు. చంద్రబాబు చేప ట్టిన ప్రతి పనికి వ్యతిరేకంగా జగన్ ప్రవర్తించాడన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.920 కోట్లు, మైలవరంలో రూ.6 కోట్లు పైగా పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి పేదల సొం తింటి కల నెరవేర్చాలన్నారు. సమగ్ర సర్వే చేయించి బిల్లులు ఇప్పించా లని గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథిని వసంత కోరారు.

మల్లవల్లి పారిశ్రామికవాడలో సదుపాయాలు కల్పించాలి



- **గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

గన్నవరం: మల్లవల్లి పారిశ్రామికవాడలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం అసెంబ్లీలో కోరారు. 479 ఎకరాల అసైన్డ్ భూమిని భూసేకరణ చేయాలని కోరారు. మరో 183 మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అక్కడ ఫైర్‌స్టేషన్, పోలీస్ ఔట్‌పోస్ట్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నిర్మించాలన్నారు. ఎకరం రూ.16.50 లక్షలకే పారి శ్రామికవేత్తలకు ఇవ్వటం కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమ న్నారు. గత వైసీపీ ప్రభుత్వం మల్లవల్లిలో భూములను ఎకరం రూ.89 లక్షలకు పెంచడం వల్ల అతీగతిలేకుండా పోయిందని విమర్శించారు. అశోక్ లేల్యాండ్ రీ ఓపెనింగ్‌కు సిద్ధంగా ఉందని యార్లగడ్డ తెలిపారు.

ముక్త్యాల ఎత్తిపోతల పథకం ప్రారంభించాలి



- **జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**

జగ్గయ్యపేట: గత వైసీపీ ప్రభుత్వ హయాం లో పేరు మార్చి, నిధులు ఇవ్వకుండా ఏమార్చిన ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి మళ్లీ అంచనాలు వేసి ప్రారంభించాలని అసెంబ్లీ సమావేశాల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని వేదాద్రిగా పేరు మార్చి, స్థలం మార్చి, కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వకపోవటంతో నిలిచిపోయిందని, తిరిగి అంచనాలు వేసి పాత పథకం పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. డిజైన్ లోపంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ప్రారంభించిన పోలంపల్లి ఆనకట్ట ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీరందించలేకపోతుందని, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నీటి పారుదల శాఖ మంత్రి స్వయంగా వచ్చి ఆ రెండు ప్రాజెక్టులను పరిశీలించాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాతయ్య కోరారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైసీపీ నేత గౌతంరెడ్డికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వరకు పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దు
- పోలీసులకు స్పష్టీకరణ..ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ 21కి వాయిదా

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో దర్యాప్తునకు సహకరించాలని వైసీపీ నేత గౌతంరెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకు గౌతంరెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలిచ్చింది. ముందస్తు బెయిల్ పిటి షన్‌పై విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఫోర్జరీ పత్రాలతో తన భూమిని ఆక్రమించడమే కాకుండా, తనను చంపేందుకు ప్రయత్నించారంటూ వైసీపీ నేత గౌతం రెడ్డిపై విజయవాడకు చెందిన గండూరి ఉమామహేశ్వర శాస్త్రి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా సత్యనారాయణ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గౌతం రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా గౌతంరెడ్డి తరఫున సీనియర్ న్యాయ వాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. భూమి సరిహద్దు విషయంలో పిటిషనర్, ఫిర్యాదుదారు మధ్య ఎప్పటి నుంచో వివాదం ఉందన్నారు. పిటిషనర్ డ్రైవర్, అతని అనుచరులు బెదిరించారని కేసు పెట్టారన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో గౌతంరెడ్డి లేరన్నారు. అసి స్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) వాదనలు విని పిస్తూ... ఈ పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్(ఏజీ) వాదనలు వినిపిస్తారన్నారు. అందుకోసం విచారణను నేటికి (మంగళవారం) వాయిదా వేయాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. విచారణను వాయిదా వేశారు.

బీఎల్‌వోలు ఇంటికెళ్లి పరిశీలించాలి

- సీఈఓ వివేక్ యాదవ్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు, తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆన్‌లైన్‌లో సమర్పించిన సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌ను పరిశీలించాలి. సరిగ్గా ఉన్నాయని తేలితే ఆమోదిస్తున్నట్లు, లేకపోతే తిరస్కరిస్తున్నట్లు ఎంతకం చేయాలి. నామినేషన్ల స్వీకరణ గడువుకు పది రోజుల ముందు వరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళా ఓటర్ల విషయంలో కొన్ని సూచనలు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఆమేరకు వివాహం అయిన మహిళా ఓటర్ల ఇంటి పేరు విద్యా ధృవీకరణ పత్రాలతో సరిపోలకపోయినా దరఖాస్తు తిరస్కరించవద్దు' అని సీఈఓ స్పష్టం చేశారు.

రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దుతా

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్


కొమ్మారెడ్డి పట్టాభిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు కళ్లే నాగేశ్వరరావు, గుండారపు హరిబాబు తదితరులు

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే గాంధీ జయంతి నాటికి స్వచ్ఛ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలబెడతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. నేటి యువత సామాజిక స్పృహ కలిగి ఉండ టంతో పాటు ప్రశ్నించే తత్వాన్ని అలవర చుకోవాలని ఆయన సూచించారు. తుమ్మల పల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌గా పట్టాభిరామ్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వందలాది మంది అభిమానులు హాజరయ్యారు. మహాత్మాగాంధీ, ఎన్టీ రామారావు, పట్టాభిరామ్ తండ్రి దుర్గాప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తన తండ్రి కొమ్మారెడ్డి దుర్గాప్రసాద్ క్రమశిక్షణతో తనను పెంచారని పట్టాభిరామ్ అన్నారు. ఆయన నేర్పిన విలువలే తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయన్నారు. ఎన్టీఆర్‌పై అభిమానంతో తమ కుటుంబంలో అందరం తొలి నుంచి టీడీపీకి పని చేశామన్నారు. నేటి యువతలో ఫైర్ లేకుండా పోతోందని, సమాజంలో అన్యాయాలపై ప్రశ్నించ టంతో పాటు పోరాడేతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2012లో ప్రారంభించిన పాదయాత్రతో తన రాజకీయ జీవితం ప్రారంభమైందన్నారు. గత ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన నెల నుంచే రాష్ట్రాన్ని లూటీ చేయ టం ప్రారంభించిందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేయటంతో తాను గళం వినిపించాల్సి వచ్చిందన్నారు. తానెప్పుడూ నిరాధార, అసత్య ఆరోపణలు చేయలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎప్పుడూ వాస్తవాలు మాట్లాడాలని చెబుతుండేవారని, ఆయన చూపిన మార్గదర్శకత్వంలోనే ముందుకు వెళుతున్నానన్నారు. చెత్త నుంచి సంపద తయారీతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వారం పాటు ఏదైనా గ్రామంలో చెత్త తీయటం మానేస్తే ఆ గ్రామంలో ఉండలేమన్నారు. అలాంటి చెత్తపై వైసీపీ ప్రభుత్వం పన్ను వేసిందన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా కేంద్రం నుంచి నిధులు తెచ్చేలా కృషి చేస్తానన్నారు.

పదవుల్లో యువతకు పెద్దపీట

స్వచ్ఛాంధ్ర చైర్మన్‌గా పట్టాభి పనిచేయటం ఆనందంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. యువతను ప్రోత్సహించే విధంగా చంద్రబాబు పదవులు ఇస్తున్నారని, వచ్చే 30 ఏళ్లలో కమిట్‌మెంట్‌తో యువత పనిచేసేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వంపై పట్టాభి ధైర్యంగా గళం ఎత్తారన్నారు. ఇంటిపై దాడి చేసినా, అక్రమ అరెస్టులు చేసినా భయపడలేదన్నారు. బుద్దా వెంకన్న, నాగుల్ మీరా పదేళ్లుగా ఎన్నో పోరాటాలు చేశారని, కమిట్‌మెంట్‌తో పనిచేసిన వారిని సీఎం తప్పకుండా గుర్తించి తగిన సమయంలో పదవులు ఇస్తారన్నారు. పట్టాభిరామ్ గత ప్రభుత్వ అరాచకాలను ధైర్యంగా ఎదిరించారని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టాభికి చైర్మన్ పదవి ఇవ్వటం చాలా ఆనందంగా ఉందన్నారు. టీడీపీ నాయకుల అందరి కృషి వల్ల ఎంపీగా ఎన్నికై ఇక్కడ ఉన్నానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో గాంధీ తరహాలో పట్టాభి అయిదేళ్లు పోరాటం చేశారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను పట్టాభిరామ్ బయటకు తీసుకువచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చారని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పదవికి అర్హుడు పట్టాభిరామ్ అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఎన్నారై ప్రతినిధి తిలక్, వర్ల రామయ్య మాట్లాడారు. గద్దే అనురాధ, ఎం.ఎస్.బేగ్, మన్నవం మోహనకృష్ణ, మాల్యాద్రి, బాల కోటయ్య, రఫీ పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు ఘన సత్కారం

వన్‌టౌన్: కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కళ్లే నాగేశ్వరరావు, మాజీ ఫ్లోర్ లీడర్ గుండారపు హరిబాబు, ప్రజా ప్రతినిధుల కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తల్లా ప్రసాద సుబ్బారావులు సత్కరించారు.

కంచికచర్ల ఎంపీపీపై
హత్యాయత్నం కేసు

- టీడీపీ నేత, అతని సోదరులపై దాడి..నలుగురికి తీవ్రగాయాలు
- పరారీలో వైసీపీ ఎంపీపీ మల్లక్ బషీర్

కంచికచర్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల ఎంపీపీ(వైసీపీ) మల్లక్ బషీర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం ఉదయం పెండ్యాలలో టీడీపీ నాయకుడు నయిముద్దీన్ తన బైక్‌పై ఇంటికి వెళుతుండగా ఎంపీపీ బషీర్, తన సోదరుడు సలీం కారును అడ్డుపెట్టారు. అడ్డు తీయాలని అడుగగా తీవ్ర దుర్భాషలాడుతూ, అసభ్య పదజాలంతో దూషించారు. అంతు చూస్తానని బెదిరించి, దౌర్జన్యానికి దిగడంతో చుట్టుపక్కల వారు వచ్చి కేకలు వేశారు. దీంతో ఎంపీపీ, ఆయన సోదరుడు కారులో పరారయ్యారు. దీనిపై నయిముద్దీన్ తన తమ్ముడు షేక్ షబ్బీర్ బాషా, దిలావర్, జమీర్ అహమ్మద్‌తో కలిసి సాయంత్రం సంఘటన గురించి ప్రస్తావిస్తుండగా అదే సమయంలో ఎంపీపీ మలక్‌బషీర్, సోదరుడు సలీం మరికొంత మంది అనుచరులతో కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో నయిముద్దీన్, అతని తమ్ముళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం వారిని నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎంపీపీ మలక్‌బషీర్, సలీంలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీపీ మలక్ బషీర్ పరారీలో ఉన్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ప్రశాంతమైన పెండ్యాలలో ఎంపీపీ తన ఇష్టానుసారంగా టీడీపీ సానుభూతిపరులపై దురుసుగా ప్రవర్తించడం, వాహనాలను ఆకస్మాత్తుగా మీదకు పోనిస్తూ ఘర్షణ వాతావర్ణం సృష్టిస్తున్నాడని, ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు షేక్ షబ్బీర్ కోరారు.


గొల్లపూడి అయ్యప్ప ఆలయంలో జ్యోతి వెలిగిస్తున్న ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, తూనుగుంట శ్రీనివాసరావు

ఎన్టీఆర్ జిల్లా సమైక్య అధ్యక్షురాలిగా
కందుల కల్పన నామినేషన్



చందర్లపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా సమైక్య అధ్యక్ష పదవికి టీడీపీ తరఫున చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామానికి చెందిన కందుల కల్పన పోటీ చేస్తారని జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ప్రకటించారు. ఆమె సోమవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. జిల్లా సమైక్య ఎన్నిక దాదాపు ఏకగ్రీవం అయ్యే అవకాశముంది. కల్పన ఎన్నిక లాంఛనం కానుంది. నామినేషన్‌కు వెళుతున్న కల్పనకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు తెలిపారు.

కందుల కల్పనను సత్కరిస్తున్న విప్ తంగిరాల సౌమ్య

విజయవాడ డీఎల్‌డీవోగా ఎస్.నిర్మల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ డివిజినల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో)గా ఎస్.నిర్మలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నియమించింది. నిర్మల ప్రస్తుతం తదుపరి పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. రాష్ట్రంలో ఎంతో కీలకమైన ఎన్టీఆర్ జిల్లా ముఖ్య పట్టణం విజయవాడకు డీఎల్‌డీవోగా నిర్మలకు పోస్టింగ్ కల్పించటం గమనార్హం.

ఆధునిక పరిజ్ఞానంతోనే సైబర్ నేరాలకు చెక్

- బ్యాంకర్ల సమావేశంలో క్రైం డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి

గుణదల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిజ్ఞానంతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టడం సాధ్యపడుతుందని క్రైం డీసీపీ తిరుమలేశ్వర రెడ్డి అన్నారు. నగరంలోని బ్యాంకర్లతో సైబర్ నేరాలను అరికట్టడంపై అవగాహన సదస్సు నగర పోలీస్ కమిషనర్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగింది. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఫోన్‌కాల్స్, వీడియో కాల్స్‌ద్వారా వినియోగ దారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని డీసీపీ తెలిపారు. మనీలాండరింగ్, మాదక ద్రవ్యాల కేసుల్లో ప్రమేయం ఉన్నట్టు నమ్మించి అమాయకులను మోసం చేస్తున్నారని తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలను నిలిపి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బెదిరింపులకు గురైన కస్టమర్ల ఫోన్ స్విచ్ ఆఫ్ చేయించాలని తెలిపారు. 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని చెప్పారు.

అయ్యప్పస్వామిని
దర్శించుకున్న గరికపాటి

గొల్లపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామిని సోమవారం ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు దర్శించుకున్నారు. ఆలయ సెక్రటరీ గెల్లి మోహన్‌రావు ప్రత్యేక పూజలు చేయించారు. అయ్యప్ప దేవాలయం విశిష్టత, ప్రత్యేకతలు, మాలధా రణ సమయంలో చేస్తున్న నిత్యాన్నదానంపై ఆయనకు సెక్రటరీ వివరించారు. తూనుగుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గురునానక్ కాలనీలోని రామాలయం సమీపంలోని తిమ్మరుసు రోడ్లో మార్జిన్‌లో చాలా కాలం క్రితం పాత కరెంట్ స్తంభాలను పడవేశారు. అవి ప్రస్తుతం తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

-ఈ.వి రామకృష్ణ(భారతీనగర్)

వెంటనే సిబ్బందిని పంపించి తొలగిస్తాను

-శివకుమార్, విద్యుత్ శాఖ అధికారి

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర



ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 16 అర్జీలను కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ టి. సృజన, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, పీవో యూసీడీ ఇన్‌చార్జి డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పూడికలు తొలగించండి

లబ్బీపేట: మ్యాప్‌ల ఆధారంగా డ్రెయిన్లు పరిశుభ్రపరచాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను సూచించారు. సోమవారం స్క్యూ బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో పర్యటించిన ఆయన సైడ్ డ్రెయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైడ్ డ్రెయిన్లలో పూడికలను ఎప్పటికప్పుడు తీసివేయాలని, వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా సైడ్ కాలువల ద్వారా వెళ్లే విధంగా కాల్వలు శుభ్రపరచాలని, ప్రతి డివిజన్‌లో మ్యాప్‌లు ఆధారంగా డ్రెయిన్లు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసుకుంటూ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తీసివేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఛీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దర్శిపేటలో ద్విచక్రవాహనాల తనిఖీలు

పటమట,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీలు ఎక్కువయ్యాయని, లైసెన్సు లేకుండా యువత విచ్చలవిడిగా వాహనాలను నడుపుతున్నారని పటమట ఎస్‌ఐ ఆర్‌ఎస్ కృష్ణవర్మ తెలిపారు. దర్శిపేట ఐదురోడ్ల జంక్షన్‌లో సోమవారం ద్విచక్ర వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు, బీమాలేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కొంత మందికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు, బీమా కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మశీలో ఉపాధి మెండు

మొగల్రాజపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేవీఎస్‌ఆర్ ఫార్మా కళాశాలలో 63వ జాతీయ ఫార్మశీ వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంటినీ ఆసుపత్రి యూరాలజిస్టు డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఔషధ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి పరిశోధన, పరిశీలన మార్గమని చెప్పారు. ఈ రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షత వహించగా విద్యార్థులు, సమన్వయకర్త డాక్టర్ ఎస్.కనకదుర్గాదేవి పాల్గొన్నారు.



బిషప్ అజరయ్యలో విజేతలతో ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు



బీఎస్‌ఆర్‌కేలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

విద్యార్థులూ..చదువుపై దృష్టి పెట్టండి

బాలల హక్కుల వారోత్సవాల్లో ఎస్‌ఐ సత్యనారాయణ

లబ్బీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు సేవించడం వలన భవిష్యత్తు అంధకారం అవుతుందని సూర్యారావుపేట ఎస్‌ఐ జీవీవీ సత్యనారాయణ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సోమవారం బిషప్ అజరయ్య పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు-బాలలపై ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడిన విద్యార్థులు, యువకులు నూరేళ్ల జీవితంలోని వెలుగులు కోల్పోతున్నారని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థితికి చేరాలని అన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్ర జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె.నజ్మాహెబ్ తుల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.జయశ్రీ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్‌ఆర్‌కే ఉన్నత పాఠశాలలో...

మొగల్రాజపురం: బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా 5వ రోజు ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్, పోలీసు శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, బర్డ్స్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో మొగల్రాజపురం బోయపాటి శివరామకృష్ణయ్య ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కమిషనరేట్ సట్ ఇన్‌స్పెక్టర్ కెవి.సుబ్బారావు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో సమస్యలు వచ్చినపుడు వెంటనే 100, 112 లేదా ఉమన్ ప్రొటెక్షన్ సెల్ హెల్ప్‌లైన్ నెంబరు 181కి ఫోన్ చేయాలని సూచించారు. వక్తలు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా ఉండకూడదని, మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు.

బాలలపై సోషల్ మీడియా ప్రభావంపై పోటీలు

పటమట: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పటమటలంక శ్రీ విజయభారతి ఉన్నత పాఠశాలలో బాలలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథి చైల్డ్‌ఎయిడ్ ఫౌండేషన్ డైరెక్టర్ ఏ గోస్వామి మాట్లాడుతూ సోషల్ మీడియాలో యువత యాక్టివ్‌గా ఉండటం తప్పుకాదని, కొంతమంది పిల్లలు మాత్రం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ విపరీతంగా వినియోగిస్తున్నారన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ నజ్మా హెబ్ తుల్లా, పాఠశాల హెచ్‌ఎం ఏ శైలజ, ఉపాధ్యాయులు జి.సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత వైద్య కళాశాల, ఆస్పత్రికి

పరికరాలివ్వడం అభినందనీయం

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు



పరికరాలకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కె.శివశంకర్, రాజేష్

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దంతవైద్య కళాశాల, ఆసుపత్రికి రూ.11 లక్షల విలువ గల మూడు డెంటల్ కుర్చీలు, ఇతర దంత వైద్య పరికరాలు ఇవ్వడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు అన్నారు. వి.గార్డ్ ఇండస్ట్రీస్ సంస్థ తమ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ పరికరాలను సోమవారం అందించింది. వాటిని ఏపీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శివశంకర్, వి.గార్డ్ డిప్యూటీ మేనేజర్ పి.కె రాజేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్లు నరేంద్ర, మురళీమోహన్, సురేఖ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా శ్రీకృష్ణ పారిజాతం నృత్యరూపకం

విజయవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీ కృష్ణ పారిజాతం ప్రతిరూపకం భక్తి రస ప్రధానంగా రసవత్తరంగా సాగింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం ముమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన డాక్టర్ శుభమరువాడ బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శించారు. ఈ రూపకాన్ని భుజంగరాయ శర్మ రచించారు. సంగీతం-ద్వారం భావన్నారాయణ, పాత్రాయని సంగీతరావు, నృత్య రూపకల్పన డాక్టర్ శుభ మరువాడ చేయగా శ్రీకృష్ణుడు-ప్రణూషారెడ్డి, సత్యభామ-అంబికాశ్రీ, సిద్ధాబత్తుల రుక్మిణి-ప్రణవి యెర్రమరెడ్డి, నారదుడు సంధ్య పిరాట్ల తమ పాత్రలతో అద్భుత నృత్య అభినయ కౌశల్యాన్ని ప్రకటించి రంజింప చేశారు. ఈ రూపకానికి వాయిద్య సహకారంలో నట్టువాంగం- డా.శుభమరువాడ, గాత్రం-సిహెచ్.సుధాశ్రీనివాస్, ఎన్.సి.హెచ్.కౌశిక్ కళ్యాణ్, మృదంగం-గణేష్‌రావు, వాయులీనం-సి.కె.విజయ రాఘవన్, వేణువు-కుమార్‌బాబులు అందించారు.





పరుగు విజేత నిషా షాకు అభినందన

విజయవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థిని నిషా షా ఆదివారం విజయవాడలో జరిగిన 10 కి.మీ పరుగులో మొదటి బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి నగదు, మెడల్ అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ, నిషా షాను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తురాజుపురం, కొండప్రాంతం, ఆర్సీఎం చర్చి, సింహాచలం అపార్ట్‌మెంట్, మిధులనగర్, ఆర్‌పీ టవర్స్ అమ్మకళ్యాణ మండపం ఎదురు సున్నపుబట్టీల సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపా

23న ప్రోస్టేట్ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

పటమట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రూట్స్‌హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగార్జున హాస్పిటల్ సహకారంతో ప్రోస్టేట్ కేన్సర్ నిర్ధారణ, పెరుగుదల గుర్తించే వైద్యశిబిరం ఈ నెల 23న అశోక్‌నగర్‌లోని రూట్స్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు రూట్స్‌హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయభాస్కర్ తెలిపారు. ప్రోస్టేట్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, పరీక్షలు చేయించుకునే వారు 9849872499 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఈసెట్‌పై అవగాహన

లబ్బీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ నుంచి ఇంజనీరింగ్‌కు చేరటానికి నిర్వహించే ఈసెట్‌పై నగరంలోని సాయి మేధా కోచింగ్ సెంటర్‌లో సోమవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ మాట్లాడుతూ రెండు రోజులు అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

చిత్రలేఖనం విజేతలకు అభినందన

మొగల్రాజపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మనస్సులోని భావాలు చెప్పడానికి చిత్రలేఖనం మంచి మాధ్యమమని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా డ్రీం యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో స్వా కళాశాలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ, కన్సొలేషన్ బహుమతులు సాధించిన ఎస్. గోపి మనోజ్ (ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం)ద్వితీయ బహుమతి, సిహెచ్ యశ్వంత్(ఎంపీసీ), అర్జున్ సుతార్(సీఈసీ)లు కన్సొలేషన్ బహుమతులు సాధించిన సందర్భంగా కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు.

● శారద కళాశాల విద్యార్థిని ఫస్ట్

బాలల దినోత్సవం సందర్భంగా డ్రీం యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో స్వా కళాశాలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో శారదా కళాశాల జూనియర్ ఇంటర్ (బైపీసీ) విద్యార్థిని షేక్ జాస్మిన్‌కు చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన సందర్భంగా కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శారద కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదా దేవి, చైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు, అడ్వైజర్ ఈఎస్‌ఆర్‌కె ప్రసాద్, జీఎం జివి రావు, విద్యార్థులు బహుమతి సాధించిన విద్యార్థినిని అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

గుణదల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 26వ డివిజన్లోని అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం జరిగింది. రూ. 19.62లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి తెలిపారు. ఇప్పటికే ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేపట్టామని, అంతర్గత రోడ్లను కూడా ఒక్కొక్కటిగా నిర్మించేందుకు అంచనాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, ప్రధాన కార్యదర్శి కారంపూడి సత్య, కడియం ప్రకాష్, విజ్జి కాళిదాసు, మల్లిఖార్జున రావు, హరి, రాజు,సురేష్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాజేశ్వరి

దుర్గగుడిలో సహస్ర లింగార్చన

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్ర లింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్ర లింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. స్వామిని పుష్పాలు, బిల్వాలతో నయనమనోహరంగా అలంకరించారు.



దుర్గగుడి కళావేదిక పై శ్రీకృష్ణ రాయబారం నాటకం

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికపై క్రోసూరు మండలం హస్నాబాద్‌కు చెందిన శ్రీకాశీ నాగవిశ్వేశ్వర సాంస్కృతిక సేవా సంస్థ బృందం శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించింది. వీరి ఆధ్వర్యంలోనే కూచిపూడి నాట్య ప్రదర్శనలు కూడా జరిగాయి. డాక్టర్ చింతలపాటి శూలపాణి శిష్య బృందం ఈ పద్య నాటకాన్ని హృద్యంగా ప్రదర్శించారు. జొన్నలగడ్డ శ్రావణ్ సంగీతం అందించగా, బాపనపల్లి వెంకటస్వామి ఆహార్యం నిర్వహించారు. మల్లెల హిమబిందు, సుభద్రకుమారిలు దర్శకత్వం వహించారు. తిరుపతి వెంకట కవులు రాసిన పాండవోద్యోగ విజయాలలోని కృష్ణరాయబార ఘట్టాన్ని జనరంజకంగా ప్రదర్శించారు. ఈవో కె.ఎస్.రామరావు కళాకారులను అభినందించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ముఖ్య అర్చకుడు చెరువు ఆదినారాయణలు కళాకారులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు, ప్రసాదాలు అందజేశారు.



సైబర్ సెక్యూరిటీపై అవగాహన

పెనమలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఐఈఈఈ-సీఎస్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో రామవరప్పాడు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రూప మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫోన్ నంబరు, ఈ మెయిల్ పాస్‌వర్డ్ ఎలా జాగ్రత్త పరచుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం తాయారు, ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్ర పర్యవేక్షించారు.

సృజనాత్మకతకు ఫెస్ట్

● వేమూరి వీర పవన్‌కుమార్

మొగల్రాజపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చార్టెడ్ అకౌంటెన్సీ చదువుతున్న విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గడానికి, సృజనాత్మకత పెరగడానికి వైబ్రెన్స్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని సదరన్ ఇండియా చార్టెడ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ విజయవాడ చైర్మన్ వేమూరి వీర పవన్‌కుమార్ చెప్పారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలో ఒక ఫంక్షన్ హాలులో వైబ్రెన్స్ ఫెస్ట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీఏ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడానికి అవసరమైన శిక్షణా తరగతులను కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీకాసా విజయవాడ బ్రాంచ్ చైర్మన్ కె. నారాయణ, ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ కార్యదర్శి జయంత్ ఉప్పులూరి, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్స్ అక్కయ్య నాయుడు, దుర్గా శ్యాంసుందర్, టీవీ రమణ, నాగవల్లి, అమ్ములు, విజయభాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కాలనీ స్థలాల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ కాలనీ స్థలాల రిజిస్ట్రేషన్ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. నాల్గవ డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పాతూరి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరరావు, రెడ్డి బాబు, తదితరులు పాల్గొన్నారు.

లయోలా కళాశాలలో పుస్తక సమీక్ష

భారతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లయోలా కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో ప్రముఖ రచయిత జేమ్స్ క్లియర్ రచించిన అటామిక్ హ్యాబిట్స్ పుస్తకంపై సోమవారం సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ ఫాధర్ సగయ్య రాజు, వైస్ ప్రెసిండెంట్ ఫాదర్ ఎస్. రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జీఏ ప్రసాద్ రావు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, తెనాలికి చెందిన వెస్ట్ బెర్రి స్కూల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్ సినిమాను బతికించండి!

కొవిడ్‌తో పీఎన్‌బీఎస్‌లో మూతపడిన సినిమా థియేటర్లు ● ఆపన్నహస్తం అందించకపోవటంతో రెండేళ్లుగా మూత



పీఎన్‌బీఎస్‌లో వైస్క్రీన్స్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఆసియాలోనే రెండో అతిపెద్దదైన పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్)లో వినోదం నిలిచి చాలా కాలమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన థియేటర్ల కాన్సెప్ట్ అచిరకాలంలోనే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా చేసి పీఎన్‌బీఎస్‌ను ఓ వినోద కేంద్రంగా మార్చేసింది. ఈ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా బస్టేషన్లను వినోద కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించారు. తద్వారా కమర్షియల్ యాక్టివిటీ పెరుగుతుందని, ఎందరికో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు విస్తృతమౌతాయన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం ఈ వినూత్న ఆలోచన చేసింది. అప్పట్లో రెండు మినీ సినిమా థియేటర్ల ఏర్పాటుకు 'వై స్క్రీన్స్' అనే సంస్థ ముందుకొచ్చి ఏర్పాటు చేసింది. దీంతో ఇక్కడ సినిమా చూడటానికి ఆసక్తి చూపించారు. ప్రయాణీకులే కాకుండా బయట నుంచి కూడా పెద్ద సంఖ్యలో పీఎన్‌బీఎస్‌లోని మినీ థియేటర్లలో సినిమా చూడటానికి వచ్చేవారు. కృష్ణా పుష్కరాల సందర్భంలో అయితే ఈ థియేటర్లు ఓ వెలుగు వెలిగాయనే చెప్పవచ్చు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా కొంతకాలం మనగలిగాయి. కొవిడ్ రావటంతో సినిమా థియేటర్లను తెరవలేని పరిస్థితి నెలకొంది. దీంతో యజమానులు తీవ్ర నష్టాల పాలయ్యారు. తదనంతరం ఇవి సిక్ ఇండస్ట్రీ జాబితాలోకి చేరిపోయాయి. సరిగ్గా ఈసమయంలోనే వెంటిలేటర్ పైనున్న పరిశ్రమలకు ఆపన్నహస్తం అందించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదేమో? నిర్వహణ భారం, నష్టాలతో వై స్క్రీన్స్ సంస్థ కునారిల్లి మూతపడింది. రెండేళ్లుగా పీఎన్‌బీఎస్‌లో ఎలాంటి వినోదం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సిక్ ఇండస్ట్రీలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారి సమస్యలేమిటో తెలుసుకుని మరోమారు వారికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. నిబంధనల మేరకు నిర్వాహక సంస్థ లేచి నిలబడటానికి అండ గా ఉండటంతో పాటు, గతంలో సృష్టించిన ఈ కొత్త ఒరవడిని కొనసాగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బస్టేషన్‌లో బస్సుల కోసం ఎదురు చూపు లు చూసేవారికి ఈ థియేటర్లు వినోదాన్ని పంచేవి. పండుగల సందర్భంలో కళాశాలలకు అవుటింగ్ ఇచ్చినపుడు బస్టేషన్‌లోని క్లోక్ రూముల్లో సామగ్రిని పెట్టి నగరంలోకి వెళ్లి సినిమాలు చూసి తర్వాత ఇంటికి వెళ్లేవారు. పీఎన్‌బీఎస్‌లో థియేటర్ల ఏర్పాటు తర్వాత నగరంలోకి వెళ్లకుండానే ఎంచక్కా పీఎన్‌బీఎస్‌లోనే సినిమాలు చూసే అవకాశం కలిగింది. ఇతర ప్రాంతాల నుంచి అనేక పనుల మీద నగరానికి వచ్చిన వారు త్వరగా తమ పనులు పూర్తి చేసుకుంటే తాము బస్సెక్కటానికి 2, 3 గంటల సమయం ఉందనుకుంటే బస్టేషన్‌లోని థియేటర్లకు వెళ్లి టైమ్‌పాస్ చేసేవారు. విశ్రాంతి తీసుకుందామనుకుంటే డార్మిటరీలుంటాయి. తినాలంటే హోటల్స్ ఉన్నాయి. వినోదం పొందాలనుకుంటే థియేటర్లు ఉంటాయి. అన్నీ ఒకే గొడుగున ఉండటంతో ప్రయాణికులు బస్టేషన్‌లో ఎక్కువ సేపు గడిపేవారు. దీంతో కమర్షియల్ యాక్టివిటీ ఎక్కువగా జరిగేది. కమర్షియల్ యాక్టివిటీ పతాక స్థాయికి చేరుకోవటానికి ఈ థియేటర్లేనని చెప్పవచ్చు. పీఎన్‌బీఎస్‌ను మళ్లీ గతంలో మాదిరిగా ఎంటర్‌టైన్‌మెంట్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలంటే థియేటర్లను తెరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విజేతలతో కళాశాల డీన్ రాజేష్, పీడీ కృష్ణారెడ్డి

ఘనంగా అంతర్ వర్సిటీ యోగా చాంప్

విజయవాడ స్పోర్ట్స్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్‌సైన్స్ కళాశాల ఆతిథ్యంలో సోమవారం కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల, మహిళల యోగా చాంపియన్‌షిప్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ట్రెడిషనల్ యోగాలో జోత్స్నదేవి, మౌనిక, దీపిక వరుసగా స్వర్ణ, రజత, కాంస్యాలను సాధించారు. పురుషుల విభాగంలో వరుణ్ (నలంద), రాకేష్ (కేబీఎన్), గౌరీనాథ్ (కేబీఎన్) స్వర్ణ, రజత, కాంస్యాలను వశం చేసుకున్నారు. అనంతరం కృష్ణా వర్సిటీ టీమ్‌ను ఎంపిక చేశారు. పురుషుల్లో పీఎస్ రాజు, వరుణ్, రాకేష్, గౌరీనాథ్, శ ంకర్, ప్రవీణ్‌కుమార్, మహి ళా టీమ్‌కు జోత్స్నదేవి, మౌనిక, దీపిక, కృతి, సమీర, టెహరీన్ ఎంపికయ్యారు. కళాశాల డీన్ రాజేష్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీటీ కృష్ణారెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

జాతీయ బాస్కెట్‌బాల్‌కు అమల్‌రెడ్డి, నిరంజన్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం పాటియాలాలో ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ టీమ్‌కు బాలుర నుంచి అమల్‌రెడ్డి, నిరంజన్ రాయల్, బాలికల నుంచి షేక్ ఉమ్ఫహప్సా ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో ప్రతిభ చాటి ఎంపికయ్యారు. ఈ ముగ్గురు క్రీడాకారులు ఐజీఎంస్‌లోని శాప్ బాస్కెట్‌బాల్ కోచ్ సంతోష్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా కోచ్, క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ సోమవారం అభినందించారు.

జాతీయ బాస్కెట్‌బాల్‌కు అమల్‌రెడ్డి, నిరంజన్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం పాటియాలాలో ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ టీమ్‌కు బాలుర నుంచి అమల్‌రెడ్డి, నిరంజన్ రాయల్, బాలికల నుంచి షేక్ ఉమ్ఫహప్సా ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో ప్రతిభ చాటి ఎంపికయ్యారు.



ఈ ముగ్గురు క్రీడాకారులు ఐజీఎంస్‌లోని శాప్ బాస్కెట్‌బాల్ కోచ్ సంతోష్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా కోచ్, క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ సోమవారం అభినందించారు.

18 మంది మహిళల ఆచూకీ గుర్తింపు

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఇళ్ల నుంచి వెళ్లిపోయిన మహిళల ఆచూకీని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు గుర్తించారు. వారం వ్యవధిలో మొత్తం 18 మంది మహిళలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కమిషనరేట్ పరిధిలో మహిళలు, బాలికలు, అమ్మాయిల మిస్సింగ్ కేసులను ఛేదించడానికి అధికారులు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం వారం వ్యవధిలో 18 మంది ఆచూకీని గుర్తించింది. ఇన్‌స్పెక్టర్ పుల్లా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఒక టీం మిస్సింగ్ కేసుల దర్యాప్తులో నిమగ్నమైంది. మాచవరం, పటమట, గుణదల, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో ఈ పురోగతి సాధించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 121 మిస్సింగ్ కేసులుండగా వాటిలో 18 కేసులను పోలీసులు ఛేదించారు. మిగిలిన 103 కేసులను త్వరలో ఛేదిస్తామని పోలీసులు తెలిపారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

● 4 కేజీల గంజాయి స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కేజీఎఫ్ అపార్టుమెంట్ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది అపార్టుమెంట్ ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న తమ్మిన నాగ దుర్గారావు (23), కట్టా విజయేంద్రరాజు అలియాస్ పిత్తా (19)తో పాటు మరో ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

గుర్తించని, తీసుకువెళ్లని పార్శిళ్ల బహిరంగ వేలం

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ పార్శిల్ ఆఫీసులో చిరునామాదారులు తీసుకువెళ్లని లేదా గుర్తించని పార్శిళ్లను ఈనెల 22న బహిరంగ వేలం వేయనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్), సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల పాటదారులు పాల్గొనాలని కోరారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

● టీడీపీ, జనసేన నేతల ధర్నా



అక్రమ నిర్మాణాలపై గతంలో పత్రికల్లో వచ్చిన ప్రతులతో ధర్నా నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

రామలింగేశ్వరనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పడవల రేవు వద్ద కర్మల భవనం నిర్మిస్తానని తండ్రి హామీ ఇవ్వగా కుమార్తె మాత్రం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి షాపులు నిర్మించి అద్దెకివ్వడం అధికారాన్ని దుర్వినియోగం చేయడమేనని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ అన్నారు. సోమవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ పడవల రేవు బ్రిడ్జి వద్ద బందరు కాలువ పక్కన ప్రభుత్వం స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలు తొలగించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ ఆళ్ల చల్లారావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ చేసిన అక్రమాలు చాలా ఉన్నాయని అందుకు ఉదాహరణ వంతెన పక్కనే నిర్మించిన షాపులేనన్నారు. వాళ్ల అరాచకాలు టీడీపీ, జనసేన పార్టీలపై రుద్దాలని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా చూస్తున్నారని, వాళ్ల అక్రమాల కారణంగానే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లుగా ఉన్నా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు భారీ మెజారిటీ వచ్చిందన్నారు. ఇప్పటికైనా అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని లేకుంటే వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై కార్పొరేషన్ తన పని తానుచేసుకుని పోతుందని, డిడిజన్‌లో అన్ని అక్రమాలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం జనసేన డివిజన్ అధ్యక్షుడు గాదిరెడ్డి అమ్ములు మాట్లాడుతూ వంతెన వద్ద గతంలో 15 కుటుంబాలు నివాసం ఉండడంతో పాటు ఇక్కడ మహిళలు చిరువ్యాపారాలు చేసుకునే వారిని బెదిరించి అక్కడి నుంచి తొలగించి డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా షాపులు నిర్మించి అద్దెకిచ్చారన్నారు. వెంటనే వాటిని తొలగించి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం డివిజన్ వాసుల అవసరాల కోసం కర్మల భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ నిర్మాణు పై అప్పుడే ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదని కానీ ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వంలో అధికారులకు అన్ని హక్కులు ఇవ్వడంతో చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈశ్వర్, ఈశ్వరరావు, బహదూర్, రమేష్ ఇతర టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

భక్త కనకదాస కీర్తనలు

ప్రజా చైతన్యానికి సూచికలు

● ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



భక్త కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సంగీత సాహిత్యాలతో అనుసంధానం చేసి తత్వజ్ఞానాన్ని అందించేందుకు, తన కీర్తనలతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు, విశేష కృషి చేసిన కవి, సంగీతకారుడు, స్వరకర్త శ్రీ భక్త కనకదాస జీవితం ఆదర్శప్రాయమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కన్నడ కురుబ కుటుంబంలో జన్మించిన కనకదాస విద్య ద్వారా జ్ఞానాన్ని సముపార్జించి సమాజాన్ని అన్ని కోణాల్లో సూక్ష్మ పరిశీలన చేసి, అర్థం చేసుకొని వైవిధ్య రచనలు చేసి సమాజానికి దిశానిర్దేశం చేశారని, ఆయన మనకందించిన జ్ఞానాన్ని వారసత్వ సంపదను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నిధి మీనా అన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, జిల్లా ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ జి.ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి

శారదాపీఠ ఉత్తరాధికారి పూజలు



రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భారతి స్వామి

విజయవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ శృంగేరీ శారదా పీఠ ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతీ స్వామి సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శారదా సదనం, ధార్మిక భవనాలను ప్రారంభించారు. అనంతరం విద్యాభారతీ శ్రవణ సదనము ధర్మాధికారి దంపతులు కుందుర్తి మాధవి, శిష్టా శ్యామల, జొన్నవిత్తుల ప్రభాకరశాస్త్రి, గండూరి చంద్రమౌళీశ్వర సాంబమూర్తి పాల్గొన్నారు. మారుతీ వ్యాయామశాలను దర్శించి హనుమంతుడికి పూజలు నిర్వహించారు. తదుపరి కార్తీక సోమవారం పూజ నిర్వహించారు. భక్తులకు శ్రవణ సదనంలో దర్శనం ఇచ్చి, ఆశీర్వచనాలు అందించారు. సాయంత్రం చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు పూజలు చేశారు.

యనమలకుదురు శివాలయంలో..

శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం 3వ సోమవారాన్ని పురస్కరించుకొని ఉదయం శ్రీ విధుశేఖర భారతీ స్వామి మహాకుంభాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శివాలయంలో రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి హారతులు అందించారు. ట్రస్ట్ ఫౌండర్ సంగా నర్సింహారావును సత్కరించారు. కార్యనిర్వాహణాధికారిణి ఎన్.భవానీ పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు

సంయుక్త సమావేశాలు నిర్వహించాలి

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలో బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటానికి సంయుక్త సమావేశాలు నిర్వహించాలని ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కోరారు. సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ నాయకత్వంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆర్టీసీ హౌస్‌లో చైర్మన్‌ను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి, దుశ్శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయనకు విన్నవించారు. బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జాతీయస్థాయిలో నెలకు ఒకసారి ఆర్టీసీ హెడాఫీసులో సమావేశాలు నిర్వహించేవారని, గత ప్రభుత్వం ఈ సమావేశాలు నిర్వహించలేదని, ఇప్పుడు మళ్లీ పునరుద్ధరించాలని, బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటపతి, నేతలు కె.లక్ష్మణుడు, పి.సూరిబాబు, వి.జానకిరామ్, వి.వెంకటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

యథావిధిగా విజయవాడ - గూడూరు రైలు

రైల్వేస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 12744 విజయవాడ - గూడూరు, 07500 విజయవాడ - గూడూరు రైళ్లను మంగళవారం నుంచి యథావిధిగా నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను పెదవడ్లపూడి - దుగ్గిరాల స్టేషన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్ అయిన కారణంగా దారి మళ్లించారు. ఇక సాధారణ మార్గంలోనే ఈ రైళ్లు నడుస్తాయని ప్రకటనలో తెలిపారు.



దుర్గా బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

డిపాజిటర్ల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలి

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఇటీవల రిజర్వ్ బ్యాంకు ఆంక్షలు విధించిన దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును సోమవారం ఆయన సందర్శించారు. డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సీఈవో బంకా శ్రీనివాస్‌తో కలిసి చర్చించారు. బ్యాంకులోని అవకతవకలు గురించి, డిపాజిటర్లతో, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి బ్యాంకు ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇవ్వాలని ఖాతాదారులు ఎమ్మెల్యే సుజనాకు విన్నవించుకున్నారు. డిపాజిటర్లకు చెల్లించాల్సిన నగదు, డిపాజిటర్ల లిస్టు, ఆస్తులు, అప్పులు, తదితర అంశాలపై సమీక్షించి సమాచారాన్ని సేకరించారు. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్‌తో మాట్లాడి డిపాజిటర్లకు ఇన్సూరెన్స్ అమౌంట్ అందేవిధంగా ఎమ్మెల్యే సుజనా ప్రయత్నం చేస్తానన్నారు. సుజనా వెంట ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ మీట్‌కు కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏడాది స్పోర్ట్స్ మీట్ నిర్వహించేలా కార్యాచరణ చేయనున్నట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల, కాలేజీల ఫిజికల్ సంచాలకులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సోమవారం కేబీఎన్ కళాశాలలో డీఈవో యూవీ సుబ్బారావు సహకారంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది క్రిస్మస్, సంక్రాంతి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిసెంబర్ 17 నుంచి 2025 జనవరి 15 వరకు స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహించాలనుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి క్రీడలు నిర్వహించాలనేదానిపై సూచనలు, సలహాలు తీసుకున్నారు. క్రీడా వసతులు లేని పాఠశాలల వివరాలను ఆయన సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో క్రీడా వసతులు కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తేవాలని సంకల్పించామన్నారు. 2027లో అమరావతి ప్రాంతానికి జాతీయ క్రీడలను తెచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఈ క్రమంలోనే అమరావతిలో స్పోర్ట్స్ సిటీని ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. స్పోర్ట్స్ వర్సిటీ కూడా రాబోతుందన్నారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచి ప్రోత్సహించాలన్నారు. డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ శివనాథ్‌కు అన్ని విధాలుగా తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఓఎస్‌డీ వెంకట రత్నం, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ టి.శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలన అధికారి వి.నారాయణ రావు, మాజీ శాప్ చైర్మన్ అంకమ్మ చౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్‌జీటీ సెక్రటరీ ఎస్.శ్రీనివాస్, నందిగామ నియోజకవర్గ ఎస్‌జీటీ కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాల సేకరణ ధరలు పెంపు

(5వ పేజీ తరువాయి)

పాలఉత్పత్తి ఆగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పాలక మండలి సమష్టి కృషితో ఈ ఫలితాలు చూస్తున్నామన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

కొంతమంది కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలో ఆదర్శవంతమైన డెయిరీ అని చెప్పారు. తమతో పోటీ పడలేక అమూల్ వంటి సంస్థలు వెనుకబడిపోయాయన్నారు. సంపాదనలో మూడు సార్లు రేటు, బోనస్ ఇచ్చేది కృష్ణా మిల్క్ యూనియన్ మాత్రమేనన్నారు. ఇప్పటికే రైతులకు బోనస్‌తో కలిపి లీటరుకు సుమారు రూ.91లు ఇస్తున్నామన్నారు. ఈ ధరను మరింతగా పెంచుతామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకట రమణ, చలసాని చక్రపాణి, ఆర్తి వెంకట నగేష్, పలగాని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు తీస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

హీల్ (హోలో గ్రామ్)ను తీసేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చిక్కినప్పుడు గుట్టు బయటకు రాకుండా ఉండేందుకు ఈవిధంగా చేస్తున్నారు. ఈ హీల్‌పై బార్ కోడ్ ఉంటుంది. దీన్ని స్కాన్ చేయగానే ఆ సీసాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి. ఏ డిస్టలరీలో తయారైంది, దాని బ్యాచ్ నెంబరు ఎంత, అక్కడి నుంచి ఏ మద్యం దుకాణానికి ఈ సీసా వెళ్లింది.. అనే విషయాలు బయటపడతాయి. ఈ కారణంగా హీల్స్‌ను తొలగిస్తున్నారు. బెల్టుషాపులు నిర్వహించే వారికి మద్యం షాపుల యజమానులే ఈ సలహాలు ఇస్తున్నారు.

ఆపరేషన్ బుడమేరు ఏమైంది?

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులైతే పక్కా నిర్మాణాలు చేపట్టారు. పాతరాజరాజేశ్వరిపేట వైపునకు వెళ్లే బుడమేరు కట్టను ఇటీవల కొందరు వ్యాపారులు 1,000 నుంచి 1,500 గజాల మేర ఆక్రమించుకుని రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ చిత్తుకాగితాలు, ఇంకా పలు రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవటంపై విమర్శలు వస్తున్నాయి. పాతరాజరాజేశ్వరి పేట వైపునకు వెళ్లే మార్గం ఆక్రమణకు గురికావటం వల్లే బుడమేరు నీరు దారి మళ్లి అయోధ్యనగర్‌ను వరద ముంచెత్తింది. వరద అనంతరం వివిధ శాఖల అధికారులు కొద్దిమేర ఆక్రమణలు తొలగించినా, మళ్లీ షరామామూలే.



డ్రోన్ ఆపరేషన్ గురించి వివరిస్తున్న సీపీ

మహిళా పోలీసులకు డ్రోన్ శిక్షణ

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు డ్రోన్ ఆపరేషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఎంజీ రోడ్డులో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ శిక్షణ సదస్సును సీపీ రాజశేఖరబాబు సోమవారం ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ హనీష్‌బాబు పాల్గొన్నారు.

పీఎఫ్, అధిక పెన్షన్ల సమస్యలు పరిష్కరించాలి

● రవాణా శాఖ కమిషనర్‌కు ప్రజా రవాణా సంస్థ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ లేఖ

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులకు సంబంధించి పీఎఫ్, హయ్యర్ పెన్షన్ అమలులో వస్తున్న అనేక సమస్యలను పరిష్కరించాలని రవాణా శాఖ కమిషనర్‌కు సోమవారం ప్రజా రవాణా సంస్థ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ లేఖ రాసింది. గౌరవాధ్యక్షుడు ఎస్.కె.జిలానీ బాషా, ప్రచార కార్యదర్శి టి.పి.ఆర్ దొరలు సంతకం చేసిన లేఖలో ఏపీ, తెలంగాణ ఆర్టీసీలో 8,934 మంది వద్ద హయ్యర్ పెన్షన్ కోసం 1996-2014 మధ్యకాలంలో వసూలు చేసిన డబ్బుల్లో సాధారణ చెల్లింపులు పోను, మిగతా డబ్బులు వారి వ్యక్తిగత ఖాతాలకు వడ్డీతో సహా చెల్లించాలని, అనేక సార్లు విజ్ఞప్తి చేశామన్నారు. కానీ అధికారులు ఆర్‌పీఎఫ్‌సీ ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్టు లేదన్నారు. 2021లో కొందరి పేరుతో ఒక లేఖ, తరువాత మరో లేఖ ద్వారా కార్మికుడు ఆర్‌పీఎఫ్‌సీకి పంపారని, అది కేవలం లేఖ మాత్రంగా రికార్డుల్లో ఉందన్నారు. 8,934 మందికి సంబంధించి అధిక పెన్షన్ చెల్లింపులు గురించి ఎలాంటి సమాచారం లేక ఇప్పటికీ జరుగుతున్న అన్యాయం, నష్టం తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యలపై తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అక్కడి యాజమాన్యంతో సంప్రదించిందని, ఏపీఎస్ఆర్టీసీ కూడా ఉద్యోగుల నుంచి అదనంగా వసూలు చేసిన కోట్లాది రూపాయలను రికవరీ చేసి ఉద్యోగులకు ఇప్పించాలని కోరారు. ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-1కు లేఖలు రాసి అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విష్ణుకుమార్ రాజుకు సత్కారం



విష్ణుకుమార్ రాజును సత్కరిస్తున్న నేతలు

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా రవాణ మంత్రిని కోరిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును ప్రజా రవాణ సంస్థ ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ విజయవాడ జోన్ కమిటీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యుడు అనంతరాములు, విజయవాడ జోనల్ కార్యదర్శి అడపా రామారావు పాల్గొన్నారు.

బిజినెస్

వస్తున్నాయ్..
ఆర్‌బీఐ డేటా సెంటర్లు



» తక్కువ ధరలకే చిన్న సంస్థలకు క్లౌడ్ సేవలు
» హైదరాబాద్‌లో ఒకటి, ముంబైలో మరోటి

ముంబై: ఆర్థిక సేవల రంగంలోని చిన్న కంపెనీలకు అందుబాటు ధరల్లో క్లౌడ్ డేటా స్టోరేజీ వసతి కల్పించడం లక్ష్యంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) దేశంలో లోకల్ క్లౌడ్ డేటా స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేసే యోచనలో ఉంది. వీటిలో ఒకటి హైదరాబాద్‌లోను, మరొకటి ముంబైలోను ఏర్పాటు కావచ్చని తెలుస్తోంది. 2025లో ప్రయోగాత్మకంగా ఆర్‌బీఐ ఈ కార్యక్రమం చేపట్టనుంది. ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు ఈ వివరాలు వెల్లడించినట్లు రాయిటర్స్ కథనం పేర్కొంది. అయితే ఇది అత్యంత రహస్య సమాచారం కావడం వల్ల తమ పేర్లు వెల్లడించేందుకు వారు నిరాకరించారని కథనం తెలిపింది. ఇందుకోసం ఆర్‌బీఐ స్థానిక ఐటీ కంపెనీల సేవలు ఉపయోగించుకోనుంది. ఈ డేటా సెంటర్లను అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూరే, గూగుల్ క్లౌడ్, ఐబీఎం క్లౌడ్‌కు పోటీగా నిలుపుతారు. ఆసియాలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో క్లౌడ్ సర్వీసుల మార్కెట్ పరిమాణం 2023లో 830 కోట్ల డాలర్లుండగా (రూ.70,550 కోట్లు) 2028 నాటికి 2420 కోట్ల డాలర్లకు (రూ.2.06 లక్షల కోట్లు) చేరుతుందని ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ అంచనా. అయితే ఈ మార్కెట్లో విదేశీ సంస్థలే ఇప్పటి వరకు ఆధిపత్యం చలాయిస్తున్నాయి.

డేటా స్థానికీకరణే లక్ష్యం

చెల్లింపులు, ఆర్థిక డేటాను స్థానికీకరించాలన్న ఆర్‌బీఐ కృషిలో దీన్ని తొలి అడుగుగా భావించవచ్చు. క్లౌడ్ సంబంధిత సొల్యూషన్లు అందించడంలో అనుభవం గల దేశీయ కంపెనీలను మాత్రమే బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు అనుమతించారు. కంపెనీలు వ్యక్తిగతంగా గాని, కన్సార్షియంగా గాని దీనికి బిడ్ చేయవచ్చు. ఈ ప్రాజెక్టును చేపట్టడానికి దేశంలో క్లౌడ్ సేవల రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు కంపెనీలు ఆసక్తిని ప్రకటిస్తున్నాయంటున్నారు.

తొలుత స్వల్ప స్థాయిలో

రాబోయే కొద్ది నెలల్లో ఈ ప్రాజెక్టును స్వల్ప స్థాయిలో ప్రారంభించి తదుపరి దశలో దేశవ్యాప్తంగా విస్తరించాలన్నది తమ ప్రయత్నమని ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్న సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్లౌడ్ డేటా సర్వీసులు భరించగల స్థితి తమకు లేదని భావించే బ్యాంకింగ్, ఆర్థిక సేవా రంగ సంస్థలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టు చేపట్టినట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌గా ఎర్నెస్ట్ అండ్ యంగ్‌ను (ఈవై) నియమించారు. తొలి దశలో ఈ వ్యవహారాలను ఆర్‌బీఐకి చెందిన పరిశోధన విభాగం ఇండియన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సర్వీసెస్ నిర్వహిస్తుంది. తదుపరి దశలో ప్రైవేటు రంగంలోని టెక్నాలజీ కంపెనీల భాగస్వామ్యంతో చేపడతారని ఆ వర్గాలు తెలిపాయి. అలాగే ప్రారంభ దశలో ప్రాజెక్టుకు కావలసిన పెట్టుబడిని ఆర్‌బీఐ వద్ద ఉన్న రూ.22,974 కోట్ల అసెట్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి సమకూర్చుతారు. తదుపరి దశలో ఇందులో ఈక్విటీ భాగస్వామ్యం తీసుకోవాలని ఆర్థిక సంస్థలను కేంద్ర బ్యాంక్ ఆహ్వానించనుంది.

'బీమా'లోకి 100% ఎఫ్‌డీఐ?

» అనుమతించే యోచనలో కేంద్ర ప్రభుత్వం
» శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టే చాన్స్

న్యూఢిల్లీ: దేశీయ బీమా సేవల రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుతమున్న 74 శాతం నుంచి 100 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే, బీమా ఏజెంట్లపై ఆంక్షలనూ సడలించే యోచనలో ఉంది. ఇందుకోసం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనుందని ఓ ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచితే గనుక, విదేశీ సంస్థలు భారత మార్కెట్లోకి నేరుగా ప్రవేశించడంతో పాటు దేశీయ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవాల్సిన అవసరం లేకుండా స్వతంత్రంగానే కార్యకలాపాలు కొనసాగించవచ్చు. అంతర్జాతీయ బీమా దిగ్గజాలను ఆకర్షించడంతోపాటు దేశీయ మార్కెట్లో పోటీని, పెట్టుబడులను పెంచేందుకు ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే బీమా ఏజెంట్లు ఇకపై ఎన్ని కంపెనీలకు చెందిన పాలసీలనైనా విక్రయించే వెసులుబాటు కల్పించే అవకాశం ఉంది.

అధిక వడ్డీ రేట్లు వృద్ధికి ఆటంకం

ఎస్‌బీఐ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మల వ్యాఖ్య



ముంబై: దేశంలో వడ్డీ రేట్లు "చాలా అధికంగా" ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారని, బ్యాంకులు వడ్డీ రేట్లను ప్రజలు భరించగల స్థాయికి తగ్గించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రతి ఏటా నిర్వహించే వాణిజ్య, ఆర్థిక సదస్సులో ఆమె మాట్లాడుతూ.. దేశానికి పరిశ్రమల ఏర్పాటు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. పరిశ్రమలు సామర్థ్యాలు పెంచుకుని, కొత్త యూనిట్లపై ఇన్వెస్ట్ చేయాలంటే వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలో ఉండాలని ఆమె అన్నారు. వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పుడే "వికసిత్ భారత్" సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే బ్యాంకులు తమపై గల రుణవితరణ బాధ్యతకే కట్టుబడాలని సీతారామన్ సూచించారు. ప్రజలను మభ్యపెట్టి బీమా పాలసీలను విక్రయించడం కూడా పరోక్షంగా నిధుల సమీకరణ భారాన్ని పెంచుతుందని ఆమె వ్యాఖ్యానించారు. పారదర్శకతను పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని బ్యాంకులకు సూచించారు.

ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనివ్వండి

చిన్న వ్యాపారాలకు రుణాలు ఇవ్వడం కూడా బ్యాంకుల ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ ఎంఎస్ఎంఈలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.6.12 లక్షల కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.7 లక్షల కోట్లు రుణ లక్ష్యాన్ని ఆమె నిర్దేశించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.5.75 లక్షల కోట్ల లక్ష్యాన్ని కూడా సాధించాలని ఆమె సూచించారు. బీమా కవరేజీని కల్పిస్తూ ప్రజల పొదుపును పెట్టుబడుల్లోకి ఆకర్షించాలని, తద్వారా దాన్ని రిస్క్ మూలధనంగా మార్చడంపై కూడా దృష్టి సారించాలన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం ప్రత్యేకించి ఆహార వస్తువుల ధరలు ఆందోళనకరమైన స్థాయిలో ఉంటున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గత 10 విడతలుగా ఆర్‌బీఐ రెపో రేట్లపై యథాతథ స్థితిని కొనసాగిస్తోంది. తాజాగా అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ స్థాయి (6 శాతం) కూడా దాటిపోయి 6.2 శాతంగా నమోదైన నేపథ్యంలో డిసెంబరు సమావేశంలో కూడా రెపో రేటు యథాతథంగానే కొనసాగించే అవకాశం కనిపిస్తోంది.

ఈ ఏడాది చివరికి మరో 500 శాఖలు

ఎస్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కొత్తగా 500 శాఖలను ప్రారంభించనున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. కొత్త బ్రాంచీల ఏర్పాటు పూర్తయితే మొత్తం ఎస్‌బీఐ శాఖల సంఖ్య 23,000కి చేరుతుంది. ఎస్‌బీఐ ముంబై మెయిన్ బ్రాంచీ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 1921లో బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి అది దశదిశలుగా విస్తరించిందన్నారు. 1921లో 250 బ్రాంచీలున్న ఎస్‌బీఐ ఇప్పుడు 22,500 శాఖలకు చేరిందని చెప్పారు. 50 కోట్లకు పైబడిన కస్టమర్లతో ఎస్‌బీఐ బ్యాంకింగ్ రంగంలోని డిపాజిట్లలో 22.4 శాతం, రుణ బట్వాడాలో ఐదో వంతు వాటాతో అగ్రగామిగా ఉందని ఆమె తెలిపారు.

ఐటీ, ఆయిల్ షేర్లలో అమ్మకాలు

» సెన్సెక్స్ 241 పాయింట్లు డౌన్ .. ఏడో రోజూ నష్టపోయిన నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నష్టాలు కొనసాగాయి. సోమవారం సెన్సెక్స్ మరో 241.30 పాయింట్లు కోల్పోయి 77,339.01 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది నాలుగో రోజు. నిఫ్టీ వరుసగా ఏడో రోజు నష్టపోయింది. సోమవారం నాటి సెషన్‌లో 78.90 పాయింట్లు క్షీణించి 23,453.80 వద్ద ముగిసింది. అమెరికా మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఐటీ, ఆయిల్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోగా.. టీసీఎస్ 3.05 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఇన్ఫోసిస్ 2.82 శాతం పతనమైంది.

ఏషియా ఇండెక్స్ నుంచి 'బీఎస్ఈ సెలెక్ట్ ఐపీఓ' సూచీ

బీఎస్ఈ అనుబంధ విభాగమైన ఏషియా ఇండెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం 'బీఎస్ఈ సెలెక్ట్ ఐపీఓ' ఇండెక్స్‌ను ప్రారంభించింది. ఐపీఓ లేదా వ్యాపార విభజన/డీమెర్జర్ ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్టయిన కంపెనీల పనితీరును ఈ ఇండెక్స్ మదింపు చేయనుంది. కంపెనీ పూర్తి మార్కెట్ క్యాపిటలైజేషన్, లిక్విడిటీ, కనీసం 3 నెలల లిస్టింగ్ చరిత్ర వంటి అంశాల ఆధారంగా కంపెనీలను ఇండెక్స్‌లో చేర్చనున్నారు.

మెడ్‌ప్లస్‌లో 6.6 శాతం వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌లో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ మొత్తం 6.6 శాతం వాటాను రూ.552 కోట్లకు విక్రయించాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త అజీమ్ ప్రేమ్‌జీకి చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్.. మెడ్‌ప్లస్‌లో తనకున్న 5.77 శాతం వాటాను పూర్తిగా ఉపసంహరించుకుంది. కాగా, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ 0.84 శాతం వాటా విక్రయించింది. దాంతో మెడ్‌ప్లస్‌లో ఈ ఫండ్ వాటా 4.88 శాతం నుంచి 4.04 శాతానికి తగ్గింది.

అంతర్గత నిర్వహణ బలోపేతం చేయండి

» బ్యాంకు బోర్డులకు ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సూచన

ముంబై: బ్యాంకుల అంతర్గత నిర్వహణ వ్యవస్థ బలోపేతం చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ బ్యాంకు బోర్డులకు సూచించారు. ప్రధానంగా ఏయే రంగాలపై అవసరాన్ని మించి దృష్టి పెడుతున్నారో గుర్తించి తద్వారా ఎదురవుతున్న రిస్కులు, సవాళ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పిలుపు ఇచ్చారు. నానాటికీ బ్యాంకింగ్ ముఖచిత్రం మారిపోతున్న వాతావరణంలో డైరెక్టర్ల బోర్డులు ఒక దిక్సూచి వలె వ్యవహరించాలని, బ్యాంకులకు స్థిరమైన మార్గదర్శకం అందించాలని సూచించారు. ప్రైవేటు రంగ బ్యాంకుల డైరెక్టర్ల సదస్సులో ఆయన కీలకోపన్యాసం ఇస్తూ ప్రజలను మభ్యపెట్టి బీమా ఉత్పత్తులు విక్రయించడం, సరైన కేవైసీ లేకుండానే ఖాతాలు తెరవడం వంటి అనైతిక చర్యలకు స్వస్తి పలకాలని సూచించారు.

ఐస్ మేక్ ఆదాయం 101 కోట్లు

ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్అలోన్ ప్రాతిపదికన రూ.101.38 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.4.89 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.76.89 కోట్ల ఆదాయంపై రూ.4.59 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. సెప్టెంబరు త్రైమాసికంలో కార్యకలాపాల విస్తరణ, డిమాండ్‌కు తగ్గట్టుగా వివిధ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావటంతో కంపెనీ మంచి పనితీరును కనబరిచిందని సంస్థ సీఎండీ చంద్రకాంత్ పాటిల్ తెలిపారు.

అపోలో రేడియాలజీ చేతికి ఇన్‌హెల్త్ రేడియాలజీ విభాగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్‌కు చెందిన అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ (ఏఆర్ఐ).. యూకేలోని ఇన్‌హెల్త్ గ్రూప్ రేడియాలజీ రిపోర్టింగ్ విభాగాన్ని చేజిక్కించుకుంది. యూకేతో పాటు ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన డయోగ్నోస్టిక్ సేవలను విస్తరించటంతో పాటు రేడియాలజిస్టుల కొరతను తీర్చేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని ఏఆర్ఐ తెలిపింది. అంతేకాకుండా ఏటా 20 లక్షల స్కాన్స్, 24 దేశాల్లో సేవలు సహా 200కు పైగా హెల్త్‌కేర్ సంస్థలకు సేవలందించే అవకాశం లభిస్తుందని భావిస్తోంది.

2030 నాటికి భారత జీసీసీ పరిశ్రమ రూ.8.5 లక్షల కోట్లకు..

» 25 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: భారత గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) పరిశ్రమ.. 2030 నాటికి రూ.8.5 లక్షల కోట్లకు (10,000 కోట్ల డాలర్లు) చేరే అవకాశం ఉందని ఇండియా జీసీసీ ల్యాండ్‌స్కేప్ పేరుతో రూపొందించిన నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా ఈ పరిశ్రమ దాదాపు 25 లక్షల మంది నిపుణులకు ఉద్యోగాలు కల్పించనుందని పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో 1,700కు పైగా జీసీసీలు ఉండగా వీటి వార్షికాదాయం 6,460 కోట్ల డాలర్లు (రూ.5.45 లక్షల కోట్లు)గా ఉంది. కాగా 19 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ సెంటర్లు భారత్‌లో సాంప్రదాయ సేవలతో పోలిస్తే కీలకమైన ట్రాన్స్‌ఫార్మేషన్ హబ్స్‌గా మారాయని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా 2026 నాటికి ఈ సెంటర్లలో 70% వరకు అడ్వాన్స్‌డ్ కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాలతో పనిచేస్తాయని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే భారత్‌లో జీసీసీల నిర్వహణ వ్యయాలు 40% తక్కువగా ఉండటంతో బహుళ జాతి సంస్థలను విశేషంగా ఆకర్షిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,310 ▲	69,950 ▲	99,000 ▲
ముంబై	74,808 ▲	68,524 ▲	89,289 ▲


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	575
వరంగల్	552	గోదావరి	565
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	95	విజయవాడ	111
వరంగల్	95	గుంటూరు	108
కరీంనగర్	95	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	102
కర్నూలు	95	నెల్లూరు	102
విశాఖపట్నం	103	అనంతపురం	102
గోదావరి	111		

నవ్య | చిత్రజ్యోతి



బుజ్జి తల్లి ప్రేమగీతం

ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలోని డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తండేల్'. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమాకు చందు మొండేటి దర్శకుడు. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి'ని ఈ నెల 21న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ పోస్టర్‌లో నాగచైతన్య రగ్గడ్ లుక్‌తో కనిపించగా, హాఫ్ శారీలో అందంగా ఉన్నారు సాయిపల్లవి. లవ్, యాక్షన్, డ్రామా కలిగిన 'తండేల్' చిత్రాన్ని బన్నీ వాసు నిర్మిస్తున్నారు.

అన్నపూర్ణ స్టూడియోలో వివాహం



నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహం డిసెంబర్ 4న అన్నపూర్ణ స్టూడియోస్ వేదికగా జరుగనుంది. ఆ రోజు రాత్రి 8.13 నిముషాలకు వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటి కానున్నారు. ఇటీవల శోభిత కుటుంబం నుంచి ఇస్తున్న వెడ్డింగ్ కార్డ్ వైరల్ కాగా, తాజాగా అక్కినేని కుటుంబం పంచుతున్న వెడ్డింగ్ కార్డు కూడా అందరినీ ఆకట్టుకుంటోంది.

వీర వనిత



ప్రస్తుత తరంలో ఏ హీరోయిన్‌కూ సాధ్యంకాని అపారమైన ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న నయనతార నటిస్తున్న నూతన చిత్రం 'రక్కయీ'. సోమవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. సెంథిల్ నల్లస్వామి దర్శకత్వంలో వేదిక్కరన్ పట్టి ఎస్.శక్తివేల్, ఆదిత్య పిట్టీ నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో ఆమె వీర వనితగా కనిపించనున్నారు. టీజర్‌లో కూతురు కోసం ఎంతకైనా తెగించి పోరాడే శక్తిమంతమైన తల్లి పాత్రలో ఆమె కనిపించి సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. నయనతార ఇందులో శత్రుమూకలతో చేసిన భీకర పోరాట దృశ్యాన్ని చూసి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయిపోయారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ ఆంటోని, డీఓపీ: గౌతమ్ రాజేంద్రన్, సంగీతం: గోవింద్ వసంత. కాగా, నయనతార జీవితకథ ఆధారంగా అమిత్‌కృష్ణన్ తెరకెక్కించిన 'నయనతార: బియాండ్ ఏ ఫేరీ టేల్' డాక్యుమెంటరీ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఆమె మంచువిష్ణు హీరోగా ముకేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'కన్నప్ప'.. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ నటిస్తున్న 'టాక్సిక్'.. చిత్రాలతో ప్రేక్షకులను పలకరించనున్నారు. అలాగే, సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో షారుక్‌ఖాన్ నటించనున్న 'కింగ్' చిత్రంలోనూ కథానాయికగా ఎంపికయ్యారని టాక్.

సత్యభామగా గుర్తుండిపోతా



'మిస్ ఇండియా' టైటిల్ విజేత మానస వారణాసి హీరోయిన్‌గా తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. 'హీరో' ఫేమ్ అశోక్ గల్లా కథానాయకుడు. ప్రశాంత్ వర్మ కథ అందించగా.. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ నెల 22న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి మీడియాతో ముచ్చటించారు. "దేవకి నందన వాసుదేవ' లాంటి డివైన్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర పేరు 'సత్యభామ'. ఎలాంటి కష్టం వచ్చినా ధైర్యంతో ముందుకు సాగే పాత్ర ఇది. తొలి సినిమాలోనే ఇంత మంచి ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కడం నా అదృష్టం. 'సత్యభామ' క్యారెక్టర్ అందరికీ గుర్తుండిపోతుంది. మొదటి సినిమా కావడంతో ఎన్నో సవాళ్లు ఎదురైనా.. చిత్ర బృందం అందించిన ప్రోత్సాహంతో వాటిని సులువుగా అధిగమించాను. దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తయారు చేశారు. ఆయన సినిమా తీసిన విధానం కచ్చితంగా అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అశోక్ గల్లాతో పనిచేయడం మరిచిపోలేని అనుభవం. భీమ్స్ ఇచ్చిన సంగీతం సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది" అని చెప్పారు.

హరుడు ఫస్ట్‌లుక్



శ్రీహరి, హెబ్బా పటేల్, వెంకట్ లీడ్ రోల్స్‌లో రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'హరుడు'. డాక్టర్ లక్ష్మణరావు డిక్కల, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ను డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో శ్రీహరి ఇంటెన్స్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ' మా ఫస్ట్ పోస్టర్, టీజర్ ఆర్జీవి చేతుల మీదుగా రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. ప్రొడ్యూసర్ లక్ష్మణరావు ఈ సినిమాని ప్యాషనేట్‌గా నిర్మించారు. అవుట్‌పుట్ బాగా వచ్చింది. అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత లక్ష్మణరావు మాట్లాడుతూ 'సినీ పరిశ్రమలోకి శ్రీహరి ప్రోద్బలంతో అడుగుపెట్టాం. మా బేనర్ విజయవంతంగా సాగాలని ఆశిస్తున్నా' అని అన్నారు.

బెంగాలీ నటి ఉమాదాస్ గుప్తా మృతి



ప్రముఖ బెంగాలీ నటి ఉమాదాస్ గుప్తా(85) సోమవారం ఉదయం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇటీవల ఆస్పత్రిలో చేరారు. 1955లో సత్యజిత్ రే దర్శకత్వం వహించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'పథేర్ పాంచాలి'లో ఉమాదాస్ గుప్తా నటించారు. బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ్ రాసిన 'పథేర్ పాంచాలి' నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. చిన్ననాటి నుంచే ఉమాదాస్ గుప్తా నాటక ప్రదర్శనలపై ఆసక్తి చూపేవారు. స్కూల్లో ప్రదర్శించిన ఒక నాటకంలో ఉమాదాస్ గుప్తా నటనను చూసిన సత్యజిత్ రే.. 'పథేర్ పాంచాలి'లో దుర్గ పాత్రకు ఆమెను ఎంపిక చేశారు. ఈ చిత్రం తర్వాత ఆమె నటిగా కొనసాగకుండా ఉపాధ్యాయ వృత్తికే అంకితమయ్యారు.

దేశ భక్తిని పెంచే చిత్రం



దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ తెరకెక్కించిన చిత్రం 'అభినవ్'. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాను. విదేశాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచే దేశ రక్షణ విషయంలో అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తుంటారు. అలా మన పిల్లలను కూడా తీర్చిదిద్దాలి' అని అన్నారు.

కడప దర్గాను సందర్శించిన రామ్‌చరణ్



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్ ఆహ్వానం మేరకు నటుడు రామ్ చరణ్ కడపలోని దర్గాను సోమవారం సందర్శించారు. ఆల్ ఇండియా 80వ ఉర్దూ కవి సమ్మేళనాన్ని రామ్‌చరణ్ ప్రారంభించారు. అయితే దీనికంటే ముందు డైరెక్టర్ బుచ్చిబాబు సానాతో కలిసి రామ్ చరణ్ కడపలోని విజయ దుర్గా దేవీ ఆలయాన్ని సందర్శించారు. తన తదుపరి సినిమా 'ఆర్‌సి16' స్క్రిప్ట్‌ని అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేయించారు. అనంతరం దర్గాకు చేరుకున్న రామ్‌చరణ్ మాట్లాడుతూ '12ఏళ్ల క్రితం మగధీర సినిమా రిలీజ్‌కు ముందు దర్గాను సందర్శించాను. అయ్యప్పమాల వేసుకుని దర్గాకు రావడం చాలా సంతోషంగా ఉంది' అన్నారు.

కుందాపూర్‌లో కదంబ సామ్రాజ్యం



భారీ నిర్మాణ విలువలతో ప్రేక్షకులు మెచ్చే సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన హోంబలే ఫిల్మ్స్ సంస్థ ఇప్పుడు కాంతార చాప్టర్ వన్‌ని అందించనుంది. దాదాపు రెండేళ్ల క్రితం విడుదలై దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించిన కన్నడ చిత్రం 'కాంతార'కు ప్రీక్వెల్‌గా 'కాంతారా చాప్టర్ వన్'ని రూపొందిస్తున్నారు. రిషబ్ శెట్టి నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కోసం కుందాపూర్‌లో చారిత్రక కదంబ సామ్రాజ్యాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మళ్లీ సృష్టించింది. ఇక హీరో రిషబ్ శెట్టి కేరళ పురాతన యుద్ధ విద్యల్లో ఒకటైన కలరిపయట్టులో శిక్షణ పొంది, సినిమా కోసం సిద్ధమయ్యారు. 'కాంతార చాప్టర్ వన్' కొంకణ్ జానపద గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుంది. గ్రిప్పింగ్ కథనం, అద్భుతమైన విజువల్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి' అని నిర్మాణ సంస్థ వెల్లడించింది. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ 2న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.

ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు..



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రం 'ఎమర్జెన్సీ'. ఇందులో ఇందిరాగాంధీ పాత్రను కంగన పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. భారతదేశంలో చీకటి రోజులుగా పిలిచే ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల్ని ఈ సినిమాలో చూపించారు. 'ఎమర్జెన్సీ' సినిమా ప్రారంభించినప్పటి నుంచి కంగనాకు చిక్కులు మొదలయ్యాయి. చంపేస్తామని హెచ్చరికలూ వచ్చాయి. అన్నీ తట్టుకుని సినిమా పూర్తి చేసి, సెన్సారుకు వెళితే, అక్కడ కూడా అభ్యంతరాలు వెల్లడయ్యాయి. చివరకు సెన్సార్ బోర్డ్ సూచనలకు చిత్ర నిర్మాణ సంస్థ అంగీకరించడంతో అడ్డంకులు తొలగిపోయాయి. 'భారతదేశంలో శక్తిమంతమైన మహిళ కథ, దేశ విధిని మార్చిన క్షణాలు మీ ముందుకు రానున్నాయి' అని పేర్కొంటూ వచ్చే ఏడాది జనవరి 17న 'ఎమర్జెన్సీ' విడుదలవుతుందని వెల్లడించారు కంగన.

ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది



సత్యదేవ్, డాలీ ధనంజయ, ప్రియా భవానీశంకర్ నటించిన చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్‌కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్‌రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరమ్, దినేశ్ సుందరమ్ నిర్మించారు. ఈ నెల 22న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా డైరెక్టర్ ఈశ్వర్‌కార్తీక్ మీడియాతో ముచ్చటించారు. "జీబ్రా' ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఆర్టిస్టిక్ ఎలిమెంట్స్‌ను బ్లెండ్ చేసిన చిత్రమిది. ఇందులో ఉన్న అన్ని అంశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటాయి. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నాను. కామన్ మ్యాన్ పాయింట్ నుంచి మొదలయ్యే ఈ సినిమా కథాంశం బ్యాంకింగ్, మనీ ల్యాండరింగ్ ఆధారంగా నడుస్తుంది. ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది. రవి బస్రూర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు.

మనసుల్ని కదిలిస్తుంది



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. సామాన్యులే సెలబ్రిటీలుగా భావిస్తూ ఆటో డ్రైవర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, మోటార్ మెకానిక్, వెయిటర్, కూలీల చేతుల మీదుగా మేకర్స్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ధర్మ మాట్లాడుతూ ' ఇది యూత్‌ను చెడగొట్టే సినిమా అనుకోకండి. మంచి లవ్ స్టోరీ ఉంది. అలాగే మీకు నచ్చే ఎన్నో ఎలిమెంట్స్ కథలో ఉన్నాయి' అని అన్నారు. దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ 'సాయి అనే పేరున్న యువకుడు దాదాపు ఇంటికొకరు ఉంటారు. ఈ చిత్రంలో హీరో ఎక్స్‌ప్రెస్‌లా తాగుతుంటాడు. అందుకే మూవీకి 'డ్రింకర్ సాయి' అనే పేరు పెట్టాం' అన్నారు.

బౌన్సీ పిచ్ సిద్ధం

పెర్త్: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే తొలి టెస్టు కోసం పిచ్ సిద్ధమైంది. ఆసీస్ శిక్షణ సందర్భంగా దీనికి సంబంధించిన ఫొటోలు బయటికి వచ్చాయి. స్థానిక ఒప్టస్ మైదానంలో ఈనెల 22 నుంచి మ్యాచ్ జరుగనుంది. డ్రాప్‌ఇన్ వికెట్ కావడంతో సెప్టెంబరు నుంచే క్యూరేటర్లు ఇందుకోసం శ్రమించారు. చక్కటి పచ్చికతో కనిపిస్తున్న ఈ పిచ్‌పై ఫాస్ట్ బౌలర్లు బౌన్స్‌తో ఇబ్బందిపెట్టే అవకాశం ఉంది. ఇది అత్యంత పటిష్ఠంగా కనిపిస్తున్న ఆస్ట్రేలియా బౌలింగ్ లైనప్‌కు సహాయకంగా ఉండనుంది. మరోవైపు స్వదేశంలో స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆడిన భారత్‌కు గట్టి సవాలే ఎదురుకానుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్లకు పరుగులు సాధించడం అంత సులువుకాకపోవచ్చు. ఓపెనర్‌గా వచ్చే రాహుల్, వన్‌డౌన్‌లో విరాట్ ఇప్పటికే ఫామ్ కోల్పోయి ఒత్తిడిలో ఉన్నారు. 2018లో ఇక్కడ ఇరు జట్ల మధ్య చివరి టెస్టు జరగ్గా 146 రన్స్ తేడాతో ఆసీస్ గెలిచింది. అలాగే గతేడాది పాక్ జట్టు ఆసీస్ పేసర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 89 పరుగులకు కుప్పకూలింది.



రెండో టెస్ట్‌కు రోహిత్!

కెప్టెన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో రెండో టెస్ట్‌కు జట్టులో చేరనున్నట్టు తెలిసింది. వచ్చేనెల ఆరునుంచి ఈ డే/నైట్ టెస్ట్ అడిలైడ్‌లో జరగనుంది. భార్య రితిక ప్రసవం కారణంగా పెర్త్‌లో జరగనున్న తొలి టెస్ట్‌కు రోహిత్ దూరమైన సంగతి తెలిసిందే. రెండో టెస్ట్‌కు ముందు జరిగే వామప్ మ్యాచ్‌లో రోహిత్ బరిలో దిగనున్నట్టు సమాచారం. ఈమేరకు బీసీసీఐకి అతడు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

తొలి మ్యాచ్‌కు వెటోరి దూరం

ఆస్ట్రేలియా జట్టు సహాయ కోచ్ డేనియల్ వెటోరి భారత్‌తో పెర్త్ టెస్ట్‌కు అందుబాటులో ఉండడంలేదు. ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రధాన కోచ్‌గా కూడా వ్యవహరిస్తున్న వెటోరి..లీగ్ మెగా వేలంలో పాల్గొనేందుకు వెళ్లనున్నాడు. ఐపీఎల్ వేలం ఈనెల 24, 25 తేదీల్లో జెడ్డాలో జరగనున్న సంగతి తెలిసిందే. ఇక భారత్‌తో మొదటి టెస్ట్ ఈనెల 22న ప్రారంభం కానుంది. దాంతో వేలంలో పాల్గొనేందుకు వెటోరి వెళ్లేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది.

ప్రాక్టీస్ మ్యాచ్ లేకుండానా..?

సరైన సాధన మ్యాచ్ లేకుండా భారత జట్టు పెర్త్ టెస్ట్‌లో బరిలో దిగనుండడాన్ని ఇంగ్లండ్ జట్టు మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ తప్పుబట్టాడు. 'ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ద్వారా ఆస్ట్రేలియాతో మొదటి టెస్ట్‌కు టీమిండియా సిద్ధం కానుండడం ఏమిటో?' అని వాన్ ఆశ్చర్యం వ్యక్తంజేశాడు.


మైకేల్ వాన్

జోరు సాగాలి..

జపాన్‌తో భారత్ సెమీఫైనల్ నేడు

మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్ (బిహార్): టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ఎరుగని అపజయం..దాంతో ఏర్పడిన కొండంత ఆత్మవిశ్వాసం..వెరసి హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. మంగళవారం జరిగే సెమీఫైనల్లో పటిష్ఠమైన జపాన్ జట్టును ఢీకొననుంది. టోర్నీలో ఇప్పటి వరకు మన మహిళల ఆట తీరు పరిశీలిస్తే సెమీస్‌లో నిస్సందేహంగా భారత జట్టే ఫేవరెట్. అంతేకాదు..చివరి లీగ్ మ్యాచ్‌లో 3-0తో జపాన్‌ను చిత్తు చేయడం సెమీఫైనల్లో మన మహిళలపై అంచనాలను మరింత పెంచింది. టోర్నమెంట్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో అన్నింటిలోనూ విజయం సాధించిన ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ భారత జట్టు..పారిస్ ఒలింపిక్స్ రజత పత విజేత చైనానూ కంగుతినిపించడం గమనార్హం. అయితే వరుస విజయాలు సాధించిన దరిమిలా ఉదాసీనతకు తావిస్తే భారత జట్టుకు భంగపాటు తప్పదు. లీగ్ మ్యాచ్‌లో జపాన్‌ను ఓడించామనే అతివిశ్వాసం కూడా తగదు. పైగా..లీగ్‌లో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో జపాన్ ఉంది. ఉదిత, సుశీల చాను, వైష్ణవితో కూడిన భారత డిఫెన్స్ శ్రేణి అద్భుతంగా రాణిస్తోంది. టోర్నమెంట్ ఆరంభ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి సర్కిల్లోకి దూసుకుపోవాలనే తొందరపాటుతో భారత జట్టు పొరపాట్లు చేసింది. అయితే కోచ్ హరేంద్ర తప్పులు సరిదిద్దడంతో ఆట గాడిలో పడింది. అలాగే..పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంతో తొలుత విఫలమైనా..ఆ అంశంలోనూ ప్రస్తుతం భారత్ మెరుగైంది. యువ డ్రాగ్ ఫ్లికర్ దీపిక దూకుడు ప్రదర్శిస్తోంది. షర్మిలా దేవి, సంగీతా కుమారి, ప్రీతి దూబే, లాల్‌రెమ్ సియామీతో కూడిన ఫార్వర్డ్ శ్రేణి సత్తా చాటుతుండడంతో భారత జట్టు ఎదురు లేకుండా సాగుతోంది. ఇక మంగళవారం జరిగే మరో సెమీఫైనల్లో చైనా జట్టుతో మలేసియా తలపడనుంది.



మరో మూడు రోజుల్లో మొదలయ్యే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమవుతోంది. ఐదు టెస్ట్‌ల్లో భాగంగా తొలి మ్యాచ్ ఈనెల 22 నుంచి పెర్త్‌లో జరగనుంది. ఈ క్రమంలో మొదటి టెస్ట్ సన్నాహకాల్లో భాగంగా అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ పూర్తిగా సద్వినియోగం చేసుకొనేందుకు యత్నిస్తోంది. అందుకోసం 'ఎ' జట్టుతో మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌ను కూడా రద్దు చేసుకొని తీవ్ర సాధనలో మునిగింది.

ఏ అవకాశమూ వదలకుండా..

టీమిండియా సన్నాహకాలు ముమ్మరం

పెర్త్ టెస్ట్‌కు సన్నద్ధం

పెర్త్: న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడడంతో..భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. ఇప్పుడిక టీమిండియా ఫైనల్ అవకాశాలు బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌పై ఆధారపడ్డాయి. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో నాలుగు టెస్ట్‌ల్లో విజయం సాధిస్తేనే రోహిత్ సేన డబ్ల్యూటీసీ తుది పోరుకు చేరగలుగుతుంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ టీమిండియాకు చావోరేవోనే. ఫలితంగా..పెర్త్‌లో జరిగే మొదటి టెస్ట్‌ను భారత జట్టు అత్యంత కీలకంగా తీసుకుంది. పెర్త్ పరిస్థితులకు పూర్తిగా అలవాటుపడేందుకు జట్టు సభ్యులంతా తీవ్రంగా శ్రమిస్తున్నారు. రెండుగా విడిపోయి మ్యాచ్‌లు ఆడారు. మొదటి మ్యాచ్‌కంటే రెండో మ్యాచ్‌లో బ్యాటర్లు చక్కగా రాణించారని సహాయ కోచ్ అభిషేక్ నాయర్ తెలిపాడు. 'ఈ మూడు రోజుల్లో ఏం చేయాలనే విషయమై ఆస్ట్రేలియా రావడానికి ముందే గంభీర్, రోహిత్‌తో కలిసి మేం చర్చించాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటుపడేలా జట్టు సభ్యుల మధ్య జరిగే మ్యాచ్‌ల్లో యువ, అనుభవజ్ఞులైన క్రికెటర్లకు తగు సమయం ఇవ్వాలని నిర్ణయించాం' అని నాయర్‌తోపాటు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. 'తొలి పోటీలో సాధారణ మ్యాచ్ మాదిరే బ్యాటర్ అవుటైతే క్రీజు వీడాల్సిందే. వారికి రెండో అవకాశం ఇచ్చాం. రెండోసారి కుర్రాళ్లు పరిస్థితులకు బాగా అలవాటై ఎక్కువసేపు క్రీజులో ఉన్నారు' అని నాయర్ వివరించాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో బౌలర్ల ప్రదర్శన గురించి చెబుతూ 'రెండో రోజు..బౌలర్లతో దశలవారీగా బౌలింగ్ చేయించాం. వారి పని భారాన్ని పరిశీలించాం. ఒక్కో బౌలర్ 15 ఓవర్లు వేశాడు. బుమ్రా అయితే 18 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అసలైన టెస్ట్ మ్యాచ్ పరిస్థితుల్లోకి బౌలర్లను తీసుకు రావడమే లక్ష్యంగా ప్రాక్టీస్ సాగింది. 22నాటికి పూర్తిగా గాడిలో పడతాం.' అని నాయర్ వెల్లడించాడు. మరో మూడు సాధన సెషన్లున్నాయని తెలిపాడు.



సిరాజ్‌పై గురుతర బాధ్యత..

రోహిత్ శర్మ అందుబాటులో ఉండకపోవడంతో మొదటి టెస్ట్‌కు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దాంతో అతడు సారథ్య బాధ్యతలతోపాటు పేస్ బౌలింగ్ భారాన్ని కూడా మోయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ కీలకం కానున్నాడు. తన బౌలింగ్‌తో బుమ్రాకు అతడు అండగా నిలవాల్సి ఉంటుంది.. 2020-21 ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన మూడు టెస్ట్‌ల్లో సిరాజ్ 29.53 సగటుతో 13 వికెట్లు పడగొట్టాడు. ఆ సిరీస్‌లో అతడు అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఇందులో ఒక ఐదు వికెట్ల ప్రదర్శన కూడా ఉండడం విశేషం. 'సిరాజ్ సూపర్ బౌలర్' అని మోర్నీ మోర్కెల్ ప్రశంసించాడు.

ఆ రెండు మ్యాచ్‌లు కీలకం

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కొంత ఉదాసీనత కారణంగా టీమిండియా భారీ మూల్యం చెల్లించుకొందని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. స్వదేశంలో ఎదురైన ఘోర పరాభవం నుంచి బయటపడాలంటే.. ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లను మెరుగ్గా ఆరంభించడం ఎంతో కీలకమని చెప్పాడు. న్యూజిలాండ్‌ను సరిగా అంచనా వేయకపోవడం వల్లే సొంతగడ్డపై 12 ఏళ్ల తర్వాత సిరీస్ ఓటమి.. అందునా క్లీన్‌స్వీప్‌ను చవిచూడాల్సి వచ్చిందని తెలిపాడు. 'పరాజయాల నుంచి తేరుకొని వీలైనంత వేగంగా భారత జట్టు గాడిలో పడాలి. అలా జరగాలంటే మరో సిరీస్‌ను ఆశావహంగా ఆరంభించాలి. ఈ క్రమంతో ఆసీస్‌తో తొలి రెండు టెస్టుల్లో సత్తాచాటడం టీమిండియాకు ఎంతో ముఖ్యం' అని ఐసీసీ రివ్యూలో రవి చెప్పాడు. ఆటగాళ్లు మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా కోచ్ గంభీర్, సహాయ సిబ్బంది తగిన సహాయ సహకారాలు అందించాలని సూచించాడు. గత రెండు పర్యటనల్లో సాధించిన చారిత్రక విజయాలతో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని శాస్త్రి సలహా ఇచ్చాడు. మొత్తంగా టీమిండియా సానుకూల దృక్పథంతో బరిలోకి దిగాలని సూచించాడు.



కమాన్ కోహ్లీ


గంగూలీ

న్యూఢిల్లీ: టెస్టు సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించడం విరాట్ కోహ్లీకిదే ఆఖరు కానుందని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. అక్కడ తనకిదే చివరిదని విరాట్‌కు కూడా తెలుసన్న దాదా.. ఆ సిరీస్‌తో కచ్చితంగా ఫామ్‌లోకి వస్తాడన్న విశ్వాసముందన్నాడు. ఇటీవల స్వదేశంలో టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శనతో కోహ్లీ ఇంటాబయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. 'విరాట్ ఓ చాంపియన్ బ్యాటర్. ఆసీస్ గడ్డపై అతడికి మెరుగైన రికార్డుంది. 2014లో నాలుగు, 2018లో ఓ శతకం బాదాడు. ఆసీస్‌లో టెస్టు సిరీస్ కోసం పర్యటించడం ఇదే ఆఖరు అనే విషయం అతడికి కూడా తెలుసు. అందుకే విరాట్ ఈసారి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాడు. ఇక కివీస్‌తో సిరీస్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలించలేదు. కానీ ఆసీస్ పిచ్‌లు అలా కాదు. అక్కడ అతడికి కొట్టిన పిండి. అందుకే కచ్చితంగా తనకు అనుకూలమైన చోట అద్భుతంగా రాణిస్తాడన్న నమ్మకం నాకుంది' అని గంగూలీ తెలిపాడు.

కసిగా ఆడతాడు

విరాట్ ప్రస్తుతం ఫామ్‌లో లేకపోయినా ఆసీస్‌తో సిరీస్‌లో కసిగా ఆడతాడని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా అన్నాడు. 'కివీస్‌పై విఫలమైన కోహ్లీ ఆసీస్‌పై పరుగులు సాధించాలనే ఆతృతలో ఉన్నాడు. తొలి టెస్టు జరిగే పెర్త్ మైదానంలో అతడు 2018లో సెంచరీ సాధించాడు. ఇది విరాట్‌కు ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. క్రీజులో కాస్త కుదురుకుంటే ఇక అతడిని ఆపడం కష్టమే' అని గవాస్కర్ పేర్కొన్నాడు.


గవాస్కర్

బీసీసీఐపై సీఏసీకి పీసీబీ!

కరాచీ: వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్‌లోనే నిర్వహిస్తామని ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నక్వీ స్పష్టం చేశాడు. భద్రతా కారణాలరీత్యా భారత క్రికెట్ జట్టు పాక్‌లో అడుగుపెట్టదని ఇప్పటికే బీసీసీఐ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీంతో తమ దేశానికి ఎందుకు రావద్దనుకుంటున్నారో లిఖిత పూర్వక సమాధానమివ్వాల్సిందిగా బీసీసీఐని పీసీబీ కోరుతోంది. ఇప్పటికే ఈ విషయమై ఐసీసీని కూడా సంప్రదించింది. ఎలాగైనా ఈ టోర్నీని పాక్‌లోనే నిర్వహించాలనే పట్టుదలతో ఉన్న పాక్ బోర్డు.. సమస్య పరిష్కారానికి క్రీడా మధ్యవర్తిత్వ కోర్టు (సీఏసీ)కు కూడా వెళ్లాలనే ఆలోచనలో ఉంది. 'మా దేశంలోనే చాంపియన్స్ ట్రోఫీ జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాం. రాజకీయాలతో క్రీడలను ముడిపెట్టడం సరికాదు. ఈసారి బీసీసీఐ ఒత్తిడికి తలొగ్గం. ప్రతీ ఐసీసీ సభ్యదేశానికి ఉండే హక్కులను తోసిపుచ్చడం తగదు. పాక్‌లో పర్యటించేందుకు భారత్‌కు మాత్రమే సమస్యగా ఉంది. ఐసీసీ వెంటనే షెడ్యూల్‌ను ప్రకటించాలి' అని నక్వీ సూచించాడు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

మూడో టీ20లోనూ పాక్ ఓటమి

హోబర్ట్: పాకిస్థాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే ఆసీస్ చేతిలో పాక్‌కిది వరుసగా ఏడో ఓటమి కావడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 18.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. బాబర్ (41) మాత్రమే రాణించాడు. హార్డీకి మూడు.. జంపా, జాన్సన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' స్టొయినిస్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 నాటౌట్) విజృంభించడంతో ఆసీస్ 11.2 ఓవర్లలో 118/3 స్కోరు చేసి గెలుపొందింది. ఇంగ్లి్ష్ (27) పర్వాలేదనిపించాడు.

ఆర్సీబీ బౌలింగ్ కోచ్‌గా సాల్వి

న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బౌలింగ్ కోచ్‌గా ఓంకార్ సాల్వి నియమితుడయ్యాడు. ఈమేరకు ఓంకార్ ఎంపికను ఫ్రాంచైజీ ఎక్స్‌లో పేర్కొంది. దేశవాళీ క్రికెట్‌లో సాల్వికి మంచి అనుభవం ఉంది. ముంబై రంజీ ట్రోఫీ, ఇరానీ కప్‌లు గెలవడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. గతంలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు సహాయ కోచ్‌గా పనిచేశాడు.

అలా ముగించారు

- ఒక్క గెలుపు లేకుండానే ఏడాదికి భారత్ వీడ్కోలు
- మలేసియాతో మ్యాచ్ డ్రా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత సాకర్ జట్టు ఈ ఏడాదిని విజయం లేకుండానే ముగించింది. సోమవారం గచ్చిబౌలిలోని స్టేడియంలో జరిగిన భారత్-మలేసియా స్నేహపూర్వక మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. ఆట ప్రథమార్థంలో రెండు జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడడంతో పోరు హోరాహోరీగా సాగింది. భారత ఆటగాళ్లు ఫారుఖ్ చౌధురి, సందేశ్, చింగిల్ సనా ఆరంభంలో దూకుడుగా ఆడడంతో బ్లూ టైగర్స్ ఆధిపత్యం కనబర్చింది. ఆట 19వ నిమిషంలో గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు డైరెక్ట్ హిట్‌ను అంచనా వేయడంలో విఫలమవడంతో మలేసియాకు సులభమైన గోల్ లభించింది. పౌలో జోశ్ చేసిన గోల్‌తో ఆ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత పుంజుకున్న భారత్ తొలి అర్ధభాగం ముగిసేలోపు గోల్ చేసి స్కోర్లు సమం చేసింది. ప్రథమార్థం ముగుస్తుందనగా 39వ నిమిషంలో కార్నర్ నుంచి ఫెర్నాండెజ్ అందించిన పాస్‌ను రాహుల్ బెకు కళ్లు చెదిరే హెడర్‌తో భారత్‌కు సూపర్ గోల్ అందించాడు. దీంతో ఇరుజట్ల స్కోరు 1-1తో సమమైంది. ఇక.. ద్వితీయార్థంలో ఇరుజట్లు గోల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఇంజ్యూరీ సమయంలోనూ ఇరుజట్లు మరో గోల్ సాధించలేకపోయాయి. దీంతో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ చివరకు డ్రాగా ముగియక తప్పలేదు.



సాత్విక్ జోడీ.. వచ్చేసింది

నేటి నుంచి చైనా ఓపెన్

షెన్‌జెన్ (చైనా): పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశాజనక ప్రదర్శన అనంతరం ఆటకు దూరమైన భారత బ్యాడ్మింటన్ టాప్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టనుంది. మంగళవారం నుంచి జరిగే చైనా మాస్టర్స్ టోర్నీలో సాత్విక్ జోడీ బరిలోకి దిగనుంది. విశ్వక్రీడల తర్వాత సాత్విక్ భుజానికి గాయం కావడంతో కొంత విరామం తీసుకోవాల్సిన పరిస్థితి. గతేడాది రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ జోడీ.. తొలి రౌండ్‌లో చైనీస్ తైపీ ద్వయం లీ జి హు-యాంగ్ పొ హసువన్‌తో తలపడనుంది. పేలవ ప్రదర్శనతో ఇబ్బందులుపడుతున్న సింగిల్స్ స్టార్లు పీవీ సింధు, లక్ష్య సేన్‌తోపాటు యువ షట్లర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి, మిక్స్‌డ్‌లో సుమీత్-సిక్కి జోడీలు ఆడనున్నాయి.


ఏటీపీ టూర్, నెంబర్‌వన్ ట్రోఫీలతో సినర్

ఏటీపీ ఫైనల్స్ చాంప్ సినర్

ఫైనల్లో టేలర్ చిత్తు

టూరిన్ (ఇటలీ): ప్రపంచ టెన్నిస్ పురుషుల నెంబర్‌వన్ జానిక్ సినర్ సొంతగడ్డపై అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ సీజన్ ముగింపు టోర్నమెంట్, ప్రతిష్ఠాత్మక ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఈ మెగా ట్రోఫీతో ఈ ఏడాదికి ఘనమైన ముగింపు పలికాడు. ఆదివారం రాత్రి జరిగిన సింగిల్స్ తుదిపోరులో టాప్ సీడ్ సినర్ 6-4, 6-4 స్కోరుతో అమెరికా స్టార్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను వరుస సెట్లలో ఓడించి ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 1986లో ఇవాన్ లెండిల్ (చెక్ రిపబ్లిక్) తర్వాత ఒక సెట్ కూడా కోల్పోకుండా ఏటీపీ టైటిల్ గెలిచిన తొలి ఆటగాడిగా 23 ఏళ్ల సినర్ రికార్డులకెక్కాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లను కూడా సినర్ దక్కించుకొన్న సంగతి తెలిసిందే. అంతేకాదు.. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ కూడా నిలబెట్టుకొని ఈ సీజన్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు తీసుకున్నాడు.

స్టీలర్స్‌కు టైటాన్స్ షాక్

ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు జట్టు ఆరో విజయం

నోయిడా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలుగు టైటాన్స్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో సంచలన విజయం సాధించింది. వరుసగా ఐదు విజయాలతో జోరుమీదున్న టేబుల్ టాపర్ హరియాణా స్టీలర్స్‌కు తెలుగు జట్టు షాకిచ్చింది. ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం సాగించిన టైటాన్స్ 49-27తో స్టీలర్స్‌ను చిత్తు చేసింది. గత మ్యాచ్‌లో ఓటమిపాలైన టైటాన్స్ ఈసారి మాత్రం ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా చెలరేగింది. హరియాణా జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగినా.. టైటాన్స్ ఆటగాళ్లు వ్యూహాత్మకంగా విజృంభించి అద్భుత ఫలితాన్ని రాబట్టారు. టైటాన్స్ రైడర్లు ఆశిష్ నర్వాల్ 11 పాయింట్లు, స్టాండిన్ కెప్టెన్ విజయ్ మాలిక్ 8 పాయింట్లతో సత్తా చాటగా.. డిఫెండర్ సాగర్, ఆల్‌రౌండర్ శంకర్ చెరో రెండు పాయింట్లతో ఆకట్టుకున్నారు. ఇక, డిఫెండర్ సాగర్ హైఫైవ్ సాధించాడు. ఫస్టాఫ్‌లోనే రెండుసార్లు స్టీలర్స్‌ను అవుట్ చేసిన టైటాన్స్ 24-11తో ఆధిక్యాన్ని చాటుకుంది. ఇక, సెకండాఫ్‌లో హరియాణా రైడర్లు దూకుడు ప్రదర్శించినా.. టైటాన్స్ డిఫెండర్లు చక్కని టాకిలింగ్స్‌తో చెక్ పెట్టారు. హరియాణా జట్టు తరఫున కెప్టెన్ రాహుల్ ఆరు, ఆల్‌రౌండర్ మహ్మద్ రెజా, జయసూర్య చెరో ఐదు పాయింట్లతో రాణించినా ఫలితం లేకపోయింది. మొత్తం పది మ్యాచ్‌లకుగాను ఆరు విజయాలు సాధించిన టైటాన్స్ 32 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతోంది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యు ముంబా 38-37తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. మంగళవారం జరిగే పోరులో పుణెరి పల్టన్‌తో యూపీ యోధాస్, బెంగళూరు బుల్స్‌తో పట్నా పైరేట్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.




నవ్య డాక్టర్

మంగళవారం • 19 నవంబరు 2024

ఫార్మ + జీనోమిక్స్ = ఫార్మకొజీనోమిక్స్. ఫార్మ (ఔషధాలు), జీనోమిక్స్ (ఒక వ్యక్తి జన్యువుల ఆధారంగా అందించగలిగే వ్యక్తిగత ఔషధాలు, వాటి మోతాదులు)





జన్యువులు | మందులు

ఏ ఇద్దరి వేలి ముద్రలూ ఒకేలా ఉండవు. అలాగే ఔషధాలకు స్పందించే స్వభావాలు కూడా! ఎవరికి ఏ ఔషధం, ఏ మోతాదులో కచ్చితమైన ఫలితాన్నిస్తుందో కనిపెట్టగలిగితే, చికిత్స సులభమవుతుంది, రోగికి ప్రయోజనం చేకూరుతుంది. అందుకోసం అక్కరకొస్తున్న ఔషధరంగమే 'ఫార్మకొజీనోమిక్స్'. ఈ రంగంలో భాగంగా, సులువైన జన్యు పరీక్షతో నప్పే ఔషధాలను కనిపెట్టే వీలుంది. ఆ జన్యుపరీక్ష ప్రయోజనాల గురించి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం!

ముక్కుసూటి మందుల కోసం...


ఔషధాలను శరీరం తనకనుగుణంగా మలుచుకునే ప్రక్రియను, జన్యు అమరిక ప్రభావితం చేస్తుంది. మన శరీరంలోని కొన్ని జన్యువులు ఔషధాలను శరీరం విని యోగించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తూ ఉంటాయి. మరీ ముఖ్యంగా రక్తం పలుచబడే మందులు, అధిక రక్త పోటు, మధుమేహం, అసిడిటీ, జ్వరం, నొప్పి మొదలైన సాధారణ మందుల విని యోగంలో 26 నుంచి 30 జన్యువుల పాత్ర ముఖ్యమైనది. వీటిలో స్వల్ప తేడా లున్నప్పుడు, తీసుకునే మందుల సక్రమ పనితీరుకు అవసరమైన ఎంజైమ్స్ విడుద లకు ఈ జన్యువులు తోడ్పడకపోవచ్చు. ఫలితంగా ఆ మందుల సామర్థ్యం తగ్గడం, లేదా పూర్తిగా నిర్వీర్యమైపోవడం లేదా అరుదుగా కొన్ని సందర్భాల్లో వికటిం చడం లాంటివి జరుగుతూ ఉంటాయి.

ఫార్మకోజీనోమిక్స్ ఎందుకు?

'నాకీ మందు పడలేదు. నాకు ఫలానా మందు చాలా బాగా పని చేసింది' అనే మాటలను మనం తరచూ వింటూ ఉంటాం. ఈ పని చేయడం, పడకపో వడం, బాగా పని చేయడం లాంటి వాట న్నిటి వెనకా మన జన్యు అలంకరణ ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరి జన్యు అమరికనూ పరిశీలించి, ఔషధాలను తయారుచేసే వెసులుబాటు అందుబాటులో లేదు. కాబట్టి ఒకే రకమైన రుగ్మతకు వేర్వేరు మందులు రూపొందుతూ ఉంటాయి. ఒక రికి సమర్థంగా ఫలితాన్నిచ్చే మందు, ఇంకొకరికి ప్రభావం కనబరచకపోవచ్చు. అందువల్లే సాధారణ రుగ్మతలైన అధిక రక్తపోటు, మధుమేహం లాంటి వాటికి వేర్వేరు మందులు మార్కెట్లో దొరుకుతు న్నాయి. అవి కనబరిచే ప్రభావం ఆధా రంగా వాటి వాడకంలో వైద్యులు మార్పులు చేర్పులు చేస్తూ ఉంటారు. అయితే ఇలా అన్ని రకాల మందులు వాడుకుని ఫలితాన్నిచ్చే ఔషధమేదో కని పెట్టే బదులు, మొదటి విడతలోనే కచ్చిత మైన ఔషధాన్ని కనిపెట్టగలిగితే, సమయం, డబ్బు, అన్నిటికంటే ముఖ్యంగా ఆరోగ్యాన్నీ ఆదా చేసుకోవచ్చు. అందు కోసం అందుబాటులోకొచ్చినదే 'ఫార్మకోజీ నోమిక్స్'.

సులువైన రక్త పరీక్షతో...

రక్త నమూనాను సేకరించి, దాన్లోని డిఎన్ఎను వేరు చేయడం ద్వారా జన్యువు లను సేకరించవచ్చు. ఒకవేళ తరచూ రక్త మార్పిడి అవసరమయ్యే రోగులైతే, వాళ్ల లాలాజలం, కణజాలాన్ని సేకరించి జన్యు పరీక్ష చేపట్టవచ్చు. ఈ పరీక్షను రెండు విధాలుగా చేపట్టవచ్చు. వైద్యులు సూచించే మందుల ఆధారంగా ఆ మందులతో సంబంధమున్న జన్యువును నేరుగా పరీక్షించి, స్పందిస్తున్న స్వభా వాన్ని పరీక్షించవచ్చు. జన్యు స్పందన అనుకూలంగా ఉన్నప్పుడు, ఆ మందు లను కొనసాగించవచ్చని రోగులకు సూచించవచ్చు. ప్రతికూలంగా ఉన్న ప్పుడు, ప్రత్యామ్నాయ ఔషధాన్ని సూచిం చవచ్చు. రెండో తరహా పరీక్షలో జన్యువు లను పరీక్షించి, ఏ ఔషధాలు శరీరానికి



సరిపడవో/మెరుగైన ఫలితాన్ని ఇవ్వవో ముందుగానే తెలుసుకోవచ్చు. ఇలా మందుగానే తెలుసుకోగలిగితే, భవిష్య త్తులో ఏ రుగ్మతకైనా వైద్యులను కలిసిన ప్పుడు, జన్యుపరీక్ష ఫలితం ఆధారంగా తదనుకూల ఔషధాలను సూచించమని వైద్యులకు చెప్పవచ్చు. ఈ పరీక్ష ఫలితా నికి రెండు వారాల సమయం పడుతుంది. ప్రస్తుతం ఈ పరీక్ష రోగులకు అందుబా టులో ఉంది.

ప్రయోజనాలు ఇవే!

జన్యు పరీక్ష ఆధారంగా కచ్చితమైన ఔషధాలను తెలుసుకోవడం వల్ల కొన్ని ఉపయోగాలున్నాయి. అవేంటంటే..

- అనవసరమైన మందుల వాడకం ఉండదు
- మందులు వికటించే ప్రమాదం ఉండదు
- తగిన మందు, తగిన మోతాదులో తీసుకునే వెసులుబాటు ఉంటుంది
- మందుల దుష్ప్రభావాలకు లోనయ్యే ప్రమాదం ఉండదు

ఈ పరీక్ష ఎవరికి?

- మూర్ఛ వ్యాధితో బాధపడే పిల్లలు
- క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయించుకో బోతున్నవాళ్లు
- దీర్ఘకాల రుగ్మతలతో బాధపడు తున్న వాళ్లు
- కుటుంబ చరిత్రలో తీవ్ర వ్యాధులు న్నవాళ్లు
- బహుళ రుగ్మతలున్నవాళ్లు
- అవయవ మార్పిడి అవసరమైన వాళ్లు

ఇలా జన్యు పరీక్షతో కచ్చితమైన మందులను కనిపెట్టడం వల్ల విలువైన సమయం వృథా అవకుండా ఉండడంతో పాటు, వ్యాధులు అదుపులోకొచ్చి, రోగులు మెరుగైన జీవితం గడపగలుగుతారు.

నప్పే మందులు కనిపెట్టాలి

మార్కెట్లో దొరికే 80 నుంచి 100 శాతం మందులన్నీ కొన్ని ప్రాథమిక దిను సుల ఆధారంగానే తయారవుతూ ఉంటాయి. ఉదాహరణకు అసిడిటీని తీసు కుంటే, రాబిప్రజోల్, పాంటాప్రజోల్ మొద లైన వేర్వేరు ఔషధాలు మార్కెట్లో అందు బాటులో ఉన్నాయి. వీటన్నిట్లో ప్రధా నంగా సోడియం ఉంటుంది. అలాగని ఇవన్నీ అందరికీ ఒకే విధమైన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. అధిక రక్తపోటు కలిగిన వాళ్లకు కూడా ఒకే ఔషధం సమాన ఫలి తాన్ని ఇవ్వకపోవచ్చు. ఈ సమస్యకు మార్కెట్లో దాదాపు 20 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే వైద్యు లను కలిసినప్పుడు, వాళ్లు వాళ్ల అను భవం ఆధారంగా ఉత్తమమైన ఔషధాన్ని సూచిస్తూ ఉంటారు. అయితే ఆ నిర్దిష్ట ఔషధం సదరు వ్యక్తికి సరైనది కాకపో వచ్చు. అలాంటప్పుడు అదనంగా ఇంకొక ఔషధాన్ని జోడించవలసి వస్తూ ఉంటుంది. లేదా ఔషధాన్ని మార్చవలసి వస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఎవరికి, ఏది సమర్థమైన ఫలితాన్నిస్తుందో, ఏది శరీరానికి నప్పుతుందో కచ్చితంగా తెలుసు కోవడంలో జన్యు పరీక్ష ఉపయోగపడు తుంది. ఒక ఔషధాన్ని శరీరం సద్విని యోగం చేసుకోవాలంటే, అందుకు తగిన ఎంజైమ్స్ విడుదలయ్యేలా జన్యువులు స్పందించాలి. అలా జరగనప్పుడు, తీసు కున్న ఔషధం ఫలితాన్నివ్వకపోవచ్చు, దాని సామర్థ్యం తగ్గవచ్చు, కొన్ని సంద ర్భాల్లో, చర్మం మీద దద్దుర్లు, కడుపునొప్పి, విరోచనాలు లాంటి లక్షణాల రూపంలో ప్రతికూల ప్రభావాన్ని (డ్రగ్ రియాక్షన్) కూడా కనబరచవచ్చు.

నా అనుభవం

2008లో అమెరికాలో జరిగిన ఒక ప్రమాదంలో మా అబ్బాయి నోటికి పెద్ద గాయమైంది. పెదవులు చీలిపోయి, దంతాలు ఊడిపోయి, తీవ్ర రక్తస్రావమైంది. ఆ సమయంలో వైద్యులు సర్జరీ చేసి, నొప్పి నివారిణి 'కోడిన్' ఔషధాన్ని సూచించారు. అయితే దాంతో మా అబ్బాయి నొప్పి తగ్గకపోగా, చిత్తభ్రమకు లోనవడం మొదలుపెట్టాడు. అలాగే విపరీతమైన కడుపునొప్పి వల్ల ఏమీ తినలేకపోయేవాడు. ఇలా ఎందుకు జరుగుతోందని వైద్యులను ప్రశ్నించినప్పుడు, దెబ్బ తీవ్రత మూలంగా మెదడు కూడా దెబ్బ తిని ఉండొచ్చనీ, ఎమ్మారై పరీక్ష చేయించమనీ చెప్పారు. "కానీ సర్జరీకి ముందు ఇలాంటి లక్షణాలేవీ కనిపించనప్పుడు, సర్జరీ తర్వాత కొత్తగా చిత్ర భ్రమ ఎందుకు కలుగుతోంది? బహుశా అది కోడిన్ ప్రభావమై ఉంటుందా?" అని వైద్యులను ప్రశ్నించాను. అందుకు వాళ్లు 'మేం సురక్షితమైన మందులే సూచించాం' అన్నారు. కానీ నాకు ఆ ఔషధం మీదే అనుమానం మొదలైంది. 'అది సురక్షితమైనదే కావచ్చు. కానీ మా అబ్బాయికి సురక్షితమైనది అయి ఉండకపోవచ్చు' అని చెప్పి, మందు వాడకం మానేసి, బాబుకు జన్యుపరీక్ష చేయించాను. ఆ పరీక్షలో 'సివైపి2డి6' అనే జన్యువులో సమస్య ఉన్నట్టు తేలింది. అందువల్లే నొప్పి నివారిణి, మార్ఫిన్‌గా మారి ఆ తరహా ప్రభావాన్ని కనబరచడం మొదలుపెట్టింది. ఈ విషయం గ్రహించిన తర్వాత, ఆ మందుల వాడకం మానేసిన వెంటనే అబ్బాయిలో చిత్తభ్రమలు పూర్తిగా తొలగిపోయాయి. కోడిన్ మా సరిపడదని ముందే తెలిసి ఉంటే, మా బాబు ఇంత ఇబ్బంది పడి ఉండేవాడు కాదు. ఔషధాల మీద జన్యువుల ప్రభావం ఏ మేరకు ఉంటుందో, జన్యుపరీక్షతో సరిపడే/సరిపడని మందులను ముందుగానే కనిపెట్టడం ఎంత అవసరమో గ్రహించడానికి ఇదొక ఉత్తమమైన ఉదాహరణ.

- డాక్టర్ ఆనీ క్యు హసన్
సీనియర్ కన్సల్టెంట్ అండ్ హెచ్ఒడి,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ మాలిక్యులర్ మెడిసిన్,
కామినేని హాస్పిటల్స్,
హైదరాబాద్.



మీకు | తెలుసా?

రాత్రివేళల్లో ఉద్యోగం చేస్తున్నారా?

రాత్రివేళ వృత్తుల్లో కొనసాగే వారి శరీరాలు ప్రతికూల ప్రభావాలకు లోనవుతూ ఉంటాయి. విదేశాల సమయవేళలకు తగ్గట్టు రాత్రివేళ మేలుకుని ఉద్యోగాలు చేసే వాళ్లు ముంచుకొచ్చే ఈ ఆరోగ్య ముప్పులను దృష్టిలో పెట్టుకోవాలి.

మెటబాలిజం

ఆహారాన్ని శక్తిగా మలిచే ఈ ప్రక్రియ దెబ్బతింటుంది. శరీర జీవగడియారంలో అవకతవకల వల్ల హార్మోన్ల విడుదల క్రమం తప్పుతుంది. వీటికి తోడు వేళ కాని వేళల్లో ఆహారం తినడం, వ్యాయామం లోపించడం, దురలవాట్లు సమస్యను మరింత క్లిష్టం చేస్తాయి.

నిద్ర సమస్యలు

మన శరీరం వెలుగుకు, సూర్యరశ్మికి స్పందించేలా పరిణామం చెందింది. కానీ రాత్రివేళ మేలుకునే ఉద్యోగాల వల్ల, నిద్రపట్టకపోవడం లేదా నిద్రను కొనసాగించలేకపోవడం అనే రెండు సమస్యలు వేధిస్తాయి.

జీర్ణ సమస్యలు

పొట్టలో అసౌకర్యం, మలబద్ధకం, వాంతులు, విరోచనాలు, ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ లాంటి జీర్ణాశయ సమస్యలు మొదలవుతాయి.



గుండె జబ్బులు

పగటి ఉద్యోగాలు చేసే వాళ్లతో పోలిస్తే, ఐదు నుంచి ఆరేళ్ల పాటు రాత్రివేళ విధుల్లో కొనసాగేవాళ్లలో గుండె జబ్బులు ఎక్కువ అని పరిశోధనల్లో తేలింది.

క్యాన్సర్

జీవగడియారంలో అవకతవకలు కణపనితీరును ప్రభావితం చేస్తాయి. దాంతో డిఎన్ఎ మరమ్మతు, కణ చక్రాలు, కణ మరణాలకు అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది.

ఇలా సరిదిద్దాలి

ఇతర దేశాల సమయాలకు అనుగుణంగా పని చేసే ఉద్యోగులు, ఆరోగ్యం దెబ్బతినకుండా చూసుకోవడం కోసం కొన్ని నియమాలను పాటించాలి. అవేంటంటే...

- పగటివేళ 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి
- నిద్రకు రెండు గంటల ముందు కాఫీ, కెఫిన్ ఆధారిత పానీయాలకు దూరంగా ఉండాలి
- ఆహారవేళలను పాటించాలి, వ్యాయామం చేయాలి
- వృత్తిలో తీసుకునే అల్పాహారాల్లో భాగంగా మాంసకృత్తులు, పీచు సమృద్ధిగా ఉండే పదార్థాలు తినాలి.

అపోహ | వాస్తవం

మాత్రలు ఏ మేరకు?

పోషకలోపాన్ని భర్తీ చేసే అనుబంధ మాత్రల పట్ల సర్వత్రా కొన్ని అపోహలుంటాయి. వాటి గురించిన వాస్తవాలను తెలుసుకుందాం!

అపోహ: బి విటమిన్ సప్లిమెంట్ శరీరం మీద ఒత్తిడిని తగ్గిస్తుంది.

వాస్తవం: ప్రమాదాల దెబ్బలు, రుగ్మతలు, కాలిన గాయాలు, సర్జరీల నుంచి త్వరితంగా కోలుకోవడం కోసం బి విటమిన్లు అవసరమే! అయితే బి కాంప్లెక్స్ మాత్రలతో సరిపడా బి విటమిన్లను పొందే వీలుండదు. కాబట్టి పోషకాహారంతో పాటు అదనంగా వీటిని తీసుకోవాలి. అంతే తప్ప పూర్తిగా వీటి మీదే ఆధారపడకూడదు.



అపోహ: సరిగా తినకపోయినా ఫర్వాలేదు. ఒక మల్టీ విటమిన్ మాత్ర వేసుకుంటే సరిపోతుంది.

వాస్తవం: ఎంతటి విటమిన్ సప్లిమెంట్ అయినా ఆహారం లోని పోషకా లన్నింటినీ భర్తీ చేయలేదు. ప్రకృతిసిద్ధ పోషకాలు లోపించిన ఆహారం తింటూ, మాత్రలను వాడుకోవడం వల్ల ఏ మాత్రం ప్రయోజనం ఉండదు.

అపోహ: విటమిన్ సప్లిమెంట్లతో అదనపు శక్తి సమకూరుతుంది

వాస్తవం: శరీరానికి క్యాలరీల ద్వారా శక్తి సమకూరుతుంది. విటమిన్ సప్లిమెంట్లలో క్యాలరీలు ఉండవు. అయితే తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం శోషించుకోవడానికి ఈ మాత్రలు సహాయపడతాయి. ఆహారం తీసుకోకుండా ఈ మాత్రలను తీసుకోవడం... ఇంధనం లేకుండా వాహనాన్ని నడిపించే ప్రయత్నం చేయడంతో సమానం. కాబట్టి వీటిని భోజనంతో పాటు తీసుకోవాలి.

పోషక | లోపం

సిలీనియం తగ్గితే?



థైరాయిడ్ హార్మోన్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర పోషించే సిలీనియం అనే మూలకం, వేర్వేరు శరీర జీవక్రియల పనితీ రుకు కూడా ఉపయోగప డుతూ ఉంటుంది. ఈ పోషకం లోపంతో గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. అదెలాగో తెలుసుకుందాం!

సిలీనియం కలిగి ఉండే యాంటీఆక్సిడెంట్ లక్ష ణాలు, ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి గుండెకు రక్షణనిచ్చి, మెరుగైన పనితీరుకు దోహదపడతాయి. ఈ మూలకం లోపంతో థైరాయిడ్ గ్రంథి, కండరాలు, గుండె దెబ్బతింటాయి. ప్రత్యేకించి ఈ మూలకం లోపంతో గుండె, కేషన్ వ్యాధి బారిన పడుతుంది. చైనాలోని కేషన్ అనే ప్రాంతం నుంచి ఈ వ్యాధికి ఈ పేరొచ్చింది. అక్కడి నేలల్లో సిలీనియం మోతాదు తక్కువగా ఉండడంతో, ఆ ప్రాంతంలోని ప్రజలు 'కార్డియొమయోపతి'ని పోలిన గుండె జబ్బు బారిన పడుతూ ఉండడంతో ఈ వ్యాధికి ఆ ప్రాంతం పేరును పెట్టడం జరిగింది. గుండె పెరగడం, గుండె కండరాలు బలహీనపడడం, గండె పనితీరులో హెచ్చుతగ్గులు తలెత్తి అంతిమంగా గుండె విఫలమైపోవడం ఈ రుగ్మత ప్రధాన లక్షణాలు. ఈ లోపాన్ని అరికట్టడం కోసం పొట్టు తీయని ధాన్యాలు, గుడ్లు, బీన్స్, బఠాణీ, పుట్ట గొడుగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, ఓట్స్ ఎక్కువగా తీసుకోవాలి.

డయాగ్నస్టిక్స్

చలి కాలం ఊపిరితిత్తులు నిక్షేపం

చలికాలంలో శ్వాసకోస సమస్యలు వేధించడం సహజం. అయితే ఈ సమస్యలు 20 ఏళ్లలోపు పిన్న వయస్కులు, 60ఏళ్లు పైబడిన పెద్దలు, వ్యాధినిరోధక వ్యవస్థ క్షీణించిన వాళ్లు, ఊపిరితిత్తులు బలహీనపడిన వాళ్లలో ఎక్కువ. ఈ సమస్యలను ఎలాంటి పరీక్షలతో కనిపెట్టవచ్చో తెలుసుకుందాం!


ప్రత్యేకించి శీతాకాలంలో అలర్జిక్ బ్రాంకైటిస్, అలర్జిక్ రైనైటిస్, అలర్జిక్ సైనసైటిస్ ఎక్కువ. ఈ కాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా విజృంభిస్తూ ఉంటాయి. కాబట్టి వీటి వల్ల ముందు నుంచి ఉన్న ఊపిరితిత్తుల సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశాలుంటాయి. కాబట్టి శ్వాసకోస సమ స్యల ముప్పు ఎక్కువగా ఉండేవాళ్లు, అందుబాటులో ఉన్న టీకాలతో రక్షణ పెంచుకోవాలి. అయితే టీకాలను ఆరు నుంచి 8 వారాల ముందు తీసుకోగలిగినప్పుడే వ్యాధినిరోధ కశక్తి చలికాలం సమీపించే నాటికి బలం పుంజుకుంటుంది. మధుమేహం, మూత్రపిండాల వ్యాధులు, అధిక రక్తపోటు లాంటి దీర్ఘకాల ఆరోగ్య సమస్యలున్నవాళ్లలో ముందు నుంచే వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లి ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు, రుగ్మతలను నియంత్రణలో పెట్టుకో వడం మీద దృష్టి పెట్టాలి. అలాగే విటమిన్ లోపాలు లేకుండా చూసుకోవాలి. ప్రత్యేకించి బి, బి12 విటమిన్ల లోపాలు వ్యాధినిరోధకశక్తి పరంగా ముఖ్యమైన పాత్రను పోషిస్తూ ఉంటాయి. కాబట్టి ఈ విటమిన్ లోపాలు తలెత్త కుండా జాగ్రత్తగా ఉండాలి.

కొవిడ్ జాగ్రత్తలు కొనసాగించాలి

అవసరంలేని ప్రదేశాలకు వెళ్లకపోవడం మనం కొవిడ్ నుంచి నేర్చుకున్నాం. శ్వాసకోస సమస్యల ముప్పు పొంచి ఉన్నవాళ్లు చలికాలంలో ఇలాంటి కొవిడ్ నియమాలనే పాటించాలి. ముఖానికి మాస్క్ పెట్టుకోవాలి. సామాజిక దూరం పాటించాలి. ఇంట్లో ఊపిరితిత్తుల ఇన్ఫె క్షన్ సోకిన వాళ్లను వాళ్ల గదికే పరి మితం చేయడం, బయటకు వెళ్లొ చ్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవడం, స్నానం చేయడం లాంటి జాగ్రత్తలు పాటించాలి. అలాగే సమయానికి ఆహారం తీసుకోవాలి, నిద్ర పోవాలి. సరిపడా నీళ్లు తాగడంతో పాటు జీర్ణ ప్రక్రియను క్రమబద్ధీకరిం చుకోవడం, ఒత్తిడి తగ్గించు కోవడం కూడా అవసరమే! ఇలాంటి జీవనశైలిని పాటించడం వల్ల అప్పటికే ఉన్న దీర్ఘ కాలిక రుగ్మతలు అదుపులో ఉండి, వ్యాధినిరోధకశక్తి మెరుగ్గా ఉంటుంది.

ఇన్ఫెక్షన్ల నిర్ధారణ ఇలా...


ఇన్ఫెక్షన్, అలర్జీల మోతాదులు, అవి సోకిన అవయ వాల మీదే చికిత్సలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి వీటిని కనిపెట్టడం కోసం సిబిపి, సిఆర్పి పరీక్షలు చేయవలసి ఉంటుంది.



అలాగే విటమిన్ మోతాదులను కూడా పరీక్షించుకోవలసి ఉంటుంది. కొంతమందిలో అలర్జీలు ఉంటాయి. కాబట్టి వాళ్లకు ఈసినోఫిల్స్, ఇమ్యునోగ్లాబ్యులిన్ మోతాదులు పరీ క్షించుకోవాలి. వీటితో పాటు అవసరాన్ని బట్టి ఎక్స్‌రేలు, సిటి స్కాన్ కూడా అవసరమవుతాయి. శ్వాసకోస సమస్యలకు అలర్జీ, ఇన్ఫెక్షన్ అనే రెండు కారణాలుంటాయి. వీటిలో కారణాన్ని బట్టి వైద్యులు తగిన చికిత్సను ఎంచుకుంటూ ఉంటారు. సిబిపి, సిఆర్పి, ఈసినోఫిల్స్, ఇమ్యునోగ్లాబ్యులిన్ పరీక్షల్లో అసలు కారణం తెలిసిపోతుంది. ఈ ఫలితాల ఆధా రంగా యాంటీబయాటిక్స్ సూచించాలా లేదంటే అలర్జీ వ్యతిరేక మందులు సూచించాలా అన్నది వైద్యులు నిర్ణయి స్తారు. అలాగే ఊపిరితిత్తులకు బ్యాక్టీరియల్, వైరల్ అనే రెండు రకాల ఇన్ఫెక్షన్లు సోకుతూ ఉంటాయి. అదనంగా ఫంగల్ ఇన్ఫెక్షన్ కూడా సోకుతూ ఉంటుంది. వీటిని నిర్ధా రించడం కోసం కఫ పరీక్ష చేయవలసి ఉంటుంది. ఇన్ఫె క్షన్ రకాన్ని నిర్ధారించుకోవడం కోసం, దగ్గడం ద్వారా స్వత హాగా బయటకు తెప్పించిన కఫాన్ని పరీక్షించడం, ఊపిరితి త్తుల నుంచి నీటిని సేకరించి పరీక్షించడం, బ్రాంకోస్కోపీ ద్వారా ఊపిరితిత్తుల్లోని స్రావాలను సేకరించి పరీక్షించడం ఇలా వేర్వేరు విధానాలను అనుసరిస్తారు. ఈ పరీక్షల ఫలి తాల ఆధారంగా సమర్థమైన చికిత్సల సహాయంతో ఇన్ఫెక్ష న్లను తగ్గించే మందులను వైద్యులు సూచిస్తారు.

- డాక్టర్ రాజేష్ వుక్కల
చీఫ్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్,
రెనోవా హాస్పిటల్స్,
సనత్ నగర్, హైదరాబాద్





అన్నింటా జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం



జగన్ దెబ్బ.. రాష్ట్రం అబ్బా!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ పాలనలో అన్ని విభాగాల్లోనూ రాష్ట్రం దిగజారి పోయింది. కీలకమైన, రాష్ట్రానికి ఆదాయం తెచ్చే రంగంగా ఉన్న సేవారంగంలో 2014-19లో 11.9% వృద్ధిరేటు నమోదైంది. జగన్ హయాంలో అది 10.2 శాతానికి తగ్గింది. అలాగే, వ్యవసాయ రంగంలో అత్యంత కీలకమైన సాగునీరు విషయంలోనూ జగన్ సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. 2018-19లో సాగునీరందిన నికర భూమి 36.35 లక్షల హెక్టార్లు ఉండగా, 2023-24లో అది 32.71 లక్షల హెక్టార్లకు తగ్గింది. అదేవిధంగా విద్యకు ప్రాధాన్యం ఇచ్చే విషయంలోనూ జగన్ సర్కారు వెనుకబడింది. 2018-19 మధ్య చంద్రబాబు హయాంలో 36.14 లక్షల మంది పిల్లలు పాఠశాలల్లో చేరగా, 2023-24 జగన్ పాలనలో ఆ సంఖ్య 34.14 లక్షలకు తగ్గింది. ఇక, 2018-19లో 38,165 మంది విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకోగా, 2023-24కు వచ్చే సరికి వీరి సంఖ్య 33,231కి తగ్గింది.

పేదరికంలో 9వ ర్యాంకు

- 2023లో నీతిఆయోగ్ విడుదల చేసిన 'పేదరిక నివేదికలో ఆంధ్రప్రదేశ్‌కి 9వ ర్యాంకు వచ్చింది. 2.42 శాతం పేదరికంతో పశ్చిమగోదావరి, 3.34 శాతంతో కడప జిల్లాలు రాష్ట్రంలో అతితక్కువ పేదరికం ఉన్నవిగా నిలిచాయి. 12.84 శాతంతో కర్నూలు, 8.66 శాతంతో విజయనగరం అత్యధిక పేదరికం ఉన్న జిల్లాలుగా నీతిఆయోగ్ నివేదికలో పేర్కొంది.
- 2023-24లో ఉపాధి హామీ పనుల అమల్లో దేశవ్యాప్తంగా రాష్ట్రం 4వ స్థానం సాధించింది. ఆ ఏడాది 2554.97 లక్షల పనిదినాలు కల్పించిందని సర్వేలో పేర్కొన్నారు. దీనిలో ఎస్సీలకు 572.44 లక్షల పని దినాలు, ఎస్టీలకు 290.34 లక్షల పని దినాలు, మహిళలకు 1547.26 లక్షల పనిదినాలు కల్పించారు.
- రాష్ట్రంలో అన్ని వయసుల వారితో కలుపుకొని పనిచేస్తున్న వారు 48.6 శాతంగా ఉండగా, ఈ విభాగంలో జాతీయ సగటు 42.4 శాతమేనని నివేదికలో వెల్లడించారు. పనిచేస్తున్న వారిలో మహిళలు 36.9 శాతం ఉండగా, దేశ సగటు 27.8 శాతం మాత్రమే ఉంది.

స్థిర అభివృద్ధి లక్ష్యాలు నేలచూపులే

ఎస్‌డీజీల అమల్లో ఏపీ మొదటి నుంచి మెరుగైన స్థానంలో ఉండేది. కానీ, కొన్నేళ్ల నుంచి వీటి అమల్లో రాష్ట్రం వెనుకబడింది. 2018-19లో ఈ విభాగంలో రాష్ట్రం 3వ స్థానంలో ఉండగా, 2020-21లో 4వ స్థానానికి పడిపోయింది. ఇప్పుడు ఏకంగా 9వ స్థానానికి దిగజారింది.

సర్వేలోని ముఖ్యాంశాలు

- 2014-19తో పోల్చితే 2019-24లో రాష్ట్ర ఆర్థిక ప్రగతి కుంటుపడింది.
- 2014-19లో జీఎస్‌డీపీ సగటు వృద్ధిరేటు 13.5 శాతం మేర పెరగ్గా, 2019-24లో ఆ వృద్ధిరేటు సగటు 10.6 శాతానికి క్షీణించింది.
- 2019-24లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో 10.5 శాతం వృద్ధి నమోదైంది. కానీ, 2014-19లో ఈ రంగంలో 16.6 శాతం వృద్ధి నమోదైంది.
- పారిశ్రామికరంగంలో 2014-19లో సగటున 11.9 శాతం వృద్ధిరేటు నమోదు కాగా, 2019-24లో 12.9 శాతానికి వృద్ధిరేటు పెరిగింది. 2014-19లో వచ్చిన పెట్టుబడుల కారణంగా 2019-24లో పారిశ్రామిక వృద్ధిరేటు స్వల్పంగా పెరగడం గమనార్హం.
- 2023-24లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.14.40 లక్షల కోట్లుగా అంచనా వేశారు. 2022-23లో జీఎస్‌డీపీ రూ.13.04 లక్షల కోట్లుగా నమోదైంది.
- 2023-24లో తలసరి ఆదాయం రూ2,42,479 కాగా, 2022-23లో రూ.2,19,881గా నమోదైంది.
- వ్యవసాయ, సేవా, పారిశ్రామిక రంగాల్లో దారుణంగా క్షీణించిన వృద్ధిరేటు.
- 2014-19లో తలసరి ఆదాయం 13.21 శాతం పెరగ్గా, 2019-24లో 9.61 శాతం మేర తగ్గింది.
- 2014-19లో నికరసాగు 60.49 లక్షల హెక్టార్లు కాగా, 2019-24లో 49.56లక్షల హెక్టార్లకు తగ్గింది.
- 2018-19లో పరిశ్రమలకు రూ.756.13 కోట్ల ప్రోత్సాహకాలు ఇవ్వగా, 2023-24లో కేవలం రూ.205.41 కోట్లు మాత్రమే ఇచ్చారు.

- అఫోర్డబుల్ క్లీన్ ఎనర్జీలో నం.1 స్థానంలోనే ఏపీ ఉంది.
- ఆరోగ్యం, మెరుగైన జీవనశైలి సూచీలో 2020-21లో 7వ ర్యాంకు సాధించగా, 2023-24లో 11వ ర్యాంకుకు పతనం
- లింగ సమానత్వం సూచీలో 2020-21లో 5వ ర్యాంకులో ఉండగా, 2023-24 నాటికి 14వ ర్యాంకుకు దిగజారింది.
- పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన నీరు సూచీలో 2020-21లో రాష్ట్రం 4వ ర్యాంకులో ఉండగా, 2023-24లో 11వ స్థానానికి పడిపోయింది.
- మెరుగైన పని, ఆర్థికవృద్ధి సూచీలో 2020-21లో 6వ ర్యాంకులో ఉండగా 2023-24లో 16వ స్థానానికి పతనం
- పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సూచీలో 2020-21లో 13వ స్థానంలో ఉండగా, 2023-24లో 21వ స్థానానికి క్షీణించింది.



అప్పులపై వైసీపీ చెప్పేవన్నీ తప్పులే!

- **10 లక్షల కోట్ల వరకు అప్పు ఉంది**
- **సూపర్ సిక్స్‌కి నిధులు కేటాయించాం: పయ్యావుల**
- **ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్: బొత్స**

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగ బద్ధంగానే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఆర్థిక విషయాల్లో ఉల్లంఘనలకు పాల్పడింది. ఆర్థిక రంగాన్ని కుదేలు చేసింది. ఇలాంటి చర్యలకు చైనాలో అయితే ఉరి తీసేవారు' అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. 'తల్లికి వందనం పథకం కోసం రూ.6,484.75 కోట్లు కేటాయించాం. ప్రతి అంశానికి సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడాలేనివిధంగా ఆర్థిక విధ్వంసం, అరాచకత్వం జరిగింది. గత ప్రభుత్వం దాదాపు 10 లక్షల కోట్లు అప్పులు చేసింది. అప్పులపై వైసీపీ చెప్పేవన్నీ తప్పులే' అని విమర్శించారు.

ఎగనామం పెట్టేందుకే!: బొత్స

తొలుత మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్' అని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులే లేవన్నారు. హామీలకు కేటాయింపులేని మోసపూరిత బడ్జెట్ అంటూ విమర్శించారు. పథకాలకు బడ్జెట్ కేటాయింపులు లేవని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని దీనికి నిరసనగా వాకౌట్ చేస్తున్నామని చెప్పి, వైసీపీ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు.

మా గురించి ఒక్క మాటా లేదు: పీడీఎఫ్

రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల గురించి ఒక్క మాటా లేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు విమర్శించారు. గత ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందన్నారు. పీఆర్సీ, డీఏలు ఇవ్వలేదన్నారు.

- **తాగునీటి నుంచి హౌసింగ్ వరకు అన్ని వ్యవస్థలనూ భ్రష్టుపట్టించారు**
- **నిప్పులు చెరిగిన పలువురు మంత్రులు**

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో అన్నింటా నిర్లక్ష్యం తాండవమాడిందని, దీంతో ఆయా వ్యవస్థలు భ్రష్టుపట్టిపోయాయని పలువురు మంత్రులు నిప్పులు చెరిగారు. ఇప్పుడు ఒక్కొక్క వ్యవస్థను గాడిలో పెడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పారు. సుమారు 2 గంటల పాటు ప్రశ్నోత్తరాలు నడిచాయి.

వైసీపీ రాబందుల కోసం!

గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 650 గ్రామాల్లో రీసర్వే చేపట్టిందని, ఆయా గ్రామాల్లో రీసర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే మళ్లీ సర్వే చేపడతామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. "ల్యాండ్ గ్రాబింగ్ చట్టంలో కూడా సవరణలు తెచ్చాం. 2019 నాటికి రాష్ట్రంలో 36.37 లక్షల ఎకరాల అసైన్డ్ భూమి పంపిణీ జరిగింది. గత ప్రభుత్వం 20 ఏళ్ల పూర్తయిన అసైన్డ్ భూములు, పదేళ్లు పూర్తయిన ఇంటి పట్టాలను రెగ్యులరైజ్ చేసేందుకు చట్టం తీసుకొచ్చింది. అయితే, ఆ చట్టాన్ని వైసీపీ రాబందులు ఉపయోగించుకున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతి ఒక్కటీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం" అని వివరించారు.

హౌసింగ్‌పై విచారణ

2014-19 మధ్య కాలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పట్టణ, పీఎంఏవై గ్రామీణ పథకాల కింద 2,90,260 ఇళ్లను కేంద్రం సాయంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నిర్మించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 5,63,179 ఇళ్లను ఎన్టీఆర్ గ్రామీణ ఇళ్ల కార్యక్రమం కింద నిర్మించారని చెప్పారు. పీఎంఏవై పట్టణ, పీఎంఏవై గ్రామీణ పథకాల కింద ఎలాంటి బిల్లులు పెండింగులో లేవని తెలిపారు. అయితే, ఎన్టీఆర్ గ్రామీణ ఇళ్ల పథకం కింద 2,80,589 మంది లబ్ధిదారులకు రూ.919.29 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్న వివిధ దశల్లోని గృహ నిర్మాణాలను తనిఖీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయని చెప్పారు. భూసేకరణ రెవెన్యూ శాఖ ద్వారా చేపట్టడం వల్ల హౌసింగ్ ద్వారా విచారణ చేపట్టడం వీలుకాదని, ఇళ్ల నిర్మాణాల అక్రమాలపై ఇప్పటికే విచారణకు ఆదేశించామని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందని అన్నారు. మండపేట నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే జోగేశ్వరరావు ప్రస్తావించారు.

చదును పేరుతో చెక్కేశారు!

ఎమ్మెల్యే పీజీవీఆర్‌నాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో భూములను సేకరించిందని, ఆ పార్టీ నేతలు అప్పట్లో వాటిని చదును చేసి సొమ్ము చేసుకున్నారని, ఆ అక్రమాలు వెలికి తీయాలని సభ దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం అండమాన్ జైలు మాదిరిగా సెంటు భూమి కేటాయించిందని, ఇప్పుడు ఆ స్థలాలను విక్రయించుకుంటున్నారని, ఎవరూ అక్కడ ఇళ్లు నిర్మించడం లేదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ తెలిపారు.

ముఖారవిందం ముద్రించారు

సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. గత ముఖ్యమంత్రి జగన్ తన ముఖారవిందాన్ని పట్టా కాగితాలపై ముద్రించి ఇచ్చారని, ఆ పట్టాలు ఎలా చెల్లుతాయని ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యే వల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో విక్రయాలు జరుగుతున్నాయని, పట్టణాలకు 30 కిలోమీటర్ల దూరంలో ఈ స్థలాలు ఇవ్వడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకోకుండా ఇతరులకు విక్రయించుకుంటున్నారని తెలిపారు.

ఆన్‌కాల్ డ్యూటీపై సమీక్షిస్తాం

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత ఉందని, ఆన్ కాల్ డ్యూటీ విధానం ద్వారా అనుభవం లేని డ్రైవర్లు బస్సులు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ శాసనసభాపక్షనేత విష్ణుకుమార్ రాజు అన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమాధానమిస్తూ.. ఆన్‌కాల్ డ్యూటీ విషయంలో ఆర్థికశాఖకు ఫైల్ వెళ్లిందన్నారు. ఆర్టీసీ సమస్యపై గుడివాడ ఎమ్మెల్యే రాము మాట్లాడారు. కాగా, నెల్లిమర్ల నియోజకవర్గంలో మత్స్యకారులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే లోకం మాధవి ప్రస్తావించారు. వారికి మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు అందించే డీజిల్ సబ్సిడీ లీటర్‌కు రూ.17కు పెంచాలని కోరారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మత్స్య పరిశ్రమల శాఖ పీఎంఎంఎస్‌వై నాన్ బెనిఫిషరీ పథకం కింద రాష్ట్రానికి 4,484 ట్రాన్స్ పాండర్లను కేటాయించిందని, ఇన్‌స్టాలేషన్ కొనసాగుతోందన్నారు.

మల్లవల్లిలో మౌలిక సదుపాయాలు

మల్లవల్లి పారిశ్రామిక పార్కులో యాజమాన్యాలు, కార్మికులు, ఉద్యోగులు మౌలిక వసతులు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. దీనికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానమిస్తూ.. మల్లవల్లి పారిశ్రామిక పార్కులో భూవివాదాలు లేని ప్రాంతాల్లో ఏపీఐఐసీ బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించిందన్నారు.

నివేదికలు పరిశీలించాలి: స్పీకర్

అధికారులు ఇచ్చిన నివేదికలను మంత్రులు గుడ్డిగా నమ్మవద్దని, ఆ నివేదికలను మళ్లీ ఒకసారి పరిశీలించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంత్రి పార్థసారథికి సూచించారు. ఒకసారి ఆ నివేదికలను పునః సమీక్షించి ఎవరైనా తప్పుడు నివేదికలు ఇచ్చి ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ సూచనలు స్వీకరించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్ పాలనలోనే ధరల దరువు

- **బియ్యం నుంచి కందిపప్పు వరకు గరిష్ఠంగా 40% భారం**
- **సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి**

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల జగన్ హయాంలోనే సామాన్యులపై ధరల దరువు పడింది. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డైరెక్టరేట్ రాష్ట్రంలో ఎంపిక చేసిన కేంద్రాల నుంచి రోజువారీగా ఆరు రకాల నిత్యావసర వస్తువుల ధరలను సేకరించి విశ్లేషించింది. ఈ క్రమంలో బియ్యం, కందిపప్పు, చింతపండు, ఉల్లిపాయల ధరలు అడ్డు అదుపు లేకుండా పెరిగి సామాన్యులకు కడుపుమంట మిగిల్చిన వైనం స్పష్టమవుతోంది.

సరుకు	2022-23	2023-24	తేడా%
బియ్యం	34.80	39.28	12.87
కందిపప్పు	103.32	144.94	40.28
మంచి నూనె(సన్‌ఫ్లవర్)	167.35	117.37	-29.87
చింతపండు(సాధారణం)	118.79	125.60	5.73
ఎండు మిర్చి(గ్రేడ్-2)	252.25	252.07	-0.07
ఉల్లిపాయలు(గ్రేడ్-2)	21.40	27.79	29.86

పథకాల అమలు పురోగతి ఆధారంగా నిధులు

- **ఎస్ఎన్ఏ స్పర్శ్ విధివిధానాలు విడుదల**

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వపథకాల కోసం నిధుల విడుదల, వాటి అమలుకు కేంద్రం కొన్ని విధివిధానాలు రూపొందించినట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న సింగిల్ నోడల్ ఏజెన్సీ(ఎస్ఎన్ఏ) విధానానికి కొన్ని మార్పులు చేసింది. దీనికి ఎస్ఎన్ఏ స్పర్శ్ అని పేరు పెట్టారు. ఈ విధానంలో పథకం అమలు పురోగతి ఆధారంగా నిధులను విడుదల చేస్తారు. ఈ విధానం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నిర్వహణ మెరుగుపడుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ సోమవారం పేర్కొంది.

వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడిగా లక్ష్మయ్య నియామకం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడిగా మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ పీవీ లక్ష్మయ్యను ప్రభుత్వం నియమించింది. ఏపీ వెటర్నరీ అసోసియేషన్ సభ్యుడిగా ఉన్న లక్ష్మయ్యను వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ చేస్తూ సోమవారం పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధకశాఖ, పశువైద్య విశ్వవిద్యాలయం విధానాల రూపకల్పనలో వెటర్నరీ కౌన్సిల్ కీలకంగా వ్యవహరిస్తుంది.

ప్రపంచ దేశాలకు అరకు కాఫీ!

- **జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ వెల్లడి**



బాధ్యతలు స్వీకరిస్తున్న కిడారి శ్రావణ్‌కుమార్, పక్కన జీసీసీ ఎండీ కల్పనాకుమారి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తదితరులు

విశాఖపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ప్రకారం అరకు కాఫీని ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తామని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ చెప్పారు. సోమవారం విశాఖపట్నంలోని జీసీసీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని అన్ని నగరాల్లో అరకు కాఫీని అందుబాటులో ఉంచుతామన్నారు. గిరిజన రైతులకు, జీసీసీకి మధ్య దళారులు లేకుండా చూస్తామని, గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. జీసీసీ ఎండీ కల్పనాకుమారి మాట్లాడుతూ అరకు కాఫీ పొడితో పాటు లిక్విడ్ కాఫీ కూడా అందిస్తామని, కాఫీపై ఐటీ రాయితీ కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, బాకూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సేవ ముసుగులో నిలువు దోపిడీ

- **సాయిరెడ్డి వియ్యంకుడి ఆదాయం కోసమే '108' వాహనాల కాంట్రాక్టు**
- **అసెంబ్లీలో 'అరబిందో'పై మంత్రి వెల్లడి**
- **రోడ్డు ట్యాక్సూ ఎగ్గొట్టారు: ఎమ్మెల్యేలు**

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సేవ ముసుగులో నిలువు దోపిడీ చేశారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇచ్చిన నోటీసు 74కు మంత్రి సమాధానమిచ్చారు. "2019, డిసెంబరులో 108 సర్వీసు ప్రొవైడర్స్ కోసం టెండర్లు పిలిచారు. అరబిందో ఎమెర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థలకు చెందిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ అండ్ సౌత్ సెంట్రల్ అంబులెన్స్ సర్వీసెస్ ఎస్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్టు ఈ బిడ్ దక్కించుకుంది. 2020 ఏప్రిల్ 20న అగ్రిమెంట్ చేసుకున్నారు. అప్పటికే ఉన్న 336 అంబులెన్స్‌లు, 432 కొత్త అంబులెన్స్‌లను ఈ సంస్థకు అప్పగించారు. మొత్తం 768 అంబులెన్స్‌లలో 731 ఎక్కడైనా వాడుకునేలా, 37 అంబులెన్స్‌లను బ్యాకప్‌లో ఉంచుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అరబిందో సంస్థ జూలై, 2020 నుంచి రంగంలోకి దిగింది. 768 అంబులెన్స్‌లలో 189 అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ ఉన్నవి కాగా, 579 బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు. ఇవన్నీ ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేశారు. ఒక్కో వాహనానికీ నెలకు రూ.2,21,257 చెల్లించారు. పాత వాహనాలకు రూ.1,78,072 చెల్లించారు. ఈ సంస్థ 2021 నుంచి 2024 లోపు 34,48,540 ఎమెర్జెన్సీ సర్వీసులను అందించింది. అరబిందో సంస్థ ఫోర్స్ అనే సంస్థతో అగ్రిమెంట్ చేసుకున్నా సర్వీసు కోసం సొంతగా ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందుకే వాహనాల ఫిట్‌నెస్ బాగా ఉన్నాయని సర్టిఫికేట్లు ఇచ్చుకున్నారు. సేవ ముసుగులో ప్రజాధనాన్ని దోచి పెట్టారు" అని వివరించారు. అంతకుముందు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ నేత విజయసాయిరెడ్డి వియ్యంకుడికి ఆదాయం కల్పించేందుకు అరబిందో సంస్థకు 108 అంబులెన్స్‌లను కేటాయించారన్నారు. గోల్డెన్ అవర్‌లో 17.80 లక్షల కాల్స్‌కు స్పందించలేదని, దీంతో వందల మంది ప్రాణాలు పోయాయన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సోమిరెడ్డి కోరారు. మరో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ స్వచ్ఛంద సేవల ముసుగులో అంబులెన్స్ నిర్వహణతో అరబిందో దోపిడీకి తెరదీసిందన్నారు. అంబులెన్స్‌లకు సంబంధించి రోడ్డుట్యాక్స్ ఎగ్గొట్టారని సభకు తెలిపారు.

ఏఐ సహకారంతో 2-3 గంటల్లోనే శ్రీవారి దర్శనం!



ధర్మకర్తల మండలి తొలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, సభ్యులు

- **తిరుమలలో శారదాపీఠం లీజు రద్దు**
- **కొండపై అక్రమంగా కట్టిన భవనాన్ని కూల్చివేస్తాం**
- **టూరిజం కోటా టికెట్లు కూడా రద్దు**
- **కొత్త పాలకమండలి కీలక నిర్ణయాలు**

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని 2-3 గంటల్లోనే దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) నూతన ధర్మకర్తల మండలి నిర్ణయించింది. కొండపై విశాఖ శారదా పీఠం లీజును రద్దు చేసి భవనాన్ని స్వాధీనం చేసుకుని కూల్చివేయాలని నిశ్చయించినట్లు మండలి చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. కొత్త మండలి తొలి సమావేశం సోమవారం కొండపై ఉన్న అన్నమయ్య భవనంలో జరిగింది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వాటిని ఈవో శ్యామలరావుతో కలిసి నాయుడు ఆ తర్వాత విలేకరులకు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులపై అపోహలు, అనుమానాలు ఉన్న క్రమంలో దాని పేరు మారుస్తామన్నారు. ట్రస్టుకు వచ్చే సొమ్ము టీటీడీ ప్రధాన ఖాతాలోనే జమయ్యేలా సాధ్యాసాధ్యాలను పరిశీలించి తదుపరి జరిగే బోర్డు సమావేశంలో రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 'ప్రస్తుతం శ్రీవారి దర్శనానికి 20 నుంచి 30 గంటల సమయం పడుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో 2-3 గంటల్లోనే దర్శనం పూర్తయ్యేలా చూడాలి. ఇందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆ కమిటీ ఇచ్చే రిపోర్టు ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటాం. అలాగే టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్థులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. వారికి వీఆర్ఎస్ ఇవ్వాలని.. లేదా ప్రభుత్వంతో మాట్లాడి మున్సిపాలిటీలో గానీ, రెవెన్యూ విభాగాలకు గానీ బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇకమీదట కొండపై రాజకీయాలు మాట్లాడడం నిషేధం. ఉల్లంఘించిన వారిపై కేసులు పెడతాం. కొండపై భవన నిర్మాణంలో శారదాపీఠం నూటికి నూరుపాళ్లు నిబంధనలు అతిక్రమించింది. నిపుణుల కమిటీ కూడా నిర్ధారించింది. ఈ క్రమంలో లీజును పూర్తిగా రద్దు చేసి స్థలాన్ని స్వాధీనపరచుకోవాలని బోర్డు తీర్మానించింది. ప్రతిరోజు టూరిజం కోటా కింద కేటాయిస్తున్న 4 వేల టికెట్ల కోటాను రద్దు చేయాలని నిర్ణయించాం' అని వెల్లడించారు. రేణిగుంట విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టికెట్ల కోటాను వంద నుంచి 200కు పెంచుతూ తీర్మానించామన్నారు. వచ్చే 25 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నప్రసాద భవనాన్ని ఆధునీకరిస్తామని చెప్పారు.

మరికొన్ని నిర్ణయాలు..

- ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్న టీటీడీ డిపాజిట్లను వెనక్కి తీసుకుని ప్రభుత్వ బ్యాంకుల్లోనే జమచేయాలి.
- అన్నప్రసాదం మెనూలో ఇంకో పదార్థం.
- శ్రీవారి లడ్డూలో వాడే నెయ్యి నాణ్యత ఇంకా పెంచాలి. దీని కోసం నిపుణుల కమిటీ. నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు తిరుమలలో రూ.90 లక్షలతో నూతన ల్యాబ్ ఏర్పాటు.
- ప్రసాదాల తయారీ పోటులో లీకేజీలు అరికట్టేందుకు మరమ్మతులు.
- తిరుమలలోని డంపింగ్ యార్డులోని చెత్త 3-4 నెలల్లో పూర్తిగా తొలగింపు.



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న పట్టాభిరామ్, వేదికపై బుద్ధా వెంకన్న, బొండా ఉమా, ఎంపీ కేశినేని చిన్ని, నక్కా ఆనందబాబు

స్వచ్ఛాంధ్ర చైర్మన్‌గా పట్టాభి ప్రమాణస్వీకారం

విజయవాడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌గా కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమ, సుజనా చౌదరి, నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబుతోపాటు వందలాదిమంది అభిమానులు హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం పట్టాభిని నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ వచ్చే ఏడాది గాంధీ జయంతి(2025 అక్టోబరు 2) నాటికి దేశంలోనే స్వచ్ఛరాష్ట్రంగా ఏపీని నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానని చెప్పారు.

ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా చిల్లపల్లి బాధ్యతలు



ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం అందించే లక్ష్యంతో పనిచేస్తానన్నారు. తనను ఈ పదవిలో నియమించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


దళితులకు జగన్ మోసం

- **మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ధ్వజం**
- **తాడేపల్లిలోని కార్యాలయంలో బాధ్యతల స్వీకారం**



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ జగన్ దళితులను మోసం చేశారన్నారు. ఆమెకు మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ, జనసేన నేతలు శుభాకాంక్షలు తెలిపారు.



మా జిల్లా రాయలసీమలో ఉందా లేదా?: జయనాగేశ్వర రెడ్డి

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ జిల్లా రాయలసీమలో ఉందో లేదో తమకు అర్థం కావడం లేదని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'కొండారెడ్డి బురుజు, మంత్రాలయం ఆలయం తప్ప మా జిల్లాలో ఏమీ లేవు. సీమలో సాగునీటి అభివృద్ధికి చేపట్టే ఏ ప్రాజెక్టు ద్వారా మా జిల్లాకు నీరు రావడం లేదు. రాయలసీమ దుర్భిక్ష నివారణ ప్రాజెక్టు పేరుతో చేపట్టిన పథకం కింద మా జిల్లావాసుల భూములు పోయాయి తప్ప చుక్క నీరు రావడం లేదు. హంద్రీ నది మా జిల్లాలోనే ఉన్నా, తుంగభద్ర ఉన్నా మాకు ఉపయోగం లేదు. అన్ని జిల్లాలకూ ప్రణాళికలు తయారు చేయగలిగినా కర్నూలు జిల్లాకు సాగునీరు ఎలా ఇవ్వాలన్నది చిక్కు ప్రశ్నగా మిగిలిందని సీఎం చంద్రబాబు స్వయంగా చెప్పారు' అని ఆయన వ్యాఖ్యానించారు.

అధ్యక్షా..! సభలో ఒక్క అధికారీ లేడు

పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తిన కొణతాల

పైన కూర్చొని నోట్ చేసుకుంటున్నారు: మంత్రి అచ్చెన్న

కవర్ చేయకండి మంత్రి గారూ... స్పీకర్ అయ్యన్న

అధికారుల్లో పాత వాసనలు పోలేదని ఎమ్మెల్యేలు ధ్వజం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల్లో పాత వాసనలు పోలేదంటూ కూటమి ఎమ్మెల్యేలు సోమవారం శాసనసభలో ధ్వజమెత్తారు. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖల మంత్రులు ప్రతిపాదించిన డిమాండ్లపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు సభలో లేకపోవడంపై కొణతాల రామకృష్ణ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. 'సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. అధికారులకు కేటాయించిన సీట్లలో ఒక్కరు కూడా లేరు చూడండి అధ్యక్షా! దీన్నిబట్టే వారి పనితీరు అర్థమవుతుంది' అని అన్నారు. అప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు లేచి 'అధికారులు పైన ఉన్న బాక్స్‌లో ఉన్నారు. రాసుకుంటున్నారు' అన్నారు. స్పీకరు అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ 'కవర్ చేయొద్దు మంత్రి గారూ!' అంటూ చురకంటించడంతో అచ్చెన్నాయుడు మాట్లాడకుండా కూర్చున్నారు. ఆ వెంటనే ఇద్దరు, ముగ్గురు అధికారులు సభలోకి వచ్చి వారికి కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. అనంతరం డిమాండ్లపై చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ... 'గత ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయాలను, పంచాయతీలను అనుసంధానం చేసి వ్యవస్థలను ప్రక్షాళన చేయాలి' అని కోరారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో మైనారిటీ వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలి. అమరావతి ప్రాంతంలో ఇస్లామిక్ రీసెర్చ్ సెంటరు ఏర్పాటుకు స్థలం, నిధులు కేటాయించాలి' అని విజ్ఞప్తి చేశారు. వివిధ శాఖలకు కేటాయించిన నిధులను దారి మళ్లించి తమ ఇష్టానుసారం ఖర్చు చేసేస్తే.. ఇక చట్టసభల్లో చర్చించి ఆమోదించిన బడ్జెట్‌కు విలువ ఏముంటుందని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రశ్నించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాడు పుల్లారావు, చోడవరం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి, నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్ తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు.

ఆరు పద్దులకు ఆమోదం

వివిధ శాఖల మంత్రులు ప్రతిపాదించిన ఆరు డిమాండ్ల (పద్దు లు)పై శాసనసభలో చర్చ జరిగింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, హెచ్‌ఆర్‌డీ, నైపుణ్యాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తరఫున మంత్రి నారాయణ, మిగిలిన శాఖలకు ఆయా మంత్రులు పద్దులు ప్రతిపాదించారు. చర్చ అనంతరం సభ ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు.

మీరా.. నీతులు చెప్పేది!

దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వారూ మాట్లాడుతున్నారు

- చట్టబద్ధత లేని 'దిశ'తో కాలం గడిపారు
- ఇంటి పక్కన అఘాయిత్యం జరిగినా సీఎంగా ఉన్న జగన్ కన్నెత్తి చూడలేదు
- నిప్పులు చెరిగిన హోం మంత్రి అనిత



అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసి వచ్చిన వారూ శాసన మండలిలో నీతులు చెప్పడం దారుణమని రాష్ట్ర హోం మంత్రి అనిత వైసీపీ సభ్యులపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై సోమవారం మండలి ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్న.. అనంతరం విపక్ష సభ్యులు చేసిన వ్యాఖ్యలపై మంత్రి అనిత విరుచుకుపడ్డారు. వైసీపీ హయాంలో జరిగిన దారుణాలను గణాంకాల సహితంగా వివరించారు. "దిశ చట్టాన్ని కొనసాగిస్తారా? లేదా?" అంటూ వైసీపీ సభ్యులడిన ప్రశ్నలపై మంత్రి అనిత స్పందిస్తూ.. దిశ చట్టం అసలు లేదని, నిర్భయ చట్టం మాత్రమే ఉందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్భయ చట్టం కింద కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయంటూ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపైనా మంత్రి మండిపడ్డారు. 2019-24 మధ్య జగన్ పాలనలో మహిళలపై అనేక అఘాయిత్యాలు జరిగినా కనీసం ఆయన చర్యలు తీసుకోలేదని హోం మంత్రి నిప్పులు చెరిగారు. దిశ చట్టానికి చట్టబద్ధత లేకుండానే 'దిశ' పేరిట పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారని అన్నారు. గతంలో టీడీపీ హయాంలో తెచ్చిన ఫోర్త్ లయన్ అనే యాప్‌నే దిశ యాప్‌గా మార్చారన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ల బోర్డులను మార్చి దిశ పోలీస్‌స్టేషన్లుగా మార్చారన్నారు. నిర్భయ చట్టం ఉన్నా కూడా గత ప్రభుత్వం అమలు చేయకుండా, లేని దిశ చట్టాన్ని తెచ్చిందని దుయ్యబట్టారు. అమరావతిపై కోపంతో అక్కడ మంజూరైన ఫోరెన్సిక్ లాబొరేటరీని జగన్ సర్కార్ నిలిపివేసిందని తెలిపారు. గత ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్ ఎక్కువగా సరఫరా అవ్వడం వల్లే అఘాయిత్యాలు ఎక్కువగా జరిగాయని విమర్శించారు. గత సీఎం ఒక్కసారి కూడా వీటిపై సమీక్షించలేదన్నారు. మహిళల జోలికి వచ్చినా, సోషల్ మీడియాలో అసభ్యంగా మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జగన్ తల్లి, చెల్లికి ఆయన బాబాయి కుమార్తెకు అన్యాయం జరిగినా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉద్ఘాటించారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గత 5 నెలల కాలంలో 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు పంపామన్నారు. చిన్నారులు ఆడబిడ్డలపై జరిగిన అత్యాచార ఘటనలను వైసీపీ సభ్యులు రాజకీయం చేయడం తగదన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఇంటికి సమీపంలో గ్యాంగ్ రేప్ జరిగితే స్పందించలేదని, విజయవాడ నడిబొడ్డున దళిత దివ్యాంగురాలిపై 3 రోజులు అత్యాచారం చేసినా స్పందించలేదని.. బాధితురాలి పక్షాన పోరాటానికి వెళ్తున్న చంద్రబాబుపై కేసులు పెట్టలేదా అని ప్రశ్నించారు.

పోలీసు వ్యవస్థ దుర్వినియోగం

చెట్లు నరికించడానికి, పరదాలు కట్టడానికి, టీడీపీ నేతల కదలికలపై నిఘా పెట్టడానికి జగన్ పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేశారని అనిత తెలిపారు. "టీడీపీ ప్రభుత్వంలోని మహిళా పోలీస్ స్టేషన్లనేకదా దిశ స్టేషన్లుగా మార్చింది" అని ప్రశ్నించారు. కేంద్రం అనుమతులు ఇచ్చి, రూ.200 కోట్లు ఇచ్చినా రాజధాని అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్‌ని కూడా ఏర్పాటు చేయలేని గత ప్రభుత్వ దుస్థితిని ఘన చరిత్రగా చెబుతున్నారని వైసీపీ సభ్యులపై మండిపడ్డారు. వాస్తవాలు చెబుతుంటే సహించలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. తమ సభ్యుల ప్రశ్నకు మంత్రి సూటిగా సమాధానం చెప్పకుండా రాజకీయ ఉపన్యాసం చేస్తున్నారని బొత్స అన్నారు. శాంతి భద్రతలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా విమర్శించారని వ్యాఖ్యానించారు. పవన్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని టీడీపీ సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. వాద ప్రతివాదాల మధ్యే సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు బొత్స ప్రకటించారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించం

మంత్రి గొట్టిపాటి రవి స్పష్టీకరణ



అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఇంధన రంగంలో రూ.1.29 లక్షల కోట్ల మేరకు అప్పులు చేసిందని రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని తేల్చి చెప్పారు. ఈ మేరకు సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. పీపీఏలు రద్దు చేయవద్దని కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. పీపీఏల రద్దు వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్తాయని కేంద్రం చెప్పినా వినలేదన్నారు. వైసీపీ హయాంలో ఒక్క మెగావాట్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేదని చెప్పారు. ఇంధన రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. హరిత, పునరుత్పాదక విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన చట్టంలోని లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఏపీ విద్యుత్ సుంకం(రెండో సవరణ)-2024 బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సవరణ వల్ల కొత్తగా వినియోగదారులపై అదనపు భారం గానీ, విద్యుత్ సుంకం గానీ విధించడంలేదని స్పష్టం చేశారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు పేర్కొన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని, ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు పెంచుతూ బిల్లు తేవడం సమంజం కాదని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. వైసీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం బిల్లు సభ ఆమోదం పొందింది.

అంగన్వాడీ భవనాలకు రూ.71కోట్లు

- మూడు నెలల్లో 6800 మినీ అంగన్వాడీల అప్‌గ్రేడ్
- కేంద్రాల్లో ఎల్‌ఈడీ టీవీలు: మంత్రి సంధ్యారాణి

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాక ఆగిపోయిన అంగన్వాడీ భవనాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడారు. మొత్తం 4,977 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.35 కోట్ల 64 లక్షలు కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో 7,090 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనకు తొలి విడతగా ఒక్కొక్క కేంద్రానికి రూ. లక్ష చొప్పున రూ.70 కోట్ల 90 లక్షల చొప్పున నిధులు విడుదల చేశామన్నారు. ఈ నిధులతో ఎల్‌ఈడీ టీవీలు, ఆర్‌వో ప్లాంటు, బెంచీలు కూర్చీలు, పిల్లలకు బొమ్మలు వంటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. అద్దెభవనాల్లో ఉన్న అంగన్వాడీల్లో మరుగు సదుపాయం లేని వాటిని వేరే చోటకు మారుస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 6,800 మినీ అంగన్వాడీలను అప్‌గ్రేడ్ చేసి అంగన్వాడీలుగా మార్చే ప్రక్రియ 3 నెలల్లో ప్రారంభమవుతుందని తెలిపారు.

అంగన్వాడీల గ్రాట్యుటీ పరిశీలనలో ఉంది

అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న ఆందోళనలపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందించారు. 'అంగన్వాడీల ప్రతి సమస్యపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉంది. వారి గ్రాట్యుటీ చెల్లింపు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అంగన్వాడీలతో చర్చించి దశలవారీగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం' అని సోమవారం పేర్కొన్నారు.

ఇమామ్ మౌజన్లకు గౌరవ వేతనం కొనసాగిస్తాం: ఫరూక్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం కొనసాగిస్తామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం శాసన మండలిలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఇవ్వడాన్ని 2016లో టీడీపీ ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. ముస్లింలు హజ్‌యాత్రలకు వెళ్లే ఇచ్చే ఆర్థిక సాయాన్ని కూడా కొనసాగిస్తామన్నారు. రాష్ట్రానికి చెందిన వారు విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి మాత్రమే లక్ష రూపాయలు ఇస్తామని స్పష్టం చేశారు. 2019లో కడప హజ్ హౌస్ నిర్మాణాన్ని తామే ప్రారంభించామని నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ చనిపోయినా పరిహారం లేదు: అనిత

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చట్టాల్లో చాలా మార్పులు జరగాల్సి ఉందని, ఒక సిటింగ్ ఎమ్మెల్సీ రోడ్డు ప్రమాదంలో చనిపోయినా ఆ కుటుంబానికి ఇంతవరకూ పరిహారం రాకపోవడం తనకు చాలా బాధ కలిగిస్తోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. 'పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఒక మైనర్ బాలుడు డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదం జరిగింది కాబట్టి చనిపోయిన వ్యక్తికి పరిహారం ఇవ్వలేమని బీమా కంపెనీలు చెబుతున్నాయి. చనిపోయిన వ్యక్తి కుటుంబం రోడ్డున పడినా ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. మైనర్ డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమైతే 41 ఎ నోటీసు ఇచ్చి పంపాల్సి వస్తోంది. చట్టాల్లోని లోపాలు దీనికి కారణమని అధికారులు అంటున్నారు. దీనిపై ఏం చేయాలో ఆలోచన చేస్తున్నాం' అని ఆమె చెప్పారు.

వైసీపీ భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల విన్నపాలు

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుని, తమ భూములను తిరిగి తమకు అప్పగించేలా చూడాలని పలువురు బాధితులు టీడీపీ నేతలను వేడుకున్నారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేయడంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నమయ్య జిల్లా కొండపల్లికి చెందిన మస్తాన్‌రెడ్డి వాపోయారు. తమ గ్రామ వైసీపీ నేత సుల్తాన్ తమ స్వాధీనంలోని వారసత్వ భూములను కబ్జా చేసి, ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించుకున్నాడని కర్నూలు జిల్లా కాల్వ గ్రామానికి చెందిన పలువురు బాధితులు వాపోయారు. తన పొలాన్ని ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి, వెంచర్ వేసి, గోడ కట్టి, లోపలికి వెళ్లనీయడం లేదని కర్నూలు జిల్లా వెంకటాపురానికి చెందిన కే పుల్లయ్య ఫిర్యాదు చేశారు. గవర కులస్థులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని గవర సేవ సమాఖ్య చైర్మన్ అడారి ఉమాశంకరరావు కోరారు.

ఏపీ అభివృద్ధిలో ఎన్నారైలు భాగం కావాలి: పల్లా

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో స్థిరపడిన ఎన్నారైలు జన్మభూమి స్ఫూర్తితో మళ్లీ స్వరాష్ట్రానికి సేవలు అందించడానికి ముందుకు రావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'గతంలో చంద్రబాబు పిలుపుతో ఎన్నారైలు స్వరాష్ట్రానికి సహకరించిన విధంగా మళ్లీ తమ సహాయ, సహకారాలు అందించాలని కోరుతున్నాం. పుట్టిన ఊరు, జిల్లా, రాష్ట్రం రుణం తీర్చుకోవటానికి ఎన్నారైలు ముందుకు రావాలి. జన్మభూమి-1 స్ఫూర్తితో మళ్లీ సీఎం చంద్రబాబు చేపట్టిన జన్మభూమి-2లో భాగస్వాములు కావాలి. చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ఇప్పటికే చాలా మంది పారిశ్రామికవేత్తలు ఏపీకి వస్తున్నా రు. అలాగే ఎన్నారైలు కూడా ముందుకు వస్తారని ఆశిస్తున్నాం' అని చెప్పారు. కాగా, 'రండి.. నీ పురిటిగడ్డ, సొంత ఊరు పిలుస్తోంది.. గ్రామాన్ని దత్తత తీసుకోండి..' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునకు ఎన్నారైల నుంచి మంచి స్పందన ఉందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చెప్పారు. జన్మభూమి రుణం తీర్చుకునేందుకు ఎన్నారైలు ఏపీకి రావటానికి ఇప్పుడు సిద్ధంగా ఉన్నారన్నారు.

అఘాయిత్యాలు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

- పదేళ్లుగా మహిళా రక్షణ మృగ్యం : షర్మిల

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను అరికట్టడంలో గత పదేళ్లుగా ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందుకు సోమవారం శాసనమండలిలో జరిగిన చర్చ ప్రత్యక్ష ఉదాహరణ అంటూ ఎక్స్ వేదికగా షర్మిల ట్వీట్ చేశారు. "2014-19 వరకు రాష్ట్రంలో 83,202 కేసులు, 2019-2024వరకు 1,00,508 కేసులు నమోదయ్యాయి. తమ పాలనలో కంటే వైసీపీ పాలనలో ఇరవై శాతం ఎక్కువగా కేసులు నమోదయ్యాయని టీడీపీ చెబుతుంటే.. కూటమి అధికారంలోకి వచ్చాక పదుల సంఖ్యలో అత్యాచారాలు జరుగుతున్నాయని వైసీపీ వాదిస్తోంది" అని అన్నారు. అత్యాచారాలను అరికట్టడంపై దృష్టి పెట్టాల్సింది పోయి, మహిళల మానప్రాణాలపై పాలక, ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేయడం ఏమిటని షర్మిల నిలదీశారు.

వివేకా పీఏ కృష్ణారెడ్డిని విచారించిన పోలీసులు

పులివెందుల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రైవేట్ ఫిర్యాదు ఇచ్చిన ఆయన పీఏ కృష్ణారెడ్డిని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ సోమవారం విచారించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో తనను వేధిస్తున్నారంటూ కృష్ణారెడ్డి అప్పటి సీబీఐ విచారణాధికారి రామ్‌సింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డిపై కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పులివెందుల కోర్టులో 28 డిసెంబరు 2021న కృష్ణారెడ్డి ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ విషయమై కృష్ణారెడ్డిని విచారించి నిజానిజాలు తెలపాలని పులివెందుల పోలీసులకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీనిపై అప్పటి సీఐ నాగరాజు విచారణ చేపట్టి ఆ వివరాలను కోర్టుకిచ్చారు. కానీ కోర్టు నాలుగు ప్రశ్నలు వేసి మరోసారి విచారించాలని తాజాగా డీఎస్పీకి ఉత్తర్వులు జారీ చేయడంతో మళ్లీ విచారించారు.

పిల్లలు ఎందరున్నా పోటీకి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. 1980-90 మధ్య దేశంలో జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని.. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్న వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పేర్కొంటూ టీడీపీ ప్రభుత్వం 1994 మే 30న ఈ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిందని చెప్పారు. 'ఆ తర్వాత ఈ చట్టాన్ని వివిధ రాష్ట్రాల్లో అమలు చేశారు. జాతీయ ఆహార భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని జనాభా పెరుగదలను నియంత్రించడానికి అప్పుడీ చట్టం అవసరమైంది. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికలకు దీనిని వర్తింపజేశారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్) ప్రకారం.. దేశవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు తగ్గిపోతోంది. 1993-94లో 3.7గా ఉన్న ఈ రేటు ఇప్పుడు 2.1కి తగ్గిపోయింది. మన రాష్ట్రంలో ఇది 1.6కి పడిపోయింది. సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడంతో పాటు జనాభాలో 15 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారి సంఖ్య భారీగా పడిపోతోంది. 2015-16లో దేశ జనాభాలో 15 ఏళ్ల వయస్కులు 28.6 శాతం ఉంటే ఇప్పుడు 2 శాతానికి తగ్గిపోయింది. ఇది మన దేశ వృద్ధి రేటుపై ప్రభావం చూపే అవకాశముంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త విధానాలను అనుసరిస్తోంది. ముఖ్యంగా యువ జనాభాను పెంచే విధంగా ప్రణాళికలు రచిస్తోంది. ముందుగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేసే విధంగా అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. సమాజంలో అందరికీ గుర్తింపు, సమాన హక్కులు ఉండాలనే ఉద్దేశంతో పాటు సంతానోత్పత్తిని పెంచాలనే ఉద్దేశంతో చట్ట సవరణ చేశాం' అని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువత తగ్గడం వల్ల రాష్ట్రాభివృద్ధి, స్థూల ఉత్పత్తికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, సంతానోత్పత్తి తగ్గడం చిన్న విషయం కాదన్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వంద మందిలో ఒక్కరు కూడా ముగ్గురు పిల్లలను కనడం లేదన్నారు. అసలు పిల్లలను కనేవారి సంఖ్య కూడా తగ్గిపోతోందని.. కొంత మంది ఒక్కరైతే చాలన్న ఆలోచనతో ఉంటున్నారని చెప్పారు. భవిష్యత్‌లో మన దేశం కూడా జపాన్‌లా తయారయ్యే ప్రమాదం ఉందని.. అందుచేత ప్రతి ఒక్కరూ సంతానోత్పత్తిని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి పెరగాలంటే ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. చర్చ అనంతరం బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఇదే విధంగా పురపాలక చట్టంలోనూ సవరణ కోరుతూ మున్సిపల్ మంత్రి పి.నారాయణ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. మున్సిపాలిటీల్లో కూడా ఎంత మంది పిల్లలున్నా పోటీ చేసేందుకు అర్హత కల్పించే ఈ బిల్లును సైతం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

హెల్త్ వర్సిటీ చట్టం నుంచి 'కుష్ఠు, చెవిటి, మూగ' పదాలు తొలగింపు

- చట్ట సవరణకు శాసన సభ ఆమోదం



అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ చేసిన సూచనలను అనుసరించి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ చట్టం - 1986కు సవరణను ఏపీ అసెంబ్లీ ఆమోదించింది. కుష్ఠు రోగులు, చెవిటి, మూగ సమస్యలు కలిగిన వారు వర్సిటీ బోర్డులో సభ్యులుగా చేరేందుకు అర్హులు కాదని విశ్వవిద్యాలయం చట్టంలో పేర్కొన్నారు. అయితే వారిపై వివక్ష చూపరాదంటూ ఎన్‌హెచ్‌ఆర్సీ అన్ని రాష్ట్రాలకు స్పష్టమైన సూచనలు చేసింది. ఆ మేరకు సవరణలను ప్రతిపాదిస్తున్నట్లు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సభకు తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ చట్టానికి సవరణ కోరుతూ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేదిక్ అండ్ హోమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టానికి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టానికీ సవరణలను ప్రతిపాదిస్తూ బిల్లులను ఆయన సభలో ప్రవేశపెట్టారు. వాటిని సభ ఆమోదించింది. సోమవారం శాసన సభలోకి ఆంధ్రప్రదేశ్ కో - ఆపరేటివ్ సొసైటీస్ సవరణ బిల్లును వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. దీనిపై మంగళ లేదా బుధవారాల్లో సభలో చర్చ జరగనుంది.

నా హక్కులకు భంగం!

- అక్రమ మైనింగ్‌లో నా ప్రమేయం ఉందని మండలిలో మంత్రి కొల్లు చెప్పారు
- వివరణ కోసం అసెంబ్లీలో వసంత పట్టు



అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'శాసన మండలిలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర గనుల మంత్రి కొల్లు రవీంద్ర సమాధానమిస్తూ.. వెలగలేరు, వేమవరం, కొత్తూరుతాడేపల్లి గ్రామాల్లో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంలో అప్పటి ఎమ్మెల్యే ప్రమేయం ఉందన్నారు. మంత్రి వ్యాఖ్యలతో నా హక్కులకు భంగం వాటిల్లింది. మంత్రి పొరపాటున అలా చెప్పారా? లేక అధికారులు ఆయనకు తప్పుడు సమాచారం ఇచ్చారా? దీనిపై మంత్రితో సభలోనే వివరణ ఇప్పించాలి' అని మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరారు. ఈ ఆసక్తికర పరిణామం సోమవారం జీరో అవర్‌లో చోటుచేసుకుంది. అప్పుడు సభలోనే ఉన్న మంత్రి కొల్లు స్పందిస్తూ.. 'రాజమండ్రి నుంచి వచ్చే పోలవరం కాలువ పరిధిలో చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ కాలువలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, దోపిడీ వ్యవహారంపై దర్యాప్తును సీబీసీఐడీకి అప్పగించాం. ఆ వివరాలనే మండలిలో చెప్పాను. ఎక్కడా వ్యక్తుల పేర్లు ప్రస్తావించలేదు' అని చెప్పారు. కృష్ణప్రసాద్ సంతృప్తి చెందలేదు. వెలగలేరు, కొత్తూరుతాడేపల్లి తన నియోజకవర్గ పరిధిలోకే వస్తాయని, తన పరువుకు భంగం వాటిల్లినందున మంత్రి సమగ్రమైన వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. కొల్లు మళ్లీ మాట్లాడుతూ.. 'ఆ గ్రావెల్ కేసులో మొత్తం 170మంది ఉన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుంటామని చెప్పాం. ఇందులో మీ ప్రస్తావన లేదు. అన్యథా భావించవద్దు' అని స్పష్టం చేయడంతో కృష్ణప్రసాద్ శాంతించారు. కాగా, రాష్ట్ర పరిధిలో ఉన్న 8 రైల్వే డివిజన్లు, 4 రైల్వే జోన్లలో రైల్వే ప్రయాణికుల సలహా సంఘాలకు ఒక్కో ప్రతినిధి చొప్పున ఎన్నికవడానికి ఆసక్తి ఉన్న ఎమ్మెల్యేలు మంగళవారం సాయంత్రంలోగా నామినేషన్లు దాఖలు చేయవచ్చని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభలో సూచించారు. 20న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణల అనంతరం పోటీ ఏర్పడితే 22న ఎన్నిక నిర్వహిస్తామని.. పోటీ లేకపోతే నామినేట్ చేస్తామని వివరించారు. ఈ మేరకు ప్రభుత్వ తీర్మానాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సభలో ప్రవేశపెట్టారు.

రోజుకో అంశంపై చర్చ: స్పీకర్

శాసనసభలో రోజుకో ప్రధాన అంశాన్ని తీసుకుని సమగ్రంగా చర్చించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభ్యులకు సూచించారు. శనివారం టిడ్కో ఇళ్లపై అర్థవంతమైన చర్చ జరిగిందని, ప్రజల నుంచి కూడా మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని తెలిపారు. ఇదిలా ఉండగా.. శాసనసభ ఆమోదించిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ సవరణ బిల్లు-2024, విద్యుత్ సుంకం బిల్లు, ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినిమయ తాత్కాలిక బడ్జెట్-2 బిల్లులను ఎలాంటి సవరణలూ లేకుండా ఆమోదించినట్లు స్పీకర్ సభలో ప్రకటించారు.

సమావేశాలను మరో వారం పొడిగించాలి : కొణతాల

బడ్జెట్ సమావేశాలను మరో వారం రోజులు పొడిగించి, ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం కల్పించాలని అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఒక పూట మాత్రమే సభ నిర్వహిస్తే.. రెండో పూట శాసనసభ్యులు ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు, మంత్రులను కలిసి చర్చించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించేవారని, ఆ సంప్రదాయాన్ని పునరుద్ధరించాలని కోరారు. అందరి అభిప్రాయం అదే అయితే చప్పట్ల ద్వారా ఆమోదం తెలపాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కోరారు. అందరూ ఆమోదం తెలుపడంతో.. ఈ విషయాన్ని స్పీకర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సీఎం నిర్ణయంతో ట్రాక్టర్ ఇసుక ధర 900లే!

నెల్లూరు రూరల్ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక రేవుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక ఉచితంగా తీసుకువెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకొన్న తర్వాత తమ జిల్లాలో ఇసుక ధర భారీగా తగ్గిపోయిందని, ట్రాక్టర్ ఇసుక ధర రూ.900కు పడిపోయిందని నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.4వేల నుంచి రూ.7 వేలకు చేరింది. ఇప్పుడు ఇసుక తక్కువ ధరకు ఎంత కావాలంటే అంత దొరుకుతుండటంతో నిర్మాణ పనులు బాగా జరుగుతున్నాయి. భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పనులు ఉంటున్నాయి' అని ఆయన వివరించారు.

అలా అయితే జగన్ అసెంబ్లీకి వస్తారు

'జగన్ రెడ్డికి మైకు కావాలి. రోజూ ఆయనకు ఒక గంటపాటు అసెంబ్లీలో మైక్ ఇస్తానని స్పీకర్ హామీ ఇస్తే ఆయన రేపటి నుంచే సభకు వస్తారు' అని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ ప్రజా సమస్యలపై ఏనాడూ సభలో పోరాడలేదు. తన మైక్ కోసమే పోరాడాలని ఆయన అప్పట్లో మాకు చెప్పేవారు' అని కోటంరెడ్డి అన్నారు.

మాకు ఇసుక సమస్య తీరలేదు: రామకృష్ణారెడ్డి

తూర్పు గోదావరి జిల్లాలో ఇసుక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పారు. 'గోదావరి నదిలో ఇంకా ప్రవాహం పూర్తిగా తగ్గకపోవడం వల్ల ఇసుక ఎక్కువ రావడం లేదు. యంత్రాలు వాడకుండా కేవలం మనుషులతోనే నదిలో నుంచి ఇసుక తీయాలని అధికారులు పట్టుబడుతుండటంతో ఇసుక లభ్యత పెరగడం లేదు. ఇసుక చాలినంత దొరుకుతుంటే ధరలు అవే దిగివస్తాయి. దీనికి మార్గం ఏవిటో అధికారులు ఆలోచన చేయాలి' అని ఆయన అభిప్రాయపడ్డారు.

సీఐడీకి మూడుసార్లు పంపాను

"2022 జనవరి నుంచి సీఐడీ వాళ్లు నా వెనుక పడడం మొదలుపెట్టారు. 2022 ఫిబ్రవరిలో నోటీసు ద్వారా 10 ప్రశ్నలు అడిగారు. సమాధానాలు కావాలంటూ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ వచ్చారు. దీంతో నేను సమాధానాలు రిజిస్టర్డ్ పోస్టులోనూ, ఆ అధికారుల వాట్సప్‌కూ పంపించాను. తర్వాత ఏప్రిల్ 24న మరో నోటీసు ద్వారా మరికొన్ని ప్రశ్నలు అడగ్గా.. జూన్ 28వ తేదీన సమాధానాలు పంపాను. మళ్లీ సెప్టెంబరులో మరికొన్ని ప్రశ్నలు అడగ్గా... సమాధానాలు రాసి పంపాను" అని వెల్లడించారు.

సమగ్ర విచారణ జరగాలి

"చంద్రబాబుకు అనుకూలంగా నిలిచే సాక్ష్యాలు ఆ మూడు శాఖల్లోని ఫైళ్లే. ఆ సాక్ష్యాలు ఒక్కసారిగా ఎలా మాయం అవుతాయి? ఎవరు మాయం చేస్తారు? నా 161 స్టేట్‌మెంట్‌ను మార్చిన వాళ్లు.. దొంగ సాక్ష్యాలను కోర్టుల ముందు సమర్పించి బాబును అరెస్టు చేయించిన అధికారులు ఇంకా ఆ స్థానాల్లోనే కొనసాగుతున్నారు. వాళ్లే ఉంటే విచారణ పారదర్శకంగా ఉండదు. సమర్థవంతమైన, నిజాయితీ గల అధికారులతో ఈ కుట్రలపై విచారణ చేయించాలి. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డీజీపీకి లేఖ రాశాను' అని పీవీ రమేశ్ చెప్పారు.



ముమ్మాటికీ కుట్రే!

(మొదటి పేజీ తరువాయి)

పీవీ రమేశ్ పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టుకు ముందు, ఆ తర్వాత జరిగిన పరిణామాల గురించి ఆయన సంచలన విషయాలు వెల్లడించారు. నాడు చంద్రబాబును ఎలాగైనా అరెస్టు చేసి జైల్లో వేయాలన్న కక్షసాధింపు ధోరణితో భారీ కుట్రలకు పాల్పడ్డారని చెప్పారు.

మొదటి కుట్ర

"మూడు విభాగాలకు చెందిన ఫైళ్లను ముందుగానే మాయం చేశారు. చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారం టీడీపీ ప్రభుత్వం చేసిన పనికి సాక్ష్యాలు చెరిపేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఫైళ్లు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో, సచివాలయంలో సంబంధిత శాఖా విభాగంలో, కేబినెట్ ఆమోదం కోసం వెళ్లిన ఫైళ్లు సాధారణ పరిపాలనా (జీఏడీ)శాఖలో కచ్చితంగా ఉంటాయి. ఒకేసారి ఈ ఫైళ్లన్నీ కనిపించకుండా పోవడం వెనుక జరిగిన కుట్ర ఏంటో ముందుగా ఛేదించాల్సిన అవసరం ఉంది. కార్పొరేషన్‌లోని ఫైళ్లు ఆ సంస్థ ఎండీకి, సచివాలయంలో సంబంధిత శాఖా ఫైళ్లు ఆ శాఖ సెక్రటరీకి, జీఏడీలోని ఫైళ్లు చీఫ్ సెక్రటరీకి, జీఏడీ పొలిటికల్ సెక్రటరీకి అందుబాటులో ఉంటాయి. అవి మాయమయ్యాయంటే వారిదే బాధ్యత. అందరూ కలిస్తేనే ఫైళ్లు మాయం అవుతాయి. ఆ ఫైళ్లు అందుబాటులో ఉంటే చంద్రబాబుపై కేసు నమోదు చేయడం కుదరదు. అందువల్లే ముందుగా ఆ ఫైళ్లు మాయం చేసి అరెస్టుకు మొదటి కుట్ర పన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం నిధులను అజేయ కల్లం విడుదల చేశారు" అని పీవీ రమేశ్ చెప్పారు.

స్కిల్‌లో అంతా సవ్యం

"2013-14లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఆ కార్పొరేషన్‌కు ఒక ఎండీని నియమించి, బడ్జెట్ కేటాయించారు. ఆ సమయంలో సీమెన్స్ ఇండియా వాళ్లు వచ్చి ఏపీలో నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రూ.3,000 కోట్లు పెట్టుబడులు పెడతామని చెప్పారు. సీఎస్ఆర్ నుంచి ఖర్చు చేస్తామన్నారు. నిర్వహణ ఖర్చుల కోసం మరో 10 శాతం మొత్తాన్ని బడ్జెట్ నుంచి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం ఉంది. దీనికి కావాల్సిన బడ్జెట్ కేబినెట్‌లో, చట్టసభల్లో ఆమోదం పొందాక, గవర్నర్ కూడా ఆమోదించాక, ఫైనాన్సు బిల్లు ఆమోదం పొందాక రూ.270 కోట్లు విడుదల చేశారు. ఇది పూర్తిగా చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారం జరిగింది. అందుకే ఆ ఫైళ్లన్నింటినీ ముందుగానే మాయం చేశారు" అని చెప్పారు.

చంద్రబాబు అరెస్టే లక్ష్యంగా...

"చంద్రబాబు అరెస్టు జరిగినప్పుడు సీఐడీ డీజీ, అడిషనల్ అడ్వొకేట్ జనరల్... నేను ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాన్ని నేను అప్పుడే ఖండించాను. 2019 జూన్ నుంచి 2020 అక్టోబరు వరకు నేను ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జగన్ ప్రభుత్వంలో విధులు నిర్వహించడంతో అక్కడ జరిగిన కొన్ని విషయాలు నాకు తెలుసు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబును అరెస్టు చేయాలని, కేసులు పెట్టాలని అనేవారు. కొందరు అధికారులు చాలా ఉత్సాహంగా సలహాదారులతో కలిసి చంద్రబాబును అరెస్టు చేయడం కోసం పనిచేశారు. ఇదిలా జరుగుతుండగా, పుణె జీఎస్టీ కమిషనర్ నుంచి సీమెన్స్ కంపెనీ చెల్లించాల్సిన జీఎస్టీ గురించి ఒక నోటీసు వచ్చిందని అప్పటి సీఎంవో అధికారి ప్రవీణ్ ప్రకాశ్ మాటవరుసగా నాకు చెప్పారు. ప్రవీణ్ ప్రకాశ్, అప్పటి ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర నా దగ్గరకు వచ్చి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఏవో అవకతవకలు జరిగాయని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అప్పటి ఎండీ అర్జ శ్రీకాంత్‌ను పిలిచి నేను మాట్లాడాను. అవకతవకలు ఏమీ లేవని, కొన్ని లక్షల మంది శిక్షణ ఇచ్చారని, చాలా సంస్థలు ఈ కార్యక్రమం వల్ల ప్రయోజనాలు పొందారని శ్రీకాంత్ చెప్పారు. ప్రభుత్వ విధానం, అక్కడి వాతావరణం నచ్చక నేను ఉద్యోగం వదిలేసి 2020 అక్టోబరులో వచ్చేశాను" అని వివరించారు.

చంద్రబాబు బలవంతం చేయలేదు

"ముఖ్యమంత్రి సహా ఉన్నతస్థాయి అధికారులంతా కీలక నిర్ణయాలపై, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఫోన్ల ద్వారా, నేరుగా అడిగి తెలుసుకుంటూ ఉంటారు. ఇందులో తప్పేమీ లేదు. చంద్రబాబు వర్క్ మైండెడ్. రాష్ట్రాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తారు. ఎప్పుడూ ఏ అధికారిని కూడా ఏ విషయంలో కూడా బలవంతంగా చేస్తావా చస్తావా అని చెప్పరు. ముఖ్యమైన విషయమైతే చూడండి.. ఇది మన ప్రభుత్వానికి కీలకమని చెప్తారు. బలవంతం చేయడం ఆయన తత్వం కాదు. ఇదైతే నేను గట్టిగా చెప్పగలను' అని పీవీ రమేశ్ చెప్పారు.

ఆడిటర్‌ను అడ్డంగా

వాడేశారు

- స్కిల్ కేసులో బాబు అరెస్టుకు నాడు మహాకుట్ర
- జగన్ ఆదేశించారు.. ఆడిట్ సంస్థ పాటించింది
- విచారణ జరిపిన తీరుపై ఆనాడే అనుమానాలు
- ఐసీఏఐకి తాజాగా ఆ సంస్థపై ఫిర్యాదు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా(సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాజెక్టు).. 2016-19 కాలంలో 4 లక్షల మంది నిరుద్యోగ యువత, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఇతర కాలేజీల్లో రూ.వందల కోట్ల విలువైన మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, శిక్షణాకేంద్రాలు నెలకొల్పారు. 1.82 లక్షలమందికి ఉద్యోగాలు లభించాయి. అయితే, దీనిలో రూ.241 కోట్ల నిధులు చేతులు మారి సూట్‌కేసు కంపెనీలకు వెళ్లాయని, దీనికి నాటి సీఎం చంద్రబాబే ప్రధాన కారకులని గత జగన్ ప్రభుత్వం నిరూపించాలనుకుంది. శరత్ అండ్ అసోసియేట్స్ అనే కంపెనీకి ఫోరెన్సిక్ ఆడిట్ విచారణ బాధ్యతను అప్పగించింది. విచారణపై జగన్ సర్కారు ఆనాడు ఓ కీలక షరతు విధించింది. అదేమంటే, స్కిల్ ప్రాజెక్టులో భాగంగా ఇంజనీరింగ్, వృత్తివిద్యా కాలేజీల్లో నెలకొల్పిన కంప్యూటర్ ల్యాబ్‌లు, కొనుగోలు చేసిన సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణా కేంద్రాలు పరిశీలన చేయవద్దనేది ఆ షరతు. సహజంగా ఓ ప్రాజెక్టు అమలైందా? లేదా దోపిడి జరిగిందా? అన్నది తెలియాలంటే, ముందుగా ఆ ప్రాజెక్టు పేరిట ఎంత ఖర్చుచేశారు? వాటి ఫలితాలు ఎక్కడున్నాయి? వాటి భవిష్యత్తు ఏమిటో నిగ్గుతేల్చాలి. కానీ జగన్ సర్కారు ఇలాంటి వాటినే కన్నెత్తి చూడొద్దని చెప్పింది. అంటే ప్రాజెక్టులో 75 శాతం కీలకమైన అంశాన్నే విచారణ పరిధి నుంచి తప్పించింది. ఇది జగన్ కుట్రలోని మొదటి కోణం. జగన్ అనుకూల లక్ష్యాలను ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేల్చారు.

శరత్ అసోసియేట్స్‌పై ఐసీఏఐకి ఫిర్యాదు

వాస్తవాలను, వాటిని ధ్రువపరిచే డాక్యుమెంట్లను పరిశీలన చేయకుండా, తాము ఇచ్చిన స్టేట్‌మెంట్లను కన్నెత్తి చూడకుండా, ఏకపక్షంగా అసత్యాలు, పచ్చిఅబద్ధాలు, అర్థం లేని ఆరోపణలతో శరత్ అండ్ అసోసియేట్స్ సంస్థ అడ్డగోలు విచారణ నివేదిక ఇచ్చిందని, దానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజైన్‌టెక్ అనే కంపెనీ.. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియాకు(ఐసీఏఐ) ఫిర్యాదు చేసింది. మరోసారి ఇలాంటి తప్పుడు నివేదికలు ఇవ్వకుండా సీఏ నుంచి శాశ్వతంగా తొలగించాలని కోరింది. ఈ ఫిర్యాదులోని కీలక అంశాలను పరిశీలిస్తే, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో నిధులు దారి మళ్లాయనే విషయం చెప్పడానికి 'శరత్ అసోసియేట్స్' ఎంతగా ఆరాటపడిందో స్పష్టమవుతోంది. ఫోరెన్సిక్ ఆడిట్‌లో 'శరత్ అసోసియేట్స్' లేవనెత్తినవి పచ్చి అబద్ధాలు అని చెబుతూ డిజైన్‌టెక్ కొన్ని అంశాలను ప్రస్తావించింది.

ఆ సంస్థ అబద్ధాలే చెప్పింది: డిజైన్ టెక్

1. కీలకమైన సాఫ్ట్‌వేర్‌ను సిస్టమ్స్‌లో ఇన్‌స్టాల్ చేయలేదని, అనేక సాఫ్ట్‌వేర్‌లకు అసలైన కీ(కంపెనీ ఇచ్చేది) లైసెన్సు ఇవ్వలేదని, సాంకేతిక విద్యలోని బోధకులు ఇచ్చిన ఇన్వెంటరీలో ఉందని.. విచారణ సంస్థ శరత్ అసోసియేట్స్ తన నివేదికలో పేర్కొంది. ఇది పచ్చి అబద్ధమని డిజైన్‌టెక్ పేర్కొంది. తాము అన్ని సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేశామని, వాటికి కీ, లైసెన్సులతో కూడిన ఎక్సెల్‌షీట్‌ను కూడా సమర్పించామని తెలిపింది. నిజానికి, స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రాలను విచారణసంస్థ భౌతిక పరిశీలన చేసి ఉంటే ఈ విషయంలో స్పష్టత వచ్చి ఉండేది.
2. "370.78 కోట్ల వ్యయంలో డిజైన్‌టెక్ రెండేళ్లపాటు శిక్షణా కేంద్రాల నిర్వహణ, సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టలేషన్, ఇతర పనుల కోసం 100 కోట్లు తీసుకుంది. కానీ దీనికి సంబంధించిన డాక్యుమెంట్లేవీ అందుబాటులో లేవు. ఆ సంస్థ అందించలేదు. డిజైన్‌టెక్ ఎక్కడ? ఎంత ఖర్చుపెట్టిందో తెలిపే వివరాలే ఇవ్వలేదు" అని శరత్ అసోసియేట్స్ పేర్కొంది. ఇది పూర్తిగా అబద్ధమని డిజైన్‌టెక్ స్పష్టం చేసింది. తాము శరత్ అసోసియేట్స్‌కు వీటిని ఇచ్చామని తెలిపింది. ఆర్థిక లావాదేవీల డాక్యుమెంట్లు అన్నీ తమ ఆఫీసులో ఉన్నాయని, కానీ విచారణ సంస్థ తమ ఆఫీసుకు కూడా రాలేదని పేర్కొంది.
3. "సీమెన్స్, డిజైన్‌టెక్‌లు 241.78 కోట్ల నిధులను షెల్ కంపెనీలకు దారిమళ్లించినట్లు ప్రాథమికంగా వెల్లడవుతోంది. ఎలాంటి సేవలు అందించకున్నా స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్‌కు నిధులు మళ్లించినట్లుగా ఉంది" అని శరత్ అసోసియేట్స్ తన నివేదికలో పేర్కొంది. దీన్ని డిజైన్‌టెక్ ఖండించింది. స్కిల్లర్స్ సంస్థ అన్ని రకాల సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లు కొనుగోలుచేసి సరఫరా చేసిందని, అందుకు సంబంధించిన బిల్లులను సమర్పించిందని గుర్తుచేశారు. పక్కా ఆధారాలు సమర్పించిన సంస్థ షెల్‌కంపెనీ ఎలా అవుతుందని డిజైన్‌టెక్ ప్రశ్నించింది.

కుట్రకోణం స్పష్టం

ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఇచ్చిన శరత్ అసోసియేట్స్‌పై డిజైన్‌టెక్ కంపెనీ ఐసీఏఐకి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టాలి. ఎందుకంటే, ఆ సంస్థ ఇచ్చిన నివేదికలో ఎలాంటి తప్పులు ఉన్నాయో డిజైన్‌టెక్ సవివరంగా తెలిపింది. ఏవో ఒకటో,రెండో కాదు....ఏకంగా 14 కీలకాంశాల్లో మొత్తం ప్రాజెక్టు భవితవ్యాన్ని, దాన్ని చేపట్టిన తమ కంపెనీ భవిష్యత్తును దెబ్బతీసేలా నివేదిక ఇచ్చిందని, కాబట్టి ఆ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజైన్‌టెక్ కోరుతోంది. ఈ ఫిర్యాదును సాంతం పరిశీలన చేస్తే, జగన్ సర్కారు...చంద్రబాబును జైలుకు పంపించే కుట్ర అమలుకోసం చివరకు ఆడిటర్ సంస్థను కూడా అడ్డంగా వాడుకున్నట్లుగా స్పష్టమవుతోంది. ఫోరెన్సిక్ ఆడిట్ సంస్థ ఎంపిక కోసం రూపొందించిన టెండర్ డాక్యుమెంట్‌లో శిక్షణా కేంద్రాలు, ల్యాబ్‌లు, కంప్యూటర్ సెంటర్ల భౌతిక పరిశీలన అనే అంశం ఉంది. ఆ తర్వాత జరిగిన ప్రీబిడ్ మీటింగ్‌లో ఆ అంశాన్ని ఆర్ఎఫ్‌పీ నుంచి తొలగించడం ద్వారా సర్కారు తన అసలు ఉద్దేశాలను బయటపెట్టుకుంది. చివరకు ఆడిటర్ సంస్థ శరత్ అసోసియేట్స్ కూడా తన నివేదికలో భౌతిక ఆస్తులను ప్రభుత్వం పరిశీలన చేయవద్దన్న అంశాన్ని ప్రస్తావించడం గమనార్హం. నిష్పాక్షిక విచారణ జరిపించాలనుకున్న ప్రభుత్వం షరతులు విధించింది అంటేనే దాని వెనక ఉన్న కుట్రకోణం స్పష్టమవుతోందని నిపుణులు చెబుతున్నారు.

108, 104 ఉద్యోగులతో 'ట్రస్టు' చర్చలు

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 108 అంబులెన్స్, 104 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఇచ్చిన సమ్మె నోటీసులకు ప్రభుత్వం స్పందించింది. ఈ నెల 11న ఉద్యోగ సంఘాలు సమ్మె నోటీసులు ప్రభుత్వానికి, అరబిందో యాజమాన్యానికి ఇచ్చాయి. ఈ నేపథ్యంలో 108, 104 వాహనాల అదనపు సీఈవో కె.అప్పారావు... ఉద్యోగ సంఘాలు, అరబిందో సంస్థను చర్చలకు ఆహ్వానించారు. చర్చల్లో భాగంగా 108 అంబులెన్సులు, 104 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఉద్యోగ సంఘా లు డిమాండ్ చేశాయి. 'అరబిందో... ఇన్సెంటివ్స్, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదు. పీఎఫ్, ఈఎస్ఐలను నెలవారీ కట్టడం లేదు' అని అదనపు సీఈవో దృష్టికి తీసుకెళ్లాయి. ఉద్యోగులకు అరబిందో సంస్థ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ మొత్తం సక్రమంగా చెల్లించాలని, ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు అన్నింటినీ అమలు చేయాలని అదనపు సీఈవో సూచించారు.

డిప్యూటీ సీఎం పవన్‌పై ఎంఐఎం కార్యకర్త ఫిర్యాదు

- ఫిర్యాదుపై న్యాయ సలహా .. హైదరాబాద్ సీపీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎంఐఎం కార్యకర్త ముబాషీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీ వాసులు భారతీయ సంస్కృతిని విమర్శిస్తారంటూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరి కాదని, తమను అవమానించేలా వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి తరఫున మహారాష్ట్రలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారని వీడియోను జత చేశారు. నాందేడ్ జిల్లా దెగ్లూరులో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఉండే కొందరు నేతలు పోలీసులు 15 నిమిషాల పాటు కళ్లు మూసుకుంటే హిందువులకు తామేంటో చూపిస్తామని అంటారు... విడిపోయి హిందువుల అస్తిత్వాన్ని ప్రమాదంలోకి నెట్టేద్దామా? లేక కలిసి బంగారు భవిష్యత్తును నిర్మించుకుందామా.. అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. దీనిపై ఎంఐఎం నేత ముబాషీర్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సీపీ ఆనంద్ స్పందిస్తూ న్యాయ సలహా తీసుకుంటున్నట్లు 'ఎక్స్'లో బదులిచ్చారు.

వర్రా అరెస్టుపై కౌంటర్ వేయండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని వర్రా రవీంద్రరెడ్డి భార్య కల్యాణి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. రవీంద్రరెడ్డిని తమ ముందు హాజరుపర్చాలని ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా పోలీసులు సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని అభిప్రాయపడింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. తన భర్తను పోలీసులు వివిధ ప్రాంతాల్లో తిప్పి చిత్రహింసలకు గురిచేశారని కల్యాణి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా రవీంద్రరెడ్డిని తమ ముందు హాజరుపర్చాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. సోమవారం పిటిషన్ మరోసారి విచారణకు రాగా రవీంద్రరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రవీంద్రరెడ్డిని ఈ నెల 8నే పోలీసులు అరెస్ట్ చేశారని నిరూపించేందుకు మహబూబ్‌నగర్ టోల్‌ప్లాజా సీసీటీవీ ఫుటేజ్‌ను అదనపు అఫిడవిట్‌కు జత చేశామన్నారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఎన్‌హెచ్ఏఐను ప్రతివాదిగా చేరిస్తేనే సీసీటీవీ ఫుటేజ్ భద్రపర్చే విషయంలో తాము ఆ సంస్థకు తగిన ఆదేశాలు ఇవ్వగలమని పిటిషనర్‌కు స్పష్టం చేసింది.

వర్రా కస్టడీ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

కడప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వర్రా రవీంద్రరెడ్డిని కస్టడీలోకి తీసుకునేందుకు పులివెందుల పోలీసులు కడప కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా పడింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, హోంమంత్రి అనితతో పాటు ఇతరులపై వర్రా రవీంద్రరెడ్డి సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెట్టారు. దీంతో ఇతనిపై రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఇదే కేసులో ఉన్న మరో నిందితుడు ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ముందస్తు బెయిలు కోసం కోర్టును ఆశ్రయించారు. ఇది కూడా బుధవారానికి వాయిదా పడింది.

బూతులు తిట్టిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలి

- టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో జనసేన నేతల ఫిర్యాదు

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై శ్రీకాకుళం జిల్లా టెక్కలి పోలీసుస్టేషన్‌లో జనసేన నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. టెక్కలి జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ సందర్భాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ.. అప్పటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దారుణమైన బూతు పదాలతో పవన్‌ను దూషించారు. టీడీపీ, జనసైనికుల మనోభావాలు దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలి' అని కోరారు. దువ్వాడ దారుణ వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్‌లను పెన్‌డ్రైవ్‌లో పోలీసులకు అందజేశారు.

వివేకా హత్య కేసులో ఉమాశంకర్‌రెడ్డికి బెయిల్

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-3గా ఉన్న గజ్జల ఉమాశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. నిందితుడు ఉమాశంకర్‌రెడ్డి పాలు అమ్ముకుని జీవించే వ్యక్తి అని, అతడు 2021 సెప్టెంబరు నుంచి సుదీర్ఘకాలంగా జైల్లో ఉన్నాడని తెలిపింది. ప్రత్యక్ష సాక్షి అయిన రంగన్న స్టేట్‌మెంట్‌కు, ఏ-4 దస్తగిరి (అప్రూవర్) స్టేట్‌మెంట్‌కు మధ్య తేడాలు ఉన్నాయని తెలిపింది. ఇవన్నీ విచారణలో తేలాల్సిన అంశాలని పేర్కొంది. అందువల్ల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. రూ. 25 వేల వ్యక్తిగత బాండు, సీబీఐ కోర్టు నిర్దేశించిన మొత్తానికి ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని తెలిపింది. ప్రతి శనివారం పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని, పాసుపోర్టు ఉంటే స్వాధీనం చేయాలని, విచారణలో ఏ రకంగానూ జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది.



జి.మాడుగుల కేజీబీవీ బాధిత బాలికలు

ఇదేం క్రమ'శిక్ష'ణ!?

- జి.మాడుగుల కేజీబీవీలో బాలికల జుట్టు కత్తిరించిన ఎస్‌వో సాయిప్రసన్న
- తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

పాడేరు/జి.మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో అమానుష ఘటన చోటుచేసుకుంది. బాలికల పట్ల ప్రత్యేకాధికారిణి సాయిప్రసన్న దారుణంగా ప్రవర్తించారు. పాఠశాలలో రోజువారీగా ఉదయం నిర్వహించే అసెంబ్లీ కార్యక్రమానికి హాజరు కాలేదన్న కోపంతో క్రమశిక్షణ పేరిట పలువురి జుట్టు కత్తిరించారు. సాయిప్రసన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాలికల తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఘటనపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావును కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జి.మాడుగుల కేజీబీవీలో పలువురు విద్యార్థినులు గత శుక్రవారం ఉదయం అసెంబ్లీకి హాజరు కాలేదు. ప్రత్యేకాధికారిణి బాలికల వద్దకు వెళ్లి.. ప్రార్థనకు ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా తల స్నానాలు చేశామని, నీటి సమస్య వల్ల ఆలస్యం కావడంతో రాలేకపోయామని విద్యార్థినులు వివరణ ఇచ్చారు. ఆ సమయంలో బాలికలు జుట్టును ఆరబెట్టుకుంటూ కనిపించడంతో ప్రత్యేకాధికారిణి...'అసెంబ్లీ ప్రార్థన, తరగతులు కంటే మీకు జుట్టే ప్రాధాన్యంగా ఉందా' అని మండిపడ్డారు. అంతటితో ఆగకుండా క్రమశిక్షణ లేకుండా పోయిందంటూ 18 మంది బాలికల జుట్టును 3-4 అంగుళాల మేర కత్తిరించారు. కొంత మంది ఆమె నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించగా.. వారి వెంటబడి మరీ కత్తిరించారు. ఇద్దరు ముగ్గురు తమకు మొక్కు ఉందని, కత్తిరించకూడదని చెప్పినా వినలేదు. దీనిపై బాలికల తల్లిదండ్రులు ఆదివారం విద్యాలయానికి రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రత్యేకాధికారిణి కొన్నాళ్లుగా తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఈ క్రమంలోనే తమ జుట్టు కత్తిరించారని బాధిత బాలికలు వాపోయారు.

క్రమశిక్షణలో భాగంగానే..: ఎస్‌వో సాయిప్రసన్న

క్రమశిక్షణలో ఉంచాలనే ఆలోచనతోనే బాలికల జుట్టును కత్తిరించానని, వారిపై తనకు వ్యక్తిగత కక్ష లేదని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సాయిప్రసన్న వివరణ ఇచ్చారు. గత రెండు నెలలుగా బాలికలు క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వాళ్లు చక్కగా చదువుకోవాలని, సన్మార్గంలో ఉండాలనే ఆలోచనతోనే జుట్టును కత్తిరించానని, అంతేతప్ప మరో ఆలోచన లేదన్నారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు విచారణ చేపట్టారు. సాయిప్రసన్న, టీచర్లు, బాలికలతో వేర్వేరుగా మాట్లాడారు. బాలికల తల్లిదండ్రులతోనూ మాట్లాడారు. కలెక్టర్‌కు నివేదిక సమర్పించిన తర్వాత, ఆయన నిర్ణయం మేరకు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు విద్యాలయాన్ని సందర్శించి.. బాలికలు, ఉన్నతాధికారులతో మాట్లాడారు. జిల్లా బాలికా సంరక్షణాధికారిణి సూర్యకుమారి ఘటనపై ఆరా తీశారు. సాయిప్రసన్నపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. ఆమెను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాలికలను క్రమశిక్షణలో పెట్టాలనే వారి జుట్టు కత్తిరించానని, అది తప్పని తెలియదని, తనను క్షమించాలని సాయిప్రసన్న ఈ సందర్భంగా వేడుకున్నారు.

కలెక్టర్‌ను నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్

బాలికల జుట్టు కత్తిరింపు ఘటనపై నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సోమవారం ఆదేశించింది. క్రమశిక్షణ పేరిట జుట్టును కత్తిరించడం, మానసికంగా వేధించడం, బాలికల ఆత్మవిశ్వాసాన్ని సన్నగిల్లేలా చేయడమేనని కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ అభిప్రాయపడ్డారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు చేపట్టాలని సిఫారసు చేయనున్నట్లు కమిషన్ పేర్కొంది.

హైవేపై అఘోరి హైడ్రామా

- మంగళగిరిలో స్థానికులు, పోలీసులపై దాడి
- డిప్యూటీ సీఎం పవన్‌ను కలుస్తానని పట్టు
- హైవేపై బైఠాయింపు... అడ్డుకున్న జనసేన కార్యకర్తలు
- బందోబస్తుతో రాష్ట్ర సరిహద్దు దాటించిన పోలీసులు



జాతీయ రహదారిపై బైఠాయించిన అఘోరి

మంగళగిరి సిటీ, జగ్గయ్యపేట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉభయ రాష్ట్రాల్లో గత కొద్దిరోజులుగా హల్‌చల్ చేస్తున్న అఘోరి సోమవారం మంగళగిరిలో హంగామా సృష్టించింది. అఘోరి తరచూ మంగళగిరి వస్తూ.. ఆటోనగర్ ఎదురుగా ఉన్న ఓ కార్ వాష్ సెంటరులో కారును శుభ్రం చేయిస్తోంది. సోమవారం ఉదయం కూడా కార్ వాష్‌కు రాగా.. పలువురు ఫొటోలు తీసేందుకు ప్రయత్నించారు. ఆగ్రహించిన అఘోరి త్రిశూలంతో వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో ఓ జర్నలిస్టు కాలు విరిగింది. తర్వాత మంగళగిరి డిపో రోడ్డు, ఆటోనగర్ మీదుగా నడుచుకుంటూ వెళ్లిపోయింది. కొద్దిసేపటి తర్వాత జనసేన కేంద్ర కార్యాలయం సమీపంలో ప్రత్యక్షమైంది. కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా జనసైనికులు జాతీయ రహదారిపైనే అడ్డుకున్నారు. డిప్యూటీ సీఎం కోసం వచ్చానని, ఆయనను కలిసే వెళతానంటూ అఘోరి హైవేపైనే బైఠాయించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. అఘోరికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. వారిపైనా దాడికి పాల్పడింది. శరీరంపై దుస్తులు కూడా లేకపోవడంతో పోలీసులు అఘోరిని బలవంతంగా తాళ్లతో బంధించి, వస్త్రాలు కప్పారు. కొద్దిసేపటి తర్వాత బంధనాలు తొలగించడంతో మళ్లీ వారిపై విరుచుకుపడింది. దాదాపు మూడున్నర గంటలసేపు హైవేపై హల్‌చల్ చేసింది. ఎట్టకేలకు స్థానికులు, పోలీసులు నచ్చజెప్పి.. అఘోరిని ప్రత్యేక వ్యానులో ఎక్కించి, బందోబస్తు మధ్య రాష్ట్ర సరిహద్దులు దాటించారు. చిల్లకల్లు పోలీసులు గౌరవరం నుంచి ప్రత్యేక ఎస్కార్ట్‌తో ఆమె వాహనాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించారు. దారిలో వాహనం ఆపి దిగాలని ఆమె ప్రయత్నించినా పోలీసులు అడ్డుకుని, వేగంగా సరిహద్దులు దాటించేశారు.

దాబా సిబ్బందిపై దాడి కేసులో..

బోరుగడ్డను విచారించిన పోలీసులు

- మంగళగిరి కోర్టులో హాజరు.. రాజమండ్రికి తరలింపు
- నేడు మరో కేసులో తుళ్లూరు తీసుకొచ్చి విచారణ



సోమవారం పోలీసు జీపులో మంగళగిరి కోర్టుకు బోరుగడ్డ అనిల్‌ను తరలిస్తున్న దృశ్యం

తుళ్లూరు, నవంబరు 18: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను తుళ్లూరు పోలీసులు సోమవారం విచారించారు. ఈ ఏడాది మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని దాబాలో పని చేస్తున్న వారిని బెదిరించి, దాడి చేసిన సంఘటనపై అప్పట్లో అతడిపై కేసు నమోదైంది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతడిని పీటీ వారెంట్‌పై తుళ్లూరు స్టేషన్‌కు తీసుకొచ్చి సోమవారం ప్రశ్నించారు. డీఎస్పీ టి.మురళీకృష్ణ మూడు గంటల పాటు అతడిని విచారించారు. ఒక రోజు కస్టడీ ముగియడంతో సాయంత్రం నాలుగున్నర గంటలకు మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం రిమాండ్ నిమిత్తం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అలాగే మే 8వ తేదీ రాత్రే తుళ్లూరులో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ విధులకు ఆటంకం కలిగించడం, అసభ్యంగా మాట్లాడడం, విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి చేయడం తదితర సంఘటనలకు సంబంధించి అనిల్‌పై మరో కేసు నమోదై ఉంది. ఈ కేసులో మంగళవారం అతడిని తిరిగి రాజమండ్రి జైలు నుంచి తుళ్లూరు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించనున్నారు.

డిసెంబరు 28న విచారణకు రండి

- నకిలీ పట్టాల పంపిణీ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీకి కోర్టు ఆదేశం

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు నకిలీ పట్టాలు పంపిణీ చేశారంటూ నమోదైన కేసులో డిసెంబరు 28న విచారణకు హాజరు కావాలని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను నూజివీడు కోర్టు ఆదేశించింది. వంశీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నకిలీ పట్టాలు పంపిణీ చేశారని బాపులపాడు మండలానికి చెందిన సీహెచ్ సూర్యనారాయణ నూజివీడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయవాదులు కిలారు బెనర్జీ, కిలారు నితిన్‌కృష్ణ వాదనలు వినిపించారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం 40 మందిని విచారించింది. అప్పటి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పట్టాలు పంపిణీ చేసినట్టు వారు వాంగ్మూలం ఇచ్చారు. కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నందున వచ్చేనెల 28న విచారణకు రావాలని వంశీని ఆదేశిస్తూ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది.

వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు పోలీసుల నోటీసులు

- ఐదు కేసుల్లో చర్యలు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 18: ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు సోమవారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. 2024 ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని అధికారుల ఫిర్యాదుతో అప్పట్లో ఆయనపై నాలుగు కేసులు నమోదు చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై ఆయన ఎక్స్‌లో ఆరోపణ చేయగా.. వాటిపై స్థానిక మూడోవార్డు ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ కిశోర్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించిన నోటీసులు చంద్రశేఖర్ నివాసంలో అందించినట్లు ఎర్రగొండపాలెం ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

కాగ్ చీఫ్‌గా సంజయ్ మూర్తి

న్యూఢిల్లీ, నవంబరు 18: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) చీఫ్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ మూర్తి నియమితులయ్యారు. ప్రస్తుత కాగ్ చీఫ్ జీసీ ముర్ము పదవీకాలం బుధవారంతో ముగియనుంది. ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన సంజయ్.. 1989లో ఐఏఎస్‌కు ఎంపికై.. హిమాచల్ క్యాడర్‌లో సేవలందించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* **Editor : N.Rahul Kumar,** *RNI No:3470/1960,* **Managing Director : Vemuri Radha Krishna, Founder :** *K.L.N. Prasad.*